భారత్ మంత్రాలు

13805

భారతమంత్రములు.

గ్రంథకర్త
మహోపాధ్యాయ
బ్రహ్మశ్రీ ముదిగొండ నాగలింగశాస్త్రి,
తెనాలి.

శ్రీ

శివాభ్యాంనమః

భారతమంత్రులు.

ఇయ్యది

తెనాలి గ్రామవాస్తవ్య

మహోపాధ్యాయ

బ్రహ్మశ్రీ, కుదిగొండ నాగలింగశాస్త్రిచే

విరచితము

వీరిచే

తెనాలి రామ్మోహన ప్రింటింగువర్క్సునందు

ముద్రాపితము.

1930

Copy Right Registered

Price 0-12-0]

వెల 0—12—0.

OPINION.

I read this book Bharata Mantrulu with care. By reading this small book which is written in easy and racy style we can know the history of 4 important periods of our Bharatavarsha. In some places the author has taken care to write this book in easy and conversational style. I think the School authorities can do well to prescribe this book as one of the textbooks in Telugu for the 5th and 6th Forms.

D. Chitambara Rao.

Tenali,
21-4-1930.

Principal District Munsiff and Honorary President of the Taluk High School, Tenali

శ్రీరస్తు.

భూ మి క.

సహృదయమహాశయులారా!

బాలురకుఁ బఠనీయములగు వానిలో నీతిబోధకాఖ్యానకములే ముఖ్యమనుటయు, అందును రాజనీతివిశారదులై భరతఖండ సామ్రాజ్య ప్రతిష్ఠాపనధురీణులైన మహామంత్రులచరిత్రములు సంకటసమయములయందుఁ దన్నునాశ్రితుని నుద్ధరించు నుపాయములను స్ఫురింపఁ జేయునవి యగుటం జేసి ప్రతిభాతిశయసాధకంబులనుటయు మీారలెఱుంగనిదిగాదు. అట్టి మహామంత్రులలోన నగ్రగణ్యుండైన యౌగంధరాయణుని ప్రతిభావిశేషమును దెలుపు నుదయనుని చరిత్రము శ్రీమహాకవి కాళిదాసునిచే మేఘదూతమున నుజ్జయినీపురవర్ణనఘట్టమున శ్లో॥ ప్రద్యోతస్య ప్రియదుహితరం వత్సరాజోత్రజహ్రే॥ వత్సరాజు ప్రద్యోతుని ప్రియపుత్రిక నపహరించెనని తెలుపఁబడియెను. దీనింబట్టి నీపురసంబంధములగు ప్రాచీనచరిత్రములలో నుదయనచరిత్ర మత్యద్భుతాఖ్యానకమని స్పష్టమగుచున్నది. ఇందు వత్సరాజును బట్టనెంచి భరతరోహకుఁ డనుమంత్రివరుఁడు కృత్రిమగజమును నిర్మించెననుటచేఁ బూర్వకాలమున భరతఖండవాసులకుగల యంత్రనిర్మాణకుశలత వ్యక్తమగుచున్నది. ఈచరిత్రము ప్రతిజ్ఞాయౌగంధరాయణము మొదలగు భాసమహాకవి

నాటకములనుండి గ్రహింపఁబడియెను. ఉదయనుఁడు భారత వీరవరుఁడైన యభిమన్యునకుఁ బదునేనవవాఁడనుటంబట్టి కలి యుగమున నన్నూఱువత్సరంబులు గడచిన కాలమున యౌగంధరాయణుఁడు రాజ్యతంత్రము నడిపినట్లు తోచు చున్నది.

యౌగంధరాయణుఁడు చాణక్యునకుఁ బూర్వుఁడు. ఏలన, శ్లో॥ నన్దాంతం క్షత్రియకులం॥ క్షత్రియకులము నందు లతో నంతమొందునని పురాణముల యందుఁగలదు. ఆవచ నమునకు నందులతో క్షత్రియప్రభుత్వ మంతరించుననుసర్థము గ్రహించినను పాండవవంశ్యుఁడగు నుదయనుఁడు నందుల తరువాత పుడమి శాసించుట యసంభవముగాన నారాజన్యు నకు నమాత్యుఁడైన యౌగంధరాయణుఁడు చాణక్యునకుఁ బ్రాచీనుండనుట నిర్వివాదము.

చాణక్యనుద్దేశించి విష్ణుపురాణమునందు, నవచైతా న్నందా న్కౌటిల్యో బ్రాహ్మణస్సముద్ధరిష్యతి। కౌటిల్యఏవ చంద్రగుప్తం రాజ్యేఽభిషేక్ష్యతి। అతఃపరం శూద్రాఏవ పృథివీం భోక్ష్యన్తి॥ నవనందులను గౌటిల్యుఁడను బ్రాహ్మ ణుఁడు నిర్మూలముసేయును. ఆకౌటిల్యుఁడు చంద్రగుప్తుని రాజ్యమున నభిషిక్తుని గావించును. తరువాత శూద్రులే భూమినిఁ బాలింతురు- అనియున్నది. బృహత్కథయందు,

శ్లో॥ చాణక్యనామ్నా తేనాథ శకటారగృహేరహః।
కృత్యాంవిధాయ సప్తాహాత్సపుత్రో నిహతోనృపః॥

చాణక్యుఁడు క్షపణక వేషధారియగు నిందుశర్మ గృహమున నాభిచారికవిధిచే కృత్యనుబుట్టించి యేడుదినములలో సపుత్త్రికుఁడగునందరాజును జంపెనని యున్నది. కామందక రచితమగు నీతిశాస్త్రమునందును,

శ్లో॥ యస్యాభిచార వజ్రేణ వజ్రజ్వలన తేజసః।
పపాత మూలతశ్శ్రీమా న్సుపర్వానంద పర్వతః।
నీతిశాస్త్రామృతం శ్రీమానర్థ శాస్త్రమహోదధేః।
య ఉద్దధే నమస్తస్మై విష్ణుగుప్తాయ వేధసే॥

ఎవ్వని యాభిచారిక వజ్రముచే నందకుల పర్వతము మొదలంటఁగూలెనో అర్థశాస్త్ర సముద్రంబునుండి నీతిశాస్త్రామృతము నెవ్వండుద్ధరించెనో అట్టి విష్ణుగుప్తునకు నమస్కారమని యున్నది.

ఈవచనమునుబట్టి చాణక్యుఁ డాభిచారికవిధిచే నందరాజుల వధించినట్లు తెలియుచున్నది. అయినను ముద్రారాక్షసమునందుఁ దత్కర్తయగువిశాఖదత్త మహాకవి యాభిచారిక ప్రయోగము నీతికుశలతకు సాధకముగాదని యోజించి చాణక్యుఁడు పర్వతేంద్రునితో సంధచేసికొని యాతనిచే నందులను ధ్వంసము సేయించినట్లు తెలిపెను. చాణక్యుని ప్రతిభాతిశయమును బ్రకటింప ముద్రారాక్షసమే తగియుండునట్లు జేసి యదియే చాలవఱకు సంగ్రహింపఁబడియెను. చాణక్యుండు జీవితకాలమెల్ల మంత్రిపదమున వసింపకున్నను మంత్రశక్తిచే చంద్రగుప్తునకు రాజ్యము నొసఁగుటయెగాక యుపాయ కౌశలముచే మంత్రి

రాక్షసుని నిగ్రహించి సామ్రాజ్యము సుప్రతిష్ఠితముగావించు టవలన మంత్రివరుఁడు గానె యుంసుగ్రహింప బడియెను. చంద్రగుప్తునికాలము క్రీ. పూ. ౩౨౨ గావున చాణక్యుఁడునప్పటివాఁడేయగు,

ముద్రారాక్షసము ప్రతిజ్ఞాయౌగంధరాయణము నను నాటకములిందు సంగ్రహింపఁ బడుటను ఇదియె సుబోధకమగుటను రచన ప్రాయికముగా సంభాషణ రూపముగానె స్వీకరింపఁబడియెను.

తరువాత యుగంధరుని ప్రతిభను దెలుపు ప్రతాపరుద్ర చరిత్రంబును తిమ్మరుసుచరిత్రంబును, సుప్రసిద్ధములగుటచే సంగ్రహరూపముగా గ్రహింపఁబడియె?

ప్రతాపరుద్రుఁడు క్రీ. శ. ౧౨౯౬ మొదలుకొని ౧౩౨౩ వఱకు రాజ్యము చేసినట్లు చరిత్రకారులు తెలుపుచు న్నారు.

ఈగ్రంథము పూర్వరాజుల చరిత్రములను మహామంత్రులచరిత్రములను దెలుపునదియగుటను ఈదేశచరిత్రమున కుసంబంధించినదగుటను నభిమానము వహించి దీనిని బాలభాషాశిక్షకు వినియోగింపఁ బ్రార్థించుచున్నాఁడను.

ఇట్లు

మహామహోపాధ్యాయ

ముదిగొండ నాగలింగశాస్త్రి

తెనాలి.

శ్రీ

శివాయగురవేనమః.

భారతమంత్రులు.

యౌగంధరాయణుఁడు.

ప్రథమప్రకరణము.

కౌశాంబీవర్ణనము.

శ్రీమండితమగుభరతఖండమునందు వత్ససంజ్ఞతోనొప్పు నొకదేశము గలదు. దానినిఁదొల్లి యుదయనుఁడనురాకుమారుఁడు కౌశాంబీపట్టణము రాజధానిగాఁజేసికొని పాలించుచుండెను. ఈరాజన్యుఁడు భారతవీరవరుండగు నభిమన్యునకుఁ బదునేనవవాఁడు. ఈధరాధిపునందు లేనిసుగుణము వాఙ్మయముననె లేదు. దాననే యీతనిగుణజాతంబునకు మెచ్చి వాసుకితమ్ముఁడు వసునేమియనువాఁ డమ్లానమగుపుష్పహారమును, నిజనాదసమ్మోహితసకలజంతుజాతమగుఘోషవతియను వీణావిశేషము నీతనికొసఁగి మైత్రి నార్జించుకొని యుండెను.

ఈరాజచంద్రునకు యుగంధరుఁడనుమహామాత్యునిపుత్రుఁడు యౌగంధరాయణుఁడు ముఖ్యమంత్రిగా నుండెను. మఱియు రుమణ్వంతుఁడు హస్తిరక్షితుఁడునని యిర్వురుమంత్రులుండిరి. ఆనరపతి యీముప్వురుమంత్రులఁగూడి ధర్మపథంబునఁ బ్రజలం బాలింపుచుండెను. ఈయిలాకళత్రుండు సకలకళాకోవిదుండై గాంధర్వరసికుండగుట రాజ్యభరంబుమంత్రులపైనునిచి ఘోషవతిమ్రోయించుచు తదీయనినదంబునకుఁ జొక్కి యేతెంచుమదపుటేనుంగులఁ బట్టుకొనియాడించుచుఁ బెక్కుకాల మడవులయందఁ బ్రొద్దులుపుచ్చుచుండును.

ఆకాలమునఁ బ్రద్యోతుఁడనుభూవరుఁ డుజ్జయినిం బాలించుచుండెను. అతఁ డప్పురమున నెలకొన్న మహాకాళేశ్వరునకు భక్తుఁడు. ఈతఁ డొకప్పుడు వింధ్యవాసినియగుమహాకాళినిఁ బ్రణుతిసేసి మెప్పింప నమ్మహాదేవి యాతని కొకఖడ్గంబునొసఁగి యిద్దానిచే వైరివర్గంబునెల్ల దునుమాడుదువని వరంబొసఁగి యనిచెను. ఆవీరవరుండు దేవీదత్తఖడ్గప్రభావంబున వైరిభీకరుండై చండమహాసేనుఁడను పౌరుషనామము వహించి యుండెను. ఆతం డొకపరి పాతాళంబునకుఁబోయి యందొకరక్కసుందునిమి వానికూతు నంగారవతియనులావణ్యవతిని భార్యగా గ్రహించి యామెయందు గోపాలానుపాలురను నిద్దఱుకొమరులను, వాసవదత్తయనుకన్నియను గనియెను.

ఆకన్నియరూపంబు కలావిభవంబును ద్రిభువనలాలనీయంబై యుండెను. వత్సరా జాయన్నవమిన్నగుణగణంబు

నాలించియు చండమహాసేనునిఖడ్గప్రభావమునకు శంకించి కాలముప్రతీక్షించుచుండెను.

అట్లుండ నట చండమహాసేనుండు తనకన్నియకు జవ్వనంబు పెంపొందఁ దగినవరు నన్వేషించుకుతుకంబున భరతరోహకాదిమంత్రుల రావించి యిట్లనియె.

మంత్రిముఖ్యులారా! మనవాసవదత్తకు దగినవరునిఁ గులశీలరూపవిద్యాసమన్వితు నెందేని వెదకి తెలుపుఁడు. నావుడు భరతరోహకుం డిట్లనియె.

మహారాజా! అవధరింపుము. దేవరయానతికిమున్న యీకన్నియకు లేఁబ్రాయంబు దాటినదిమొదలుకొని సకలదేశాధినాథకుమారులగుణగణంబు చారముఖంబున విచారించుచునె యుంటిని.

రాజు—నీదూరదర్శిత్వ మేమెఱుంగనా? ఎల్లరలో నీకునచ్చిన రాకుమారు నెఱిఁగింపుము.

భరత—మహాప్రభూ! సకలగుణముల నీకన్నియకుఁదగినవాఁడు వత్సరాజగాక యితరుఁడు కానంబడఁడు.

రాజు—వానిపేరు జెప్పకుము. అపారమగుధరామండలమున లెక్కలేనిరాజపుత్రులుండ వారిలో నెందేనిఁ దగినవాఁడు వేరొక్కఁడు లేఁడయ్యెనా?

భరత—ఎందఱున్న నేమి? కులమున్నచోట రూపముండదు. రూపమున్నచో విద్యయుండదు. విద్యయున్నచో వినయముండదు. వినయమున్నచో బరాక్రమముండదు.

పరాక్రమమున్నచో నీతియుండదు. అన్నియుగావల యునెడ నుదయునునికన్న నింకొక్కఁడు లేఁడు.

రాజు—ఆతండెంత గుణగరిష్ఠుండైనను మనకు నుపయోగింపఁడుగాన వానిని లెక్కింపకుము.

భరత—అతఁడు మనకేల యుపయోగింపఁడు?

రాజు—వాఁడు పరాక్రమంబుకలిమిని, యౌగంధరాయణుని సాహ్యమునను నన్ను నించుకేని సరకుసేయఁడు. అట్టి వానిజోలి మనకేమి? ఇంకొక్కని వెదకుము.

భరత—ఏమిటలోపమున్నను రాకుమారుని వాసవదత్త వరించునా?

రాజు—అదియునిజమే. దాననేకదా గుణోత్తరునే వెదకవలయును.

భరత—వత్సాధీశునికన్న నింకొకఁడు గుణాధికుఁడు లేఁడు.

రాజు—అతఁడు సర్వోత్తరుఁడని యేనును వినియుంటి. అట్లయిన నేమిసేయుదు? నన్ను సరకుసేయనివానిం గన్నియకై యాశ్రయించి యెట్లుజీవింతును?

భరత— గీ॥ మానభంగము నల్లుఁడు మామకొనరఁ
జేయ నతనికిఁ బ్రతి మామ సేయరాదు
అల సుభద్రనుహరియించునర్జునునకు
ధనము లియ్యరె తొల్లియాదవులు ప్రేమ॥

కావున విచారించుట నీతిగాదు. అయినను నాతని నాశ్రయింపకయ యతండు మనకువశపడునట్లు యత్నించెద.

రాజు—అది యెట్లు?

భరత—అతఁడు గజవశీకరణవిద్య కలిమిచే గజగ్రహణవ్యసనంబుగలవాఁడు. దుర్వ్యసనంబుగలవాఁ డెందైన నాపదకు గుఱిగాకుండునే? అట్లగుట యేను నీలకువలయంబనుకృత్రిమగజంబు సృజించి వానిని వంచించి రప్పింతును.

రాజు—వత్సరాజు మహాకులీనుండగుటయగాక శూరవరుండు నగుటచే మేనఁబ్రాణంబులుండ చుమ్ములకుఁ జిక్కుననుట యసంభావితము.

భరత—వానికిఁ బ్రాణభయంబు లేకుండనే బంధించి కొనివచ్చునట్లు నీతికౌశలంబు నుపయోగించెద.

రాజు—అట్లాక వేళ నీవు వానిని బంధించి తెచ్చినను వాఁడా క్రోధంబున వాసవదత్తను పరిగ్రహింప నంగీకరించునా?

భరత—అతఁడు మనకుఁ జిక్కిన పదంపడి రాజపుత్రి గుణజాతంబె యాతని నంగీకరింపఁ జేయఁగలదు?

రాజు—నీచెప్పినది నిజము. అయినను, ఆవీరుఁడు మనకుఁజిక్కుటయ యరిది. ఒక్కవిధమున నాతండు పట్టువడినను పదంపడి యౌగంధరాయణుఁడు మనకేమి ముప్పు చొప్పడఁ జేయునోయని యెడఁద వడంకెడిని.

భరత—ప్రభూ! ఆమహామాత్యుం డెంతటైనఁ జేయఁగలఁ డనుట నిక్కము. అయినను, వాసవదత్తమూలమున

నుదయనునితో బాంధనబాధనము దృఢపడిన మీద నాతనిమంత్రి యెంతవాఁడయిన నేమిసేయును?

రాజు—అట్లేని నీకార్యంబు సాధింపుము. నావిని భరతరో హకుండు నిజకార్యతత్పరుండయి యుండెను.

ద్వితీయ ప్రకరణము.

—♦ వ త్స రా జ గ్ర హ ణ ము ♦—

అట వత్సాధీశుండు పరిమిత పరిజన సహితుండయి ప్రియమిత్రులగు విష్ణుగ్రాతాదులతో యమునాతటినీతటంబునఁ జెలువారునటవులలోఁ జరించుచు నచ్చటచ్చట మత్తగజప్రచారంబు నరసి తనకుఁ దెలుపఁదగుచారుల నియోగించి ఘోర మృగంబులఁ జెండాడుచు మృగయావినోదంబునఁ గొంత సేపును, కమలగంధబంధురజలంబులును, కలహంస కుల కలరవ శోభితంబులును నగు సరోవరంబులయందు జలక్రీడాపరత్వంబున గొంతతడవును, నిజవీణానినదసంమోహితగంధగజగ్రహణకుతుకంబునఁ గొంతకాలంబును, వనవిహారంబు సల్పుచు కాలంబు గడుపుచుండెను.

అట్లుండ నొక వనచరుం డతివేగంబునవచ్చి ప్రణామంబు సేసియిట్లని విన్నవించెను.

వన—దేవా! నేడొక యద్భుతంబగు వనగజంబు గానవచ్చెను.

వత్సరాజు—ఎచ్చట జూచితివి?

వన—నాగవనమునఁ జూచితిని.

వత్సరాజు—అది యెంత దవ్వుననున్నది?

వన ఒక యామడ దూరమున నున్నది.

వత్స—దాని లక్షణము లెట్లున్నవి?

వన—అది మిగుల యెత్తైనది అట్టిదానిని నెన్నడు కని యెఱుంగను.

వత్స—అట్లైన నది భద్రజాతి నీలగజము గానోపు నని పలికి యేనిదె యావనగజముంబట్టి తెచ్చెద మీరిటనుండు డని మిత్రులకుఁ జెప్పి సుందరపాటలంబను నశ్వంబు దేరం బనుప నప్పుడు విష్ణుత్రాతుం డిట్లనియె. ప్రభువర్యా! నాగవనంబు మనదేశంబునకు సీమాంతము అచ్చోటు నమ్మి యల్పపరిజనంబుతోఁ బోవ మనకు న్యాయంబుగాదు. గాన తగుసేనాసముదయంబుతో నేతేర మాకు ననుజ్ఞ యిండు. నావిని మిత్రులారా! వన్యగజబహుళంబగు నాఘోరారణ్యంబు మానవులకు నగమ్యంబగుట నదియెంతయు శంకాస్పదంబు గాదు నాయెడ భీతిదక్కుఁడు.మనుజగంధం బెఱుంగనియడవియేనుఁగు జనసమ్మర్దంబు నోర్వదు. ఏను ఘోషవతి ప్రభావంబున దానిం బట్టజాలుదునని చెప్పి వారలనందయుండని యోగించి పదాతులు బదుగురుమాత్రము దోడరా సుందరపాటలంబు నధిరోహించి త్వరితగమనంబున నాగవనంబు సేరి యావనచరుంగాంచి నీవామత్తగజంబు నెటజూచితివి? అదియిప్పుడెందుఁబోయెనో వెదకుమని వచింప వల్లెయనివాఁడు పోవ, ప్రభాకరుం డస్తాద్రి నధిరోహించెను. అప్పుడారాజచంద్రుం

డొక్క సరోవరంబున సాయంసంధ్య నుపాసించెను. అంత నావనచరుండు మరలివచ్చి దేవా ! ఆగజరాజంబిటకుఁ జేరువన మల్లికావేల్లితమగు సాలతరువునొద్ద నున్నది. విచ్చేయుడనిన నాభూమీశుండు తురంగమంబెక్కి వనచరుండు త్రోవఁజూపుచుండ నేగెను. అప్పుడు వాఁడు ' రాజా! అదె యుత్తుంగమగు మత్తగజము గను' మని చెప్పి వెడలిపోయెను. అంతనారాజు వాగువంబుదిగి ఘోషవతిమేళగించి గజాక్షిణీరాగంబు నాలాపించుచు దానింజూచుచు నాగజగర్భంబునుండి పెక్కండ్రువీరభటులు వెలువడిరి.

వారింగని యామహీశుండు ' అకటా ! ఇది కృత్రిమగజంబు .శత్రువంచనంబునకు లోనైతి. మిత్రులమాట నాలింపనైతి. ఎందేని నత్యాశందవులువడిన వాఁడిడుమలకు భాజనుండవుట విదితంబెకదా ; ఇట నసహాయుండనగునాకు ధైర్యంబుకన్న వేరుగతిలేదని యోజించి ఘోషవతిం బరిచరునకర్పించి ఖడ్గంబుధరించి తురంగమంబధిరోహించి నిలిచయుండుటయు కౌశాంబినుండి హంసకుండనుచారుండేతెంచి దర్శింపనీవు యౌగంధరాయణుం గాంచుమని యానతిచ్చెను.

అప్పుడపరిమితసేనానివహంబు వెంబడిరాఁ దేజశ్శాలియగు నొకపురుషుఁడు వచ్చి యుదయనున కెదురనిలిచి యిట్లనియె.

పురుషుఁడు—వత్సేశ్వరా! చండమహాసేను నానతి నిన్నుం బట్టుకొనవలయునని పలునాళ్ళనుండి వేచియుంటిమి నేడు మాకు జిక్కితివి. మానగరంబునకు విచ్చేయుము

ఉదయ—మహాసేనుఁ డెంతయో శూరుండని వినియుంటి. అతఁడు నన్ను వేమఱు పాటున బట్టఁబూన నింతటి భీరుఁడా? కానిమ్ము నీవెవ్వఁడవు?

పురు—నేను సాలంకాయనుఁడను.

ఉదయ—మహాత్మా! నీప్రతిభావిశేషంబు బహుకాలమునుండి యాలించుచుమిమ్ము దర్శింప వలయునని యత్నించుచు నేటికిఁ జూడగంటిని. మిముబోటివారికి సహజ విక్రమంబులేనివారి సన్నిధినుంట యనుచితము. గాన నాతో నరుదేరుడు. నాసామ్రాజ్యంబు మీయధీనంబు సేసెద. నేనెన్నఁడేని మిమ్మట్టి తుచ్ఛకృత్యములకు నియోగింపను సుఁడీ?

సాలం—రాజేంద్రా! ధర్మవిదుఁడవగు నీకుఁ దెలియని దేమి కలదు? ఎట్టిదైనను ప్రభునకు నచ్చినదే ఘనకార్యము. దాని నెఱవేర్చుట మాకు విహితముగానఁ బోవుదము రమ్ము.

ఉద—మంత్రివరా! ఈసేనంజూచి తలఁకితినని యెంచెదో? ఖడ్గంబు తోడున్నంతదనుకఁ జిక్కుదునని తలంపకుము. మీాసేనిం బంపుము. రిక్తగా సేనలఁజంపుకొననేల? వచ్చినదారిం బొమ్ము.

సాలం—మానధనా! నీశౌర్యం బెనెఱుంగనిది కాదు. నీ వసహాయుండవు. మహాసేనుని సేనలు లక్షలకొలఁది

సన్నాహముతో నున్నవి. పరాక్రమింప నిది యదను కాదు. నీకు శుభంబగును. నామాట వినుము.

ఉదయ—ఈబెదరింపులకు నదరుదుననుకొంటివా? సాగరుం డు నదీనివహంబులకు బెణంకునే? అభిమన్యువంశ్యు లె న్నఁడేని జన్యంబునకు వెఱచువారు గారు. నీవు బ్రా హ్మణుఁడవు గాన తలంగుము.

సాల—రాజా! హితము వినవొల్లవైతివి. ఏ నేమిసేయుదు? నని యటనుండి తొలంగునంత నా మహీకాంతు ననం తమగు సేనానివహంబు చుట్టుకొనియెను.

అప్పు డప్పాండవవంశ్యుం డాదండునందు క్షీరసాగరం బున మందరమహీధరంబుచాడ్పున దిరుగుచు యోధులను వధించుచుండెను. మహాసేను ననుమతి సాలంకాయనుండు వత్సరాజునకుఁ బ్రాణభయంబు లేకుండునట్లు సంగరంబు సేయుఁడని యానతియొసంగుటంజేసి వీరభటులు పెక్కండ్రు మడిసిరి. ఆయెడ నొక్కయోధుం డుదయునశ్వంబు కాలు నఱుక నదినేల కొఱగెను, అంతవత్సరాజు పదాతియై నిజఖడ్గం బున బెక్కురుపైనికులం జునుమాడి కొంతతడవునకుఁ బరి శ్రాంతుఁడయి సొమ్మసిలెను.అ త్తఱి సాలంకాయనుఁడు వత్స రాజును బంధించి యుజ్జయినికిఁ గొంపోయెను.

తృతీయ ప్రకరణము.

యౌగంధరాయణ ప్రతిజ్ఞ.

కౌశాంబీనగరమునందు యౌగంధరాయణుఁడు భరత గోహకునికపటప్రయత్నమును చారులవలన వినియుండి యీ సంగతి వేనికిఁ దెలుపుమని వత్సరాజునొద్దకు హంసకుఁడను శీఘ్రగామి ననుప వాఁడు పోవునటికే వత్సాధీశుండు నాగవనంబు జేరుటచే వార్తాహరుండును నటకేగి శత్రుసేనాపరివృతుండగునరపతి నవలోకించి మంత్రివార్త విన్నవించి ప్రతివచనము గ్రహించి యుదయనుఁడు శత్రువులకుఁజిక్కుట గాంచి మరలి కౌశాంబికిఁ జేరి యౌగంధరాయణుని దర్శించెను.

యౌగంధ—హంసకా! రాజునకుఁ గుశలమా?

హంస—రాజు జీవించియె యున్నాఁడు.

యౌగం—ఇది యేమి? ఇట్లనుచున్నాఁడవు? ఱేఁడు శత్రువులకు జిక్కెనా?

హంస—చిక్కెను.

యౌగం.—నీవు ముందుగనే రాజునకు నావార్త యేలదెలుపవైతివి?

హంస—నేను పోవునటికే యధీశుఁడు నాగవనము సేరెను.

యౌగం—హా! ప్రద్యోతుఁ డెంతపని చేసెను. వానిభాగ్యము నేమనవలయు. ఇదిమొదలుగా వత్సరాజమంత్రులకు

నశక్తియు సత్కీర్తియు సుస్థిర మయ్యెనే! అప్పుడు దూర దర్శి యగు రుమణ్వంతుం డెందుంబోయెను? పరివార మేమయ్యెను?

హంస—బలపరివార మంతయు దాపున నుండుచో నీయనర్థ మేల సంభవించును?

యౌగం—పరివార మేమైనది?

హంస—జరిగినసంగతి వినుడు. మహారాజు వేణువనమున నుండ నొకవనచరుండు వచ్చి నాగవనంబున నొక యద్భుతగజంబు దిరుగుచున్నదియని చెప్పెను. ఆమా ట వినగనె మనరాజు వానికి నూఱుసువర్ణనిష్కములు బహుమానమొసంగి దానిలక్షణములనుబట్టి నీలకువ లయముగా నుండుననితోచెడిని. అట్టిది హస్తికులచక్ర వర్తియని హస్తి శిక్షయందుం జదివియుంటిని. నేనిదె వీణామాత్రసహాయుండనై దానింబట్టుకొని వచ్చెదనని గమనోన్ముఖుండాయెనట.

యౌగం—అప్పుడు రుమణ్వంతుం డేల రాజు నుపేక్షించెను?

హంస—మంత్రిముఖ్యుండు దేవరవారిని బ్రతిమాలికొని దేవా! నాగవనము శత్రుజనులకుం జేరువైనదిగాన నటకు మీ రసహాయముగా జనుట యనుచితము. గావున మనము పరివారముతోఁగూడ నేగుదము. అని విన్నవించెను.

యౌగం—అందఱయెదుట నిట్లు చెప్పియుండెనా?

హంస — అవును.

యౌగం—మహారాజు మంత్రికేమి బదులుచెప్పెను.

హంస—వనగజము జనసమ్మర్దము సహింపదు. గాన నాతోఁడు మీ రెవరలును రాకుఁడని సుందరపాటలము నెక్కి వెల్వఁడియెనని యచ్చటివారు తెలిపిరి.

యౌగం — అంతనీవేమి చేసితివి ?

హంస—నేను వారుపోయిన దారినిబట్టి నాగవనము చేరితిని. నేను పోవువఱకే మహారాజు శత్రులచేఁజుట్టుకొనఁబడి యుండెను

యౌగం—అచ్చట పోరాటము జరిగెనా ?

హంస—ఘోరముగాజరిగెను. పెక్కండ్రు వీరభటులుమడిసిరి.

యౌగం—శూరవరుం డగుమనఱేఁడు మేనఁ బ్రాణములుండ వైరుల కెట్లుజిక్కెను ?

హంస— మహారాజొక్కరుండు పెక్కండ్రతోఁ బెద్దకాలము పోరి సొమ్మసిలుటచే వారు బట్టుకొనఁ గలిగిరి.

యౌగం—రాజు సొమ్మసిలె నంటివి. ఱేనికిఁ దిరుగఁదెలివివచ్చినది గంటివా ?

హంస—కంటిని. ఱేనికి బాగుగ జాగ్రత కలిగెను.

యౌగం—అట్లైన రాజును వారెట్లు బంధించిరి.

హంస—సొమ్మసిలగానె త్రాళ్ళతోఁ జేతులు గట్టివైచిరి.

యౌగం—హా! ఎంతమాట వినవలసెను.

ఆజానుదీర్ఘములు కరికరసదృశములు దేవభూదేవప
రిపూజాసక్తంబులు నగుమహారాజుభుజంబులకు గంక
ణస్థానంబున బంధనంబు లుంచఁబడియెగదా? రాజేం
ద్రుండు నిన్నుఁగాంచెనా?

హంస—చూచెను.

యౌగం—ఏదేనిం జెప్పెనా?

హంస—యౌగంధరాయణునిఁ జూడుమని చెప్పెను.

యౌగం—మంత్రుల నెల్లరను విడిచి నన్నె చూడుమని
చెప్పెనా?

హంస—అగును.

యౌగం—స్వామ్యన్నము దిని స్వామిచే బహూకృతుఁడగు
వానిపోల్కి ప్రత్యుపకారమేమియుఁ జేయనేరకున్నను
నన్నుఁ జూడఁదగినవానిగనే తేఁడు మన్నించెనా? తరు
వాత నేమిచేసిరి?

హంస—ఉజ్జయినికిఁ గొంపోయిరి.

యౌగం—ఈయనర్థము సంభవించునోయని యేనుముందుగ
శంకించుచునే యుంటిని. ఇదిప్రద్యోతునకుఁ బెద్దకో
ర్కెగదా? కానియిట్టిదశ నున్నమహీకాంతుండు
తానింతదనుక లెక్కసేయని మహాసేను నెట్లుచూడఁగ
లఁడు? అట వారువలుకుతిరస్కారవాక్యంబు లెట్లు
వినఁగలఁడు? తనకువానియెడఁగలకోపము నెట్టు లడంచు
కొనఁగలఁడు?

హంసకా ! నాప్రతిజ్ఞ వినుము.

రాహుగ్రస్తుఁడగు చంద్రునిపోల్కి శత్రుబలగ్రస్తుఁడగు మహారాజును విడిపింపనైతినేని నేను యౌగంధరాయణుఁడ గాను.

ఇదిగాక వత్సరాజుతో మహాసేనుకూఁతు వాసవదత్తను కూడ కౌశాంబికిఁ జేర్పనైతినేని యౌగంధరాయణుఁడను గాను

ఆ॥వె। కట్టియల మథింప గలుగదే యట నగ్ని
పుడమి త్రవ్వ జలము వొడమకున్నె
ఉండునే యసాధ్య ముత్సాహులకు సితి
కలన నన్ని యత్నములు ఫలించు॥

గాన నా యోపినట్లు యత్నింతును. దీనికి దైవము తోడ్పడవలయు నని వానిం బనిచి కార్యపరుండై యుండెను.

చతుర్ధ ప్రకరణము.

—♦ వర నిశ్చయము ♦—

ఉజ్జయినీనగరమున నిజసౌధమునందు మహాసేనుఁ డంగారవతియను తనుపత్నితో నిట్లు సంభాషించుచుండెను.

మహాసేను—దేవి! వాసవదత్త యెట నున్నది?

అంగారవతి—ఉత్తరయనుగాయకివద్ద నారదవీణ నేర్చికొనఁ నేగెను

మహా—దీనికి సంగీతమున నభిరుచి యెట్లు లేర్పడెను?

అంగా— కాంచనమాల యను నెచ్చెలి వీణనేర్చికొనుచుండఁ జూచి తానును దానియందు నుత్సుకురా లాయెను.

మహా—చిన్నతనపుచర్య లిట్లే యుండును.

అంగా—దేవరవారివద్ద నొకవిన్నపము సేయదలంచితి.

మహా—ఏ మది?

అంగా—వాసవదత్తకు సంగీతాచార్యు నేర్పరచుడు.

మహా—వివాహకాలము సమీపించియుండ నిపు డాచార్యుఁడు దేనికి? భర్తయె నేర్పఁగలఁడు.

అంగా—ఆ! కన్నియ కిప్పుడె వివాహకాలము వచ్చెనా!

మహా—బాగుగా నున్నది. వరుని నాలోచింపుమని యను దినము పోరుచు నిపుడు సంతాపపడియ దేల?

అంగా—వివాహముసేయుట నాకును సమ్మతమే? అయిన ను నదికాగనె వాసవదత్త యత్తవారింటికిఁ బోవునని తలంపగా సంతాపము గలెడిని. వరుని నిశ్చయించితిరా?

మహా—నిశ్చయింపలేదు.

అంగా—ఇంకను నాలోచించుచునే యున్నారా?

మహా—మనకన్నియకై పెక్కురు రాజకుమారులు సందేశముల ననుపుచున్నారు. వారిలో నెవ్వానిని నిశ్చయింపఁ జాల కున్నాను.

అంగా—అధికముగాఁ జెప్పనేల? ఎవ్వని కిచ్చినచో మనము సంతాప మొందమో అట్టివానికి నొసఁగుడు.

మహా— మాట కడుసులభముగా జెప్పితివి. నిశ్చయించుట కష్టము. వరునియందుఁ బదంపడి యేదేని నవగుణము దేటపడునెడ దూఱుటకే నన్ను నిశ్చయింపు మనుచుం టివి. సందేశ మంపినవారిలో నెవ్వనినైన నచ్చినవాని ని నీవ నిశ్చయింపుము.

అని నుడువుచుండ నొకచారుండు వచ్చి

చారు— మహాప్రభూ ! వత్సరాజు మహామాత్యుఁ డగుసా లంకాయనునిచేఁ బట్టుకొనఁ బడియెను.

మహా— (సంతసమున) నీ వేమని చెప్పితివి ?

చారు— వత్సరాజు సాలంకాయనునిచేఁ బట్టుకొనఁబడియెను

మహా— ఉదయనుఁడే ?

చారు—అగును,

మహా— శతానీకునిపుత్రుఁడే ?

చారు— అగును.

మహా—సహస్రానీకుని మనుమఁడే ?

చారు—అగును.

మహా— యౌగంధరాయణుఁడు చనిపోయెనా ?

చారు— ఆయన కౌశాంబిలో నున్నవాఁడు.

మహా— అట్లైని వత్సరాజు చిక్కలేదు.

చారు— నామాట నమ్ముడు.

మహా—ఎవ్వాని శౌర్యమును రణరంగములయందు వైరులు వొగడుచుందురో అట్టియుదయనుఁడు చిక్కెనని నీచె

ప్పినమాట విశ్వసింపఁ జాలను. చేతితో మందరగిరిం
ద్రిప్పితి ననిచెప్ప నెవ్వఁడు నమ్మును ?మఱియుయౌగం
ధరాయణుని నీతిమర్మములు జగమున నుతికెక్కియుం
డ నతఁడు జీవించియుండగనే యీవీరవరుఁడు మనకు
జిక్కుట యెక్కడిది?

చారు—మహారాజా ! నేను బ్రాహ్మణుఁడను వృద్ధుఁడను ఇది
వఱకు నసృత మాడి యెఱుంగను.

మహా—సాలంకాయనుఁ డంపినపురుషుం డెక్కడ?

చారు—జవనాశ్వములుగల యరదంబున వత్సరాజునుగొని
కొని సాలంకాయనుఁడే వచ్చెను.

మహా—ఇట్లువచ్చెనా?ఔరా!ఏమి నాభాగ్యము? ఇప్పుడుమన
సేనలు సన్నాహము విడిచి విశ్రమింపనీ. ఇది మొదలు
కొని చారులను బ్రచ్ఛన్నముగా ననుప నక్కఱలేక
రాజులు నిర్భయముగానుందురు. ఆహా! నేటికి మహా
సేనుఁడ నైతిని.

అంగా—మన మంత్రి వత్సరాజుం గొని వచ్చెనా?

మహా—అగును.

అంగా—ఈతని నిమిత్తమేకదా?వాసవదత్త నింతదనుక నెవ్వ
నికి నీఁ దలఁపకుంటిమి.

మహా—సాలంకాయనుఁ డెక్కడ?

చారు—రాజద్వారంబున నున్నవాఁడు.

మహా—రాజకుమారునకుఁ జేయనగు సత్కారము వత్సరాజునకుఁ జేసి యతనితో సాలంకాయనుని లోనఁ బ్రవేశ పెట్టుము. వత్సరాజుం జూడవచ్చిన పురజనులం బార ద్రోలకుఁడు. ప్రసిద్ధుఁడగు నాశత్రునిం బౌరులు వీక్షింతురుగాక.

చారు — దేవరచిత్తము.

అంగా—ఏ నీరాజకులమున నెన్నియో యభ్యుదయముఁల ననుభవించితిగాని యింతయుత్సవము నెఱుంగను.

మహా—వత్సరాజును బట్టు నంతటి సంతోషవిషయముగాంచి యెఱుంగను.

అంగా—నిజముగా వత్సరాజేకదా?

మహా—అగును.

అంగా—మనసంబంధముగోరి యెందఱో రాజులు దూతల నంపిరిగాని యితఁ డనిపియుండలేదు.

మహా—ఈతఁడు మహాసేనుఁడను పేరే విననొల్లఁడు. ఇకఁ మన సంబంధము నెట్లు కాంక్షించును?

అంగా—మిమ్మును లెక్కసేయఁడా? అతఁడు పిన్నవాఁడా? లేక తెలియనివాఁడా?

మహా—పిన్నవాఁడేగాని తెలియనివాఁడుగాఁడు.

అంగా—దేనినిబట్టి యీతని కింత గరువము?

మహా—సుప్రసిద్ధరాజర్షి నామముతో నొప్పునదియు వేదవిదితమైనదియు నగు భరతవంశ మతనికి గర్వము గలి

గించెడిని. కులక్రమాగతమైన గాంధర్వ మీతనికి నభిమానమునుం జెనిచెడిని. అభినవయౌవనమునకు దగిన రూపము విలాసము నొసఁగెడిని. జనానురాగము విశ్వాసమును వృద్ధిపఱచెడిని.

అంగా—కులము, రూపము, విద్య, ప్రాయము మొదలుగా నన్నియు మేలిగుణములే. ఇఁక వీనిలో నెద్ది మీకు ద్వేషకారణ మయ్యెను?

మహా—దేవి! అగ్గి పొదలనెల్లం గాల్చునట్లు నాశాసనము పుడమియం దెల్లెడలఁ బ్రజ్వరిల్లెడిని. గానియీతని దేశంబునఁ జెల్లదు. ఇదియె ద్వేషబీజము.

అంగా—అంతశూరుఁడా?

కంచుకి—దేవ ! సత్కరించి వత్సరాజుతోఁగూడ సాలంకాయనుని లోనఁ బ్రవేశపెట్టితిమి. వత్సరాజువీణ యిది. దీనిని మీ కిమ్మని మంత్రివర్యుఁ డనిపెను.

మహా—ఆహా! ఇదియె ఘోషవతి. దీని మ్రోగించునెడ నువయనునకు మత్తగజంబులును వశపడుచుండును. పెద్దవాఁడగు గోపాలకుఁ డర్థశాస్త్రమున నాసక్తుఁడు. చిన్నవాఁడైన యనుపాలకుఁ డన్ననో వ్యాయామపరుఁడై గాంధర్వమున ద్వేషంబును గలవాఁడు. ఈవీణ నెవ్వని కిచ్చిన నుపయోగపడును?

అంగా—వాసవదత్త వీణ నేర్చికొనుచున్నదిగదా ?

మహా—దీనిని దానికె యిప్పింపుము.

అంగా — ఈవీణనుగూడ నిచ్చునెడ దానికి గానోన్మాదమిం కను బెరుగునేమో?

మహా — ఆడుకొననిమ్ము. అత్తగారింటికేగిన పిదప నిదియంతయు సాగదు గదా?

కంచుకి — వత్సరాజునకుఁ బెద్దగాయములు దగిలియుంటచే నాయనను మధ్యమగృహమున బ్రవేశపెట్టితిమి.

మహా — గాయము లయ్యెనా? ఇప్పుడుపేక్షింపదగదు. ఉపయనుని గాయముల మాన్పింపుమని భరతరోహకునకుఁ జెప్పుము. ఇదిగాక, అతఁడేదికోరిన నది సగౌరవముగా దీర్పుఁడు. ఆతని యింగితముం గ్రహించియె యుపచరింపుడు. కడచిన పోరాటముం గుఱించినమాట లతని యొద్ద బ్రస్తావింపకుఁడు. తఁమిమ్మనప్పుడు దీవింపుచుండుడు. మణిభూమికయందుఁ బ్రవేశపెట్టుడు.

కంచుకి — మహాప్రసాదము. అట్ల యొనర్తు నని యేగెను.

అంతలో భానుమంతుండు గగనమధ్యము నలంకరింప మహాసేనుఁడు మాధ్యాహ్నిక కృత్యమునకై వెడలిపోయెను.

పంచమ ప్రకరణము.

యౌగంధరాయణుని కార్యక్రమము.

యౌగంధరాయణుఁడు కౌశాంబీనగరమున హర్షరక్షితుని రాజ్యకార్యనిర్వహణమునను, కటకపింగళకులను దండనాథులను రాజ్యసంరక్షణకృత్యమునను నియోగించి తా నున్మత్త

వేషమును, రుమణ్వంతుఁడు క్షపణకవేషమును, రుమణ్వంతుని తోఁబుట్టువు సాంకృత్యాయని యనుపేర యోగినీవేషమును దాల్చియుజ్జయినిం బ్రవేశించిరి. ఇంకను బెక్కురు పెక్కువిధముల మాఱుపేరులు దాల్చి కొందఱు ద్వారపాలురుగను, మఱికొందఱు గజాశ్వాది సంరక్షకులుగను నుండి మహాసేనుని గొల్చుచుండిరి. ఈ యౌగంధరాయణప్రేరితు లగు రాజపురుషులు కార్యనిపుణు లగుటం జేసి ప్రద్యోతుని మెప్పు వడసి యట సత్కారములఁ బడయుచుండిరి. ఈవిధమున నుజ్జయినీనగరము నానాటికి వత్సదేశజనభూయిష్ఠ మయ్యెను. యౌగంధరాయణముఖ్యు లొక్క సంకేతస్థలము నేర్పఱచుకొని రాత్రులయందు గార్యాలోచనము సేయుచుఁ బగటివేళఁ దమ తమపనులు నిర్వర్తించుకొనుచుండిరి.

అట్టుండి వారు ప్రద్యోతుని పట్టపేనుఁగు నలగిరికి మదజనక వస్తువులు మిక్కుటముగాఁ బెట్టించిరి. ఆగజరాజము గిరివరము బోలియుంటనే దానికి నలగిరియను పేరు చొప్పడియెను. మదకరవస్తుభక్షణంబున నద్దానికి నత్యధికమదంబు సంభవింపం దొడంగెను. అంత దానియెదుట యౌగంధరాయణప్రేరితు లగు గూఢచారులు కొన్నిభవనంబులు గాల్చిరి. అప్పుడు మత్తదంతావళ మాభీలములగు జ్వలనజ్వాలలం గాంచి బిట్టుబెదరి కట్టుగొయ్యఁ బెకలించుకొని నగరంబుపైఁ బడి కనంబడినమావటీండ్రను, శూలహస్తులను, యోధులను గూడఁ జిత్రవధ సేయఁ జొచ్చెను. అత్తఱి నానగరంబు ధావమాన యోధనికరంబును, రోదమానస్త్రీజనంబును, పలాయమాన

పురజనంబునునై యకాలప్రళయశంకాకులం బయ్యె. అప్పుడు ప్రద్యోతుం డవ్వార్త విని యేమియుందోపక నిజకాంతతో సౌధాగ్రంబు సేరి సాలంకాయనుని బిలిపించికొనునంతలో గొందఱు దాసీజనులు వచ్చి మహాప్రభూ! భర్తృదారిక దేవి దర్శనకాంక్షతో శిబికారూఢయై తూర్పువీధి కేగియుండెను. మత్తగజం బావీధినే తిరుగుచున్నదని తెలిపెడినని విన్నవించి యాక్రోశించిరి. అంత మహాసేనుండు శోకాకులచిత్తుండై యావీధికి గొందఱు భటులంబనుప వారలట కేగి వాసవదత్తావృత్తాంతం బరసి దేవా! శ్రీమతి దేవిగోపురము నెక్కి యున్నది యని చెప్పిరి. ప్రద్యోతుఁడు సాలంకాయనుం జూచి.

ప్రద్యో—మంత్రిముఖ్యా! ఈమత్తగజోపద్రవము వారించు నుపాయ మేమి?

సాలం—దాని నాలోచింపనే తమసన్నిధికి వచ్చితిని.

మహా—అది వశముగానప్పు డేమిచేయవలయు? దానిని వధింప ధానుష్కులకు నానతిమ్ము.

సాలం—అద్ది పట్టపేనుఁగు. దేవరవారు పట్టాభిషిక్తులైనప్పుడు దాని నధిష్ఠించితిరి. పట్టపేనుఁగును జంపుట బాడిగాదు.

మహా—అయ్యది యెల్లరను జంపునప్పు డేమి చేయవలయు?

సాలం—వే రుపాయము లేనప్పుడు మీరు సెలవిచ్చినదే.

మహా—ఇపుడు దాని వశపరచుకొన నేమియుపాయము గలదు?

సా——వత్సరాజు గజవశీకరణవిద్య గలవాఁడని ప్రసిద్ధిక లదు. గాన నాతనిని నీపనియందు నియోగించినచో జక్కఁపడునని తోఁచెడిని.

మహా——ఇపు డతనితోఁడ్పాటు గోరుటే మనకు మానభంగక రము. దీనికి మనము లోఁబడి యతని ప్రార్థించినను మనయెడ నాగ్రహాగ్రసుఁడగు నతఁ డిప్పనికి నొడంబ డునా?

అంగా——ఒడంబడినచో ననుపవలయుననియె యెంచితిరా? అతఁడు కులరూపశీలాదులకలిమి మనకన్నియకుదగునని యెన్నుచు నీ రాకుమారుని వదవు లేనఁగునకు నర్పింప జూచెద రేమి?

సాలం——ఆయన కేమియు భయములేదు. వత్సరాజు నెప్పగి దినేని నిప్పని కొప్పించెద. అనుమతించుడని రాజు నాజ్ఞ గొని సాలంకాయనుఁడు కౌశాంబీశునొద్ద కేగి యిట్లనియె.

సాలం——రాజా! మీకు సుఖమా?

వత్స——చెఱలోనున్నవానికి గలసుఖము నీమది కెట్లు తెలియును? పరిహాసింపవచ్చితివా?

సాలం——కడచినదానికై వగచిన నేమిలాభము? నామాట యాలింపమినే మీ కిట్టినిర్బంధము ప్రాపించెను. ఇంక నైన నామాట పాటింతురేని మీకు దప్పక శ్రేయ ము గలిగెడిని.

వత్స—వంచకులమాట పాటింపకుండు టెట్లు?

సాలం—కార్యావసరముంబట్టి యెట్టివారలకైన నొకప్పుడు ఫల ముపయోగింపవలసివచ్చుట రాజనీతికి విరుద్ధముగాదు. అట్లని యెల్లపుడద్దానినె యవలంబింతుమా?

వత్స—ఇపుడు మీరు చెప్పఁదలంచిన దేమి?

సాలం—మీ రొకపని సాధింపవలసియున్నది.

వత్స—వివరింపుడు.

సాలం—నలగిరి యనుగజేంద్రము మదించి యెరికి వశపడక జనులసమయించుచున్నది. గజవశీకరణ విద్యాప్రభావంబున దానిం బట్టుకొనినచో మీకు గొప్పలాభము గలిగెడిని.

వత్స—ఆవిద్యామహిమంబుననేకదా యిదివఱ కిట్టిలాభము పొందితి. ఈలాభముఁ బెంపుసేయఁ దలంచితిరికావలయు? వచ్చినలాభము చాలును.

సాలం—నామాట వినినచో మీ కీర్తిష్టము వాయును.

వత్స—వినకున్న నేమి?

సాలం—మీ కీనిర్బంధము నివర్తింపదు. అదిగాక, గజవశీకరణవిద్య తెలిసియు మీ రీమత్తగజోపద్రవము వారింపనిచో నదిజనములఁ జంపుటయువిలుకాండ్రు దానిం బరిమార్చుటయు సంభవించును గాన నాహింసాదోషము మిమ్ముసంక్రమింపక మానదు.

వత్స—సాలంకాయనా! మీరాజమంత్రులంబట్టి నాచిత్తమిప్పవి నొల్లకున్నను హింసాదోషము నిర్బంధించుచున్నది. అయినను నిరాయుధుఁడ నేమిసేయుదును?

సాలం.— మీరీకృత్యమున కొడంబడునెడ సాధనంబులకు గొఱంత యేమి?

అనిపల్కి యామాత్యముఖ్యుఁడు వత్సేశ్వరు సుస్నాతుని జేయించి యుజ్జ్వలవస్త్రాభరణములను ఖడ్గమును ఘోషవతినిగూడ నొసఁగఁ గ్రహించి మహీశుండు వారు సిద్ధపఱచినవారువంబు నెక్కి సాలంకాయనాదులు వెనుక వచ్చుచుండ మత్తమాతంగం బున్నయెడకుఁ బోయి దానిం గాంచి కొంతయెడంబునను తురంగమంబు డిగి ఘోషవతి మేళవించి మధురం బగుకంఠస్వరంబుతో నేకంబుగ వీణవాయింపఁ దొడంగెను.

ఆమదనాగంబు మధురగానంబు విని శిరము వాంచి వీనులు నిక్కఁబట్టుకొని భూనాథున కెదురై యూఁగుచుండెను. అత్తఱి పురజనంబులు విస్మయాక్రాంతచిత్తులై గజరాజనర్తనంబు నాలోచించుచుండిరి. అప్పుడు దేవీగోపురంబున నున్న వాసవదత్త యుదయనుని రూపవిభవంబు దిలకించియు, గానమాధుర్యంబు నాకర్ణించియుఁ జిత్రన్యస్తాకృతిం దలపించెను. అంత నక్కోమలి సఖురాండ్ర ప్రేరణంబున సచేతనయై హస్తినటనంబు గాంచి యచ్చెరు వందుచుండెను.

వత్సనరపతి కొంతతడ వగ్గజేంద్రంబు నాడించి వశపడియెనని గ్రహించి సన్నసేయ నది పండుకొనియెను. అంత మహీకాంతుం డాదంతావళంబు నధిరోహించి వెడలుచు. నున్మత్తుండు తమ్మటంబు వాయించుచు నేనుంగునకు నడ్డపడుటయు గజేంద్రంబు వాని తమ్మటంబు నిజకరాగ్రంబున లాగి

యుదయనునకిడియె. భూమీశుం డాతన్మ్రటంబుజూచి యిచ్చిన నందుకొనిగజంబు దానిందిరుగ నున్మత్తున కొసఁగెను. ఏనుగు పుట్టినది నాకేలయని యాయున్మత్తుండు దానిం జించివైచి నిజేచ్ఛం బోయెను.

ఉదయనమహీశుండు మత్తగజారూఢుండై వెడలుడు వాసవదత్త శిబిక నధిష్ఠించి బైలుదేరెను. తోడన సాలంకాయనాదిరాజపురుషులు మహాజనంబులును జయజయశబ్దంబులతో నరుదెంచుచుండిరి. అట్లు రాజసౌధంబు ముంగిట జేరుటయు వాసవదత్త లోనఁ బ్రవేశించెను. సాలంకాయనాదులు వత్సాధీశుని సౌధాంతరంబునఁ బ్రవేశపెట్టి రాజోపచారంబులు సల్పుచుండిరి. పౌరులెల్లరును నుదయనుమహత్త్వంబును నుపకారపరత్వంబును వేనోళ్ళఁ బొగడుచునీవసుధావల్లభుని వాసవదత్తకు వల్లభునిగాఁ గూర్చినచో విధిని మెచ్చనగునని భావించుచుండిరి.

షష్ఠ ప్రకరణము,

గాంధర్వ శిక్షణము.

వత్సరాజొకనాడు తనలోనిట్లు తలపోయం దొడంగెను. ఆహా! విధివిపాకము నన్నెట్లు లాడించుచున్నది? నేనిట్లు వైరి వంచనమునకు లోఁబడుదునని కలలోనైనఁ దలంపనైతిగదా? ఏనీ విపత్సముద్రంబు నెట్లు తరింతును? మత్తగజంబుగాంచి యదియోడగా నెంచి దాని నధిరోహించి విరోధియూథంబు

జీరికింగొనక వెలువ...ంచునంతలో నాయాశయంబుగ్రహించి
యప్రతిమ ప్రభావుండయ్యు నానేరమున నున్మత్తభూమిక
నవలంబించిన యౌగంధరాయణుండు వేగిరపడకుము. ఇం
కొక్క నెల నిరీక్షింపుము. నాటికిగాని మనయత్నంబులు
ఫలింపవని తమ్మటముమీద వ్రాసి కనంబఱచెను. అదిగాక,
నీకీ సూకరితో నేల? సౌవర్ణప్రతిమ నొసగెదనని పలికెను.
దానింబట్టి నీకు రాజకన్యను సంఘటింపఁజేసెద. ఏనుగు నెక్కి
యురుకకు మనునర్థము స్ఫురించెడిని. ఏనును వాసవదత్త
గుణగణంబు పలునాళ్ళనుండి వినుచు. నాకన్నియ నెట్లు సూతు
నని యెన్నుచుండ నాహతవిధి వైరివంచనామిషంబున నిటకు
రప్పించి యాచంచలాక్షిని దృగ్గోచరం గావించెను శత్రు
బంధంబుల నేవిధినైన విదిలించుకొనియేగఁజాలుదుగానియావి
లాసవతి కటాక్షవీక్షణబంధంబులు విడిపించికొన శక్తుండగాను.
ఆకన్నియ సవిలాసకృత్యంబులు సూడ వెడవింటిజోదునాయెడఁ
బ్రసన్నుండుగాఁ దోచెడిని. అయినను నాయన్నువమిన్న లభించు
టెట్లు? నిజదేశంబు సేరుటెట్లు? అని చింతించుచుండెను.

అంతలో నంగారవతీప్రేరణంబున మహాసేనుండు వాసవ
దత్తకు వత్సరాజుచే వీణ నేరిపింప నెంచి సాలంకాయనుం
గూడి యుదయనుని యొద్దకు వచ్చెను. అప్పుడు సాలంకాయ
నుండు వత్సమహీపతింగాంచి యిట్లనియె.

సాలం—రాజేంద్రా. మాప్రభువు మీమైత్రిని గోరెడిని!

వత్స—అది నాకుమున్నె తెలియును. మీరు మైత్రిని గోరకు
న్నచో నన్నెట్లు వంచింతురు?

సాలం—భూనాథా! గతము మఱువుము.

వత్స—మీ చేసినపని యుత్తమక్షత్రజన్ముఁడు మఱచునదియే? అదిగాక మైత్రి సములకే చెల్లునుగాని అది మాకెట్లు చెల్లును?

సాలం—మీ రిద్దరు సములనియె నానమ్మిక.

వత్స—కానేర మనియె నానమ్మిక.

మహాసేనుఁడు—అది యెట్లును నిజమే.

వత్స—ఎట్లో వివరింపుము.

మహాసేను—నీవు బద్ధుండవు. నేను బంధించిన వాఁడను.

వత్స—ఈమహాకార్యమునకు నీవ సంతసపడవలయు

మహా—ఇది మహాకార్యము గానేరదా ?

వత్స—మన యిర్వురము ద్వంద్వయుద్ధంబునకు గడంగుదమా?

మహా—నేను గనుసన్న సేసినచో నిపుడు లక్షలకొలఁది సైనికులు నిన్ను జుట్టుకొందురు.

వత్స—నే నీనలగిరి నెక్కినచో నిన్ను నీయక్షౌహిణినిగూడ క్షణమాత్రమున మర్దింపగలను.

సాలం—వత్సేశ్వరా! మీసన్నిధికి నతిథులమై వచ్చినవారి యెడ నాగ్రహంబు పూనుట తగునా?

వత్స—అతిథుల కోర్కి దీర్ప సంసిద్ధుఁడను. అతిథి వచ్చి ప్రాణంబు గోరినను సుధాకరవంశ్యులు వెనుదీయరు. ఇప్పుడు అతిథి యెవ్వరు? కోరునదేమి?

సాలం—అతిథి మహాసేనుఁడు. ప్రార్థించునది విద్యోపదేశము.

వత్స—ఏ విద్య కావలయును?

సాలం—గజాకర్షిణి గాంధర్వము ననునవి యపేక్షితములు

వత్స—వాని నవివాహితులకే యుపదేశింపనగును.

సాలం—రాజపుత్రులు వివాహితులైనను భర్తృదాసిక యపరి
ణీతయే. గాన నామెకు నుపదేశింపుడు.

వత్స—స్త్రీజనమునకు గజాకర్షిణి యనర్హము.

సాలం—ఆకన్నియకు గాంధర్వమునే యొసఁగుడు.

వత్స—ఆపె రాకన్నియ. అందును నంకురితయౌవన అట్టి
వారి సమావేశము మాకు ననుచితము.

సాలం—అది శంకాస్పదము గాకుండునట్లు యొనర్తుము

వత్స—ఎట్లు?

సాలం—ఈనగరమున సాంకృత్యాయని యని యొకయోగిని
కలదు.ఆమెసాన్నిధ్యమున రాకన్నియకు మీరు గాంధ
ర్వము నుపదేశించుట యేరికిని శంకాస్పదము గాదు.

వత్స—ఆయోగిని యెవ్వరు?ఆమెశీలాదు లెట్టివి?

సాలం—ఆజోగిని హిమవన్నగప్రాంతమునుండి వచ్చియున్నది
యోగసిద్ధురాలు

వత్స—అటులేని శంకాస్పదముకాదనియె తోఁచెడిని.

నావుడు సాలంకాయనుఁడు మహాసేనునితో నటనుండి వెడలి వాసవదత్తాంగారవతులతోఁగూడి సాంకృత్యాయనియున్నయెడకుఁ జనిరి. అప్పుడు మహాసేనుఁడు నమస్కరించి యోగినితో నిట్లనియె.

మహా — యోగినీతిలకమా! మీతపంబు నిర్విఘ్నంబుగ సాగెడినా?

సాంకృ — ప్రభువులవారియనుగ్రహంబు గలుగ మావియు మాదులకు విఘాతం బెట్లు గలుగను?

మహా — అమ్మా! మిమ్మిపు డొకపని యర్థింపవచ్చితిమి.

సాంకృ — ఆనతిండు.

మహా — ఈకన్నియకు గానవిద్యయందు నానక్తి యధికము. వత్సరాజుచే వీణ నేర్పింపఁదలంచితిమి. అతఁడు మాభవనమునకు రానొల్లఁడు. అశంకితమగుప్రదేశము కుదురదయ్యెను. వత్సరా జెట్టకేలకు మీసాన్నిధ్యము నంగీకరించెను. ఇప్పని నొడఁగూర్ప వేఁడుచున్నారము.

సాంకృ — రాజా! మహాకాళేశ్వరుదర్శనంబుఁగోరి యిట వసింపవలసె. మాకు జనసమ్మర్దంబె యనర్థము. అందును యువజనసన్నివేశము. గానగోష్ఠియు నిషిద్ధములు ఏమి సేయను దోఁపకున్నది.

మహా — మీరు జగమును దరింపఁజేయ నెంచి యవతరించిన కారణజన్ములు. మీసన్నివేశమున మాబోటిప్రాకృతుల మనంబులును నిర్మలంబు లగుచుండ నితరజన సన్నివేశము సిద్ధజనుల కెట్లు చిత్తవిక్షేపకర మగును? కావున మాప్రార్థనం బంగీకరించి మమ్ముఁగృతార్థులఁ జేయుము

అనివేడిన నాయోగిని సమ్మతించెను. అంత మహాసేనుం డువత్సరాజు నటకు రప్పించి వాసవదత్త నగ్నిసాక్షికముగ నతి

నికినంతేవాసినిగా నర్పించెను. వాసవదత్తావత్సరాజులదియెవివా హామనితమలో భావించిరి. అదిమొదలుకొనివాసవదత్త వత్సరా జునలన ఘోషవతిని వాయింప నేర్చికొనుచుండెను. కులము రూపము, జవ్వనము, శీలము, కలాకౌశలము నన్నిట నీయి ద్వరు ననుగుణమున నున్నవారు. మఱియుఁ బరస్పరానురాగ భరితులు. అట్టివారిశిక్షణగ్రహణంబులు వర్ణింప నెవ్వరితర ము? వారిద్దఱకు గ్రమంబుగ రాగవిభవంబులో ననురాగవి భవంబును బరిపూర్ణం బగుచుండెను.

సప్తమప్రకరణము

వాసవదత్తాపహరణము.

అంతఁగతిపయదినంబులకు రుమణ్వంతుఁడు సేనాసము దయమును సన్నద్ధముసేసి సీమాంతములయందు నిలిపెను. దానంజేసి, మనపనులన్నియు సమగ్రము లయ్యెను. ఇఁక సనగరము వెల్వడనగునని యౌగంధరాయణుఁడు వత్సరాజున కుఁదెలిపెను. దానింబట్టి యుదయనుండు గమనోన్ముఖుండై యోగినికి నావృత్తాంతము సూచింప నామెవలన విడుగుంబోని యవ్వార్త వినగనే వాసవదత్త మూర్ఛితయై కాంచనమాల నేదదేర్పఁ గొంతతడవునకు దెలివినొందెను. అప్పుడు కాంచన మాల యిట్లనియె.

కాంచ — సఖి! ఏల యిట్లున్న దానవు?

వాస — నీకు నాయెడ నేమివిశేషము గానవయ్యెను?

కాంచ—ఇప్పుడు స్మృతిదప్పితివిగదా?

వాస—నావస్తుజాతము నెల్ల నీ వుపయోగించికొనుము.

కాంచ—ఇంతసాహసము నవలంబింప నేల?

వాస—ఏ నేమిసాహసము నవలంబించితిని?

కాంచ—ఉసురులు వీడ నెంచుటకన్న సాహస మేమికలదు?

వాసవ—ఏనేమియు నెఱుఁగ. నన్నుఁ బలుకరింపకుము.

నావృత్తు కాంచనమాల సేయునదిలేక యౌగంధరాయణుదంతంబు యోగిని కెఱిఁగింపఁ నామె యిది యుదయనుని ప్రయాణమూలమున సంభవించిన మనోవేదన యని గ్రహించి కాంచనమాలతో నిట్లనియె. మదవతీ! ఉదయనుని ప్రయాణోదంతము వాసవదత్తకుఁ దెలిసెను గాన నీపరితాపమునకు నదియె కారణమని తోఁచెడిని. ఈరాత్రి పయనము సిద్ధమని వత్సరాజు నాకుఁ దెలిపెను. ఈవిలాసిని యాసరసునితో నేగుటకు సమ్మతించు నెడ నతనికిఁ జెప్పి యొప్పింతును. కాన నీవు వాసవదత్త నూఱడింపుము. నావిని కాంచనమాల వాసవదత్త నుపలక్షించి.

కాంచ—సఖీ! నీసంతాపమునకు గారణమెద్దియో చెప్పుము.

వాసవ—నాకు సంతాపమె లేదు.

కాంచ—నీమాటంబట్టి నీకు నాయెడఁ జెలికారంబు కపటంబని తోఁచెడిని.

వాసవ—ఏకారణమున?

కాంచన—సౌహార్దంబు గలదేనినాకునిజంబేల వక్కాణింపవు?

వాసవ—నాకు నాయసువులె శత్రువులు. వీనిం బరిత్యజించి సుఖింతును. ఇదియ నిజము.

కాంచ—నీకు నీప్రాణములె సంతాపకరములుగాఁ దోప నేమి కారణము? ఉదయనవియోగము భరింపఁజాలవేని యాసుభగునితో నరుగుము.

వాసవ—తలిదండ్రులయనుజ్ఞ నొందక యట్లు వోవుట ధర్మ విరుద్ధము గాదా?

కాంచన—క్షత్రజాతికన్యలకు స్వయంవరము విహితమై యుండ నీ వీసుందరుని వరించి యితనితో నేగుట యధర్మ మెట్లగును?

వాసవ—ఇది ధర్మ్యమే యైనను తలిదండ్రులయనుజ్ఞను నడయక ప్రియుని వెంబడించి యేగుట యపఖ్యాతికర ము గాదా?

కాంచన—ప్రియుని వెంబడి యేగుట యపకీర్తికర మెట్లగు?

వాసవ—ఇందు దోషము లేకున్నను వత్సరాజు ప్రద్యోతుని ప్రియపుత్త్రిక నపహరించెనని లోకులు చెప్పికొనుచుం దురుగాన నాతలిదండ్రుల మానభంగమున కెట్లుసమ్మ తింతును?

కాంచన— ఈమూలమున మీజనకునకు మానహాని సంభావిత మైనను నీ కిది యవశ్యకర్తవ్యమే యగు.

ఏలన, ఉదయనమహాసేనులకుఁ బూర్వవిరోధము కలి గియున్నకతనమీతండ్రియుదయనునిఁ బ్రార్థించుటగాని, తన్మా

లమున నతఁడు నిన్నుఁ బరిగ్రహించుటగాని సంభవింపదు. దానంజేసి యిప్పుడు వత్సరాజుతో నరుగుటయ శ్రేయమని బోధించి వాసవదత్త నొడంబఱచి యావృత్తాంతము యోగినీ ముఖమున నుదయనునకుఁ దెలుప నాయన యనుమతించెను.

అంత నారాత్రి వత్సమహీనాథుండు వాసవదత్తాకాంచనమాలలతో భద్రవతియను ధేనుక నధిష్ఠించి వెడలెను. అప్పుడందున్న పురరక్షకులు మున్నగువారిలో బెక్కురు యౌగంధరాయణుని గూఢప్రణిధులే యగుటంజేసి బహిర్ద్వారంబు దనుక నుదయనుని పయనంబు నిర్విరోధంబె యాయెను. పురద్వారమున నున్న వీరభటులు కౌశాంబీనాథు నడ్డగింప వారిని శరసంధానంబునం గూల్చి యుదయనుండు భద్రవతిని నడిపించుచుండెను. హతశేషులగు వీరభటులప్రేరణంబున మహాసేనుని సేనలు వత్సేశుని వెంబడింప యౌగంధరాయణుండు ఖడ్గహస్తుండై యాసేన నొక్కింతతడవు నిలిపెను. అంతలో వత్సరాజు సీమాంతము నతిక్రమించి నిజసైన్యంబుం గలిసికొని కౌశాంబీనగరప్రాంతంబుననున్న లావాణకంబను రమ్యహర్మ్యంబుఁ బ్రవేశించెను.

అష్టమ ప్రకరణము.

యౌగంధరాయణ సమ్మానము,

ఉజ్జయనీనగరమున నానాఁటిప్రభాతమున గొప్పకలకలము వినవచ్చెను. అప్పుడు సేవకులు తమలో నిట్లు సంభాషింపఁదొడంగిరి.

ప్రథముఁడు—ఈరణగుణధ్వని యేమి?

ద్వితీయుఁడు—వత్సరాజు వాసవదత్త నపహరించి కొనిపో యెను.

ప్రథము—వారి కెవ్వరు నడ్డపడ లేదా?

ద్వితీ—వారిని సేనయంతయు వెనుదవిలెను.

ప్రథము—అప్పు డేమయ్యెను?

ద్వితీ—ఒక్క మహాపురుషుఁడు ఖడ్గహస్తుఁడై యక్షౌహిణి నా పెను. అంతలో వారు యుద్ధేచ్ఛం జనిరి.

ప్రథ—ఆపురుషుఁ డెవ్వఁడు?

ద్వితీ—ఇంతదనుక నీనగరమున నున్మత్తవేషమునఁ దిరుగు చున్నయౌగంధరాయణుఁడే.

ప్రథ—ఏమి యీచిత్రము. ప్రాకారము, పురద్వారము దక్క యీనగర మంతయు గౌశాంబిగానె యున్నది. తరు వాత నేమయ్యెను?

ద్వితీ—యౌగంధరాయణుఁడు పట్టువడియెను.

ప్రథ—ఏమికారణము?

ద్వితీ—ఆమహామాత్యుఁడు సేనావేగము నాపగలిగెను. గాని యింతలో విజయసుందర మనుగజంబుదంతము దవిలి యాధీరునిచేతిని స్త్రింశము భగ్న మయ్యెను. దానం జేసి యామంత్రివరుండు చిక్కెను.

అనిచెప్పుచుండ యౌగంధరాయణునిఁ జేతులు గట్టి కొండఱు భటులు గొనిపోవుచుండిరి అప్పుడు యౌగంధరా

యణుఁడు తనలో శత్రువశముననున్న వత్సరాజును బంధవిముక్తుని గావించి యాయుధ దోషంబునఁ బట్టువడినను స్వామిదుఃఖము వాపితిగానఁ జయించితిననియె వైరిజనంబులోనికి నిర్విచారంబుగఁ బ్రవేశించు చున్నాఁడ, నని తలంచుచు జనులం గాంచి.

మహాజనంబులారా! భార్యారహితునకు వనవాసము దుఃఖకరముగాదు. కోరిక తీర్చుకొనిన వానికిఁ గష్టంబు ననిష్టంబు గాదు. ధర్మము నార్జించిన వానికి మరణంబును శోక కారణంబు గాదు.

ఏను విరోధము భయము అవమానము గూడ లెక్కింపక నయములను వినయములను శస్త్రములను యోజించి శత్రుని జయలక్ష్మిని మిత్రులయపకీర్తిని దొలఁగించి జయమును రాజును కీర్తిని నార్జింపఁ గంటిని.

రాజపురుషులారా! రాజభక్తివ్రతమున విపత్తినొందిన నన్నుం గాంచుడు.

అమాత్య పదకాంక్షులారా! నాకీర్తిలాభము లెక్కించి యభిలాషను స్థిరపఱుచుకొందురో? నాక్లేశముం దలంచి భయమొంది యాకోర్కి వీడుదురో యోజించుకొనుఁడు. అనినుడువుచుండ భటుండిట్లనియె.

భటుఁడు—ఆర్య! మిమ్ము నాయుధాగారమున నుంచుమని మంత్రిగారానతిచ్చిరి. అచ్చటఁ బెక్కండ్రు గావలివారలుందురు, అచ్చటికి రండు.

యౌగం.— ఈమాట యెంతో నగవు గలిగించెడిని. ఏలన, వత్సరా జనునగ్నిని బంధించి యునిచిన కాలమున మీా మంత్రులకు జాగరూకత యుండవలసెను. అప్పుడు నిద్రించిరి. రత్నము పోయినవెనుక పేటికయొక వారు చాల మెలకువతో నుండిరిగదా?

భటు—అయ్యా! ఇదె ఆయుధాగారము. ఇం దుండుడు.

యౌగం—అటులె యిందు విశ్రమింతును. భరతరోహకుఁడు నన్నుఁ జూడ రాఁగలఁడు. ఏనును వానిం జూడగోరుదు ఏలన.

అతఁడు సమానపదమున నుండి కపటోపాయములు పన్ని యు నాచేసినవంచనకు లోఁబడి మల్లయుద్ధమున నోడి లజ్జచే దలవంచుకొనిన ప్రతిమల్లునివోలె నుండుంగదా? అని పలుకు చుండునంత భరతరోహకుఁడు యౌగంధరాయణునిఁ జూడ నేతెంచుచు తనలో నిట్లు దలంచెను. వంచనములచే దనపని నెగ్గించుకొని రాజునిమిత్తమున విపత్తినొంది సరోష మగు నాశీవిషంబువోలె నుండుయౌగంధరాయణుని నెట్లుఁ గాంతు ను? అని తలపోయుచు వచ్చి.

భరత—ఆర్యా! యౌగంధరాయణుం డను నామాక్షరముల వినుచుంటిని. భాగ్యవశమున నేటికిమీాదర్శనము లభిం చెను.

యౌగం—మీాదర్శనంబును మాకు నట్లే లభించెను. కానిమీార వ్రతము నవలంబించి రక్తసిక్తాంగుండనై ధృష్టద్యు

మ్ముని జంపి శాంతి నొందినయశ్వత్థామవోలె నున్న నన్నుఁ బాగుగా జూడుము.

భరత—కపటోపాయములచే వత్సరాజు ననిపి యిది యొకశూరకృత్యముగా భావించుచున్నారా?

యౌగం— నీచేసినది శూరకృత్యమే? మల్లెతీవ యల్లినమద్దిచెట్టునొద్ద కృత్రిమగజంబు నిర్మించి రాజును వంచించితివి. నాకును నీదారినె రావలసె.

భరత—యౌగంధరాయణ! మీరాజు మహాసేనుకూఁతు నగ్నిసాక్షిక శిష్యురాలినిగాఁ బరిగ్రహించి వీరియ్యని దే యక్కన్నియను దస్కరవృత్తితో గొనిపోవుట యుచిత మగునా?

యౌగం—నీవి ట్లనుట యుచితము గాదు. అపు డగ్నిసాక్షికముగాఁ జరిగినది వివాహమనియె వారిర్వురుభావించిరి. అట్లుగానిచో వత్సరా జాయన్నువ నెట్లుగొనిపోవును? అప్పని కాయతివ యెట్లు సమ్మతించును?

భరత—మహాసేనుఁడు వత్సరాజును బంధనరహితుం జేసి సత్కరించియుండ వత్సరాజు వాసవదత్తనుఁ బ్రచ్ఛన్నముగా గొనిపోయి మహాసేను నవమానపఱుచు టుచితమా?

యౌగం—నీ విట్లనుట పాడి గాదు. ఏలన?అయ్యెడ వత్సరాజును బంధవిముక్తుని గావింపకున్నచో నలగిరి తమవారి నెల్లరను వధించియుండును. అట్లు మీరాజు స్వలాభ

ఁగోరి యుదయనుని బంధనములఁ దొలఁగించెగాని నతని సత్కరించుతలంపునం గాదుగదా?

భరత—అటులైన నప్పుడె కాఁగనే యతనినేల తిరుగా బంధింపఁ డయ్యెను?

యౌగం—అట్లు నలగిరిని వశపఱుచుకొని తమ నెల్లర రక్షించి నవాని బంధించునెడ కృతఘ్నుఁ డని లోకులెల్లరు తన్నుఁ గర్హింతురని యెఱిఁచి యట్లు సేయఁడయ్యెను.

భరత—అది యుండనిమ్ము. సంగ్రామమునఁ బట్టువడిన శత్రుని నేమిసేయు మని శాస్త్రము చెప్పెను.

యౌగం—వధింపు మని చెప్పెను.

భరత—వధార్హుఁ డగువత్సరాజును గాచినది దేనికి?

యౌగం—అద్దాననేగదా? యుదయనుఁడు మహాసేనునిశరీర మపహరింపఁ డయ్యెను.

భరత—ఇదియు శక్యమనియె భావించుచుంటిరా?

యౌగం—సంశయ మేమి? ఏనుఁగు మీఁది కెక్కక యటను న్నపతాకం బడఁద్రోయ నెట్లు శక్యమగు? మహాసేనుఁడువశపడకయున్న నాతనికూఁతు నపహరింప నగునే! కాన ధార్మికుఁ డగు వత్సరాజు నిజహస్తంగతుం డైన మీరాజును రక్షించెనని నమ్ముము.

భరత—కానిమ్ము మహాసేనునకు నపకృతి యొనర్చి యీమేని కౌఁ గౌశాంబి సేరుదునని యెన్నుచుంటివా ?

యౌగం—ఓహో! నీమాట యెంతనగు బాగుగానున్నది? చెట్టు పెకలించినవానికిఁ గొమ్మలు విఱుచుట యెంత పని? నాచే నపకృతులై నన్నప్పుడ చంపనెంచు మీ యెముఱకు జంకకవచ్చిననాకుఁ గౌశాంబి సేరుట కష్ట మగునే? అనిపలుకుచుండ నొకకంచుకి వచ్చి యౌగం ధరాయణునితో నిట్లనియె.

మంత్రీశ్వరా! స్వామిని రక్షింపనెంచియు శత్రుమా యనుజయింప యోజించియు, స్వీయాపయశంబు మాపుకొన దలంచియు స్వామికార్య దీర్చ నూహించియు నీవు మాయె డఁజేకు ఫలంబులఁ బన్నితివిగాని మాయందు ద్వేషంబున గాదు. గుణంబులయందు వైరం బెవ్వని కుండును?నీసామర్థ్యం బునకు మెచ్చితిమి. మా సేయుబహుమానంబు గ్రహింపుమని మహాసేనమహీపతి సువర్ణాభరణంబులం బనిచెనని యొసంగ వానిం గ్రహించి యౌగంధరాయణమహామాత్యుండు తనలో నిట్లుతలంచెను.

ఆహా! ఏనెంత నిందార్హుఁడను. నలగిరియను నేనుంగు నకు భీతిబుట్టింప నెంచి యేనిప్పువెట్టం గాలుచున్న గేహంబులు మంత్రివరులదెందంబులతో నింతకును జల్లాఱ వయ్యెను. దండా ర్హుండ నగునాకు మహాసేనుండు బహుమానంబుసేసెను.తప్పు సేసినవానిని సత్కరించుట వధించుటయ యగుగదా? అని తలపోయుచుండ రాజసౌధాగ్రంబునుండి హాహాకారంబు వినం బడియెను.

అది యేమని విచారింప నటనుండి యొక ప్రతీహారివచ్చి భరతరోహకు నుద్దేశించి ఆర్యా! అంగారవతి శోకాతిశయం బున నసువులబరిత్యజింపనెంచి మేడమీదనుండిపడఁబోయెను. అప్పుడు దాసీజనంబులు హాహాకారంబులు సేయుచు నామెం బట్టుకొనిరి. అంతమహారాజువారరుదెంచి దేవి!నీకూఁతునకు క్షత్రధర్మముతో వివాహము జరిగెను. సంతసపడందగిన కాలమున సంతాప మొందెదవేల? ఇప్పుడు చిత్రఫలకములమీఁద నున్న వాసవత్తావత్సరాజులకు వివాహము జరిగింతమనిచెప్పి యౌగంధరాయణునిఁ దోడ్కొని మిమ్మటకు నేతేర నానతిచ్చిరి. అని తెలుప భరతరోహకుండు వత్సరాజామాత్యునితో రాజసౌధంబునకుం జనియెను.

అప్పుడు ప్రద్యోతుండు మంత్రులతోఁగూడి చిత్రఫలకంబులకు మహావిభవంబున వివాహంబు గావించి కూఁతునకు నల్లునకును జేర్పుమని వసనాభరణ వాహన దాసీదాసాదికము ననంతముగా భరతరోహకునకు నొసఁగి యాయనను యౌగంధరాయణునితోఁ గౌశాంబికిననిచెను. యౌగంధరాయణుం డిట్లు మహావిభవంబుతో నిజనగరంబుఁజేరి యుదయనునిం దర్శింప నారాజేంద్రుండు యౌగంధరాయణునిం బహుభంగులఁ బ్రస్తుతించెను. ఆమహామాత్యుని నెల్లజనులును ప్రశంసించిరి. వత్సరాజుమహాసేనుం డనిచినవసనాభరణంబులం గ్రహించి భరతరోహకుని సత్కరించి యనిపి పెద్దకాలము వాసవదత్తతో సకలసుఖముల ననుభవించెను.

శ్రీరస్తు

చాణక్యుడు

ప్రథమ ప్రకరణము.

నందకుల విధ్వంసనము

కలియుగము నాదియందు నందవంశపు రాజులు పాటలిపుత్ర మనునగరము రాజధాని గావించికొని పుడమిం బాలించుచుండిరి. వారి రాజధాని పాటలీకుసుమపురమను ప్రధాన నామముగలదియగుటంజేసి యది పాటలిపుత్రమనియు కుసుమపురమనియు నుడువంబడుచుండును. ఆవంశమునందు సుప్రసిద్ధపరాక్రమశాలి యగుసర్వార్థసిద్ధి యనురాజు నవకోటిశతసంఖ్యాము లగుధనములకు నధిపతియై చిరకాలము ప్రజల నేలుచుండెను. ఆనరేశ్వరునకు వక్రనాసుండు మొదలగు బ్రాహ్మణులు కులక్రమాగతులైన యమాత్యులుగా నుండిరి. వారిలో దండనీతి బాగుగ దెలిసినవాఁడును పవిత్రుండు నతిశూరుండు నగురాక్షసుండనువిప్రుండు నందరాజులకు మాన్యుండై రాజ్యభారము వహించుచుండెను.

సర్వార్థసిద్ధికి సునంద యనురాజపుత్రి జ్యేష్ఠభార్యయు శూద్రకన్య యగుమురయనునది గనిష్ఠపత్నియు నైయుండిరి. వీరిలో సౌశీల్యములావణ్యము మున్నగుగుణములకలిమిం జేసి చిన్నభార్యయెడ రాజునకు నెక్కుడు ప్రేమ గలిగియుండెను.

ఆరాజేంద్రుఁ డొకప్పుడు తనగేహమునకు నతిథిగా వచ్చినయొకతపోనిధిని సపత్నీకుఁడై యర్ఘ్యాద్యాదివిధులతోఁ బూజించుచు నమ్మునిపాదోదకమును భార్యలశిరంబులమీఁదఁ జల్లగా జ్యేష్ఠభార్యాశిరమునఁ దొమ్మిదియు గనిష్ఠభార్యాశిరమున నొక్కటియు జలబిందువులు పడియెను. అప్పుడు కనిష్ఠపత్ని యాజలబిందువు నొక్కదానిని తలవాంచి యత్యాదరముతో గ్రహించెను. అది గాంచి యమ్మునీంద్రుం డానాతి నధికంబుగ ననుగ్రహించెను. అంత వృషలకన్య యగునామురాభిధాన యధికగుణయుక్తుఁ డగుమౌర్యుఁ డనుకుమారుంగనియెను జ్యేష్ఠపత్ని యగుసునంద బహుగర్భంబులు గలమాంసపేశిం బ్రసవించెను. ఆమాంసపుతిత్తియందుఁ దొమ్మిదిగర్భశకలంబులుండెను.

రాక్షసుండు వానిని నూనెతొట్లలో నునిచి పోషింప నాశకలంబులు తొమ్మండ్రుగురు వీరకుమారులైరి. వారల నామంత్రీంద్రుండు పెనిచెను. వీరు నవనందులని చెప్పంబడుచుండిరి. ఈరాజకుమారులు విద్యాశాలులై యౌవనంబు నొందగనె సర్వార్థసిద్ధి రాజ్యంబు వారలయం దునిచి మౌర్యుని సేనాపతిని గావించి తాను శమసుఖం బనుభవించుచుండెను.

అంత మౌర్యునకు నూర్వురు కుమారులు గలిగిరి. వారిలోఁ జంద్రగుప్తుఁడు గనిష్ఠుఁడు. వీరందఱు మహాబలవంతులై నందరాజుల నతిశయించి యుండిరి. అప్పుడు సింహళదేశపు రాజు తేనెమైనముతోఁ జేయఁబడి జీవించియున్నదియనోలె నుండునొకసింహమును పంజరమున నునిచి దానివాకిలి తెఱువ

నయ లోనిసింగమును వెలువరింపఁగల బుద్ధికుశలుఁడు మీలో నెవ్వఁడేని గలడాయని యనుప నానందు లందఱు నేమియుఁ దోపక మిన్నకుండిరి. అపుడు ధీమంతుఁ డగు చంద్రగుప్తుఁ డినుపకాడ నెఱ్ఱఁగ గాల్చి బోనున నున్నసింగమును ద్రవింపఁజేసెను. అదిగాంచి యెల్లరు నచ్చెరు వందిరి.

దుష్టచిత్తు లగునవనందులు మౌర్యునిప్రాబల్యమును జూడనోపక యొకభూమిగృహము గట్టించి యాలోచింపఁదగు రాజకార్య మొండు గలదని చెప్పి సపుత్రకుఁడగు మౌర్యునటకు రప్పించి చంపించిరి. చంద్రగుప్తునకు వెఱచి యతఁడు లేనియదనున నందు లీఘోరకృత్యంబు గావించుటచే దైవయోగంబున నాతఁడుమాత్రము శేషించెను. ఈమౌర్యకుమారుండాజానుబాహుండై శౌర్యము-ఔదార్యము-గాంభీర్యము మున్నగుగుణరత్నంబులకు రత్నాకరుండై యుండెను. అయినను దుష్టు లగునానందులు చంద్రగుప్తునెడ నసూయఁబూని యెప్పుడో వధింపవలయునను తలంపుతోన యుండి యాతని నన్నసత్రాధికారమున నియోగించిరి.

మౌర్యాత్మజుండు కాలవశమున నట్లయుండి నందుల యెడఁ బగఁదీర్చుకొననెంచి సమయము నిరీక్షించుచుండ నాతనికి నొకనాఁ డొక్క భూసురుండు పురంబువెలుపటఁ గనంబడియెను. ఆవిప్రుండు వచ్చుచుఁ దనకాలికి దర్భాంకురము గ్రుచ్చుకొనుటంజేసి దానిపై నలిగి యద్దానిని సమూలంబుగాఁ ద్రవ్వి కాల్చుచుండెను.

చంద్రగుప్తుం డతిక్రోధనుం డగునాయగ్రకులజు నవ
లోకించి యీతండు నందుల నిర్మూలనంబు సేయంజాలునని
యూహించి శరణుసొచ్చెను. విష్ణుగుప్తుం డను నాబ్రాహ్మణ
కుమారుండు బాలుండయ్యు శుక్రనిర్మిత మగుదండనీతియం
దును జ్యోతిషమునందును సమగ్రపాండితి గలవాఁడు. ఈమే
ధావి నీతిశాస్త్రకర్త యగుచణకాచార్యునకుఁ బుత్రుఁడు.
దానంజేసి చాణక్యుండని పిలువంబడుచుండెను. సర్వవిదుం
డును, శ్రోత్రియుండు నగునాబ్రహ్మచారి గుణాఢ్యుం డగు
చంద్రగుప్తునందు నాశ్రయపక్షపాతంబు వహించి నీయిష్టం
బెద్దియేనిఁ దీర్తుఁ దెలుపుమని యడుగ నామౌర్యతనయుండు
నవనందులు సేసిన దుర్నయము విన్నవించెను. అప్పు డాప్రజ్ఞా
నిధి విచారింపకుము. నందరాజ్యంబు నీయధీనంబు సేయుదు.
అట్లు సేయఁజాలనేని యేను చాణక్యుండఁగానని ప్రతిన
సేసెను.

తరువాత నాచణకనందనుం డాకలిగొని నందరాజుల
భోజనశాల కేగి యందు నగ్రాసనమున గూర్చుండి యుండెను.
అంత నందరాజు లరుదెంచి యాబ్రహ్మచారిం గాంచి యాగ్ర
హించి 'వలదని మంత్రు లందఱు వారించుచున్నను గాలోప
హతచిత్తులై' వడుగునకు నగ్రాసనంబు వలయునే, యని
యధిక్షేపించుచు నాయొంటి జందెమువాని నటనుండియీడ్చిరి.

అప్పుడు విష్ణుగుప్తుండు రోషాంధుండై భోజనశాల
నడుమ నిలువంబడి సిగముడి సడల్చి కన్నుల నిప్పులుప్రాల
గాంచుచు 'దుర్బుద్ధులును మదాంధులునై నన్ను నవమానిం

చినవందాధములను నిర్మూలముసేయక యీసిగ ముడివేయ
నని ఘోరప్రతిజ్ఞ సేసి యప్పుడ యప్పురినుండి వెడలిపోయెను.
ఆనందరాజు లభాగ్యు లవుటం జేసి యుద్ధతులై క్రుద్ధుఁ డగు
నాజన్నిగట్టును శాంతిపఱుపరైరి. అంత చంద్రగుప్తుండు నందు
లకు వెఱచి పురంబువిడిచి పఱచి చాణక్యు నాశ్రయించెను.

చణకతనూజుండు చంద్రగుప్తుని: జేర్చికొని పాపబ
హుళం బగునిక్కలికాలంబునఁ గుటిలనీతియె కార్యసాధకం
బని యూహించి దాని నవలంబించి నందకులము నుచ్ఛే
దింపం గడంగెను. ఆకోపముండు తనకు మిత్రుండును నాభిచారి
కకృత్యవిదుండు నగు నిందుశర్మయనువిప్రుని క్షపణవేషమున
ననిపి వానిచే రాక్షసుఁడు మున్నగుమంత్రులను వంచించెను.

నందరాజ్యమున నర్ధాంశము నీకొసఁగుదుమని చెప్పి
బలవంతుఁ డగుపర్వతేంద్రునిఁ బ్రోత్సహించి మ్లేచ్ఛబలము
లచే పాటలీపుత్ర మనునందరాజధాని నరికట్టించెను. అపుడు
గర్వితులగునందులు మంత్రులమాట విననొల్లక రణోన్ము
ఖులై పర్వతేంద్రబలం బనుజార్ఝానిలంబునం బ్రజ్వరిల్లుచాణ
క్యునిక్రోధానలంబున మిడుతలై మడిసిరి.

అంత రాక్షసుఁడు నందవంశంబున భక్తిగలవాఁడగు
టను మ్లేచ్ఛబలము చంద్రగుప్తునిచేఁ బ్రోత్సాహితమని తెలి
యుటను మౌర్యపుత్రునెడ లోన ద్వేషంబుపూనియుఁ బైన
మిత్రభావమునె కనంబఱచుచు, చంద్రగుప్తవధపూర్వకం
బుగా వృద్ధరాజునకె రాజ్యంబు సెందఁజేయ నెంచి కౌటి
ల్యుండు సర్వార్థసిద్ధి కేమి యనర్థంబు సేయునో యనిశంకించి

సురంగద్వారంబున వృద్ధరాజు వనమున కనిపి మౌర్య పుత్రుని సాధింపనెంచి పర్వతేంద్రునితో సంధి గావించు చుండెను

చాణక్యుండు చారులవలన సర్వార్థసిద్ధియుదంతంబు విని యాతనిం జంపించెను. రాక్షసుం డవ్వార్తవిని నందవంశంబు నిర్మూలంబగుటకు శోకించి పురంబువెడలి గ్రామాంతరంబున వసించి యెట్లేని మౌర్యపుత్రుం బరిమార్చి స్వర్గవాసు లైననందరాజులకు హితముసేయుదునని యోజించి ఆభిచారికవిదులవలన విషకన్యం గలిగించి యద్దానిం జంద్రగుప్తునిపైఁ బఱపుమని తనకు మిత్రుం డైనక్షపణకునిచే నని పెను. జీవసిద్ధి యను నాక్షపణకుండు చాణక్యునకు నాంతరంగికమిత్రుఁ డగుటచే నాతనివలన విష్ణుగుప్తుం డామర్మంబు గ్రహించి వానిచే నద్దానిని పర్వతేంద్రునిపైఁ బఱపించెను. అట్లు విషకన్యాప్రయోగంబునఁ బర్వతేశ్వరుండు నిహతుం డగుటచేఁ దనరాజ్యంబున నాతని కీఁదగినయర్ధాంశంబు కొంద వఁబడమింజేసి రాక్షసోద్యమంబు చంద్రగుప్తునకు హితకరంబె యాయెను.

ఇట్లు తనయుద్యమంబు విఫలంబైనను నుపేక్షింప నోల్లక రాక్షసుండు పర్వతేంద్రపుత్రుఁ డగుమలయకేతు నుద్దేశించి ,మీతండ్రికి తనరాజ్యమున నర్ధాంశమీవలసివచ్చునని యదితప్పించుకొనసెంచి చంద్రగుప్తుఁడు చాణక్యునిచేఁ బర్వతేంద్రునిమీఁద 'విషకన్యాప్రయోగము సేయించెను. నీకు నందరాజ్యము సర్వంబు నందఁజేయుదు. చంద్రగుప్తుని

జయింప నుత్సాహి వగుము. నందులయం దనురక్తు లగు సామంతు లందఱు నీకుఁ దోడ్పడునట్లు సేసెదనని చెప్పి దూతనితో మైత్రి సేసికొని యుండెను.

ద్వితీయ ప్రకరణము.

రాక్షసవశీకరణోద్యమము.

చాణక్యుండు రాక్షసోద్యమంబు నాకర్ణించి శిష్యునిం బిలిచి శార్ఙ్గరవా! ఏనుండఁగఁ జంద్రగుప్తునకు ద్రోహము సేయఁగలవాఁ డెవ్వఁడు? ఏనుఁగునెత్తురుఁ జవిచూచి మెత్తనైన సింగంబుదంష్ట్ర వెఱుక నెవ్వండు గడంగును? నందకులంబునకుఁ గాలసర్పంబై క్రోధాగ్నిశిఖ దగుధూమలేఖంబోని మదీయశిఖ యింకను ముడువఁబడకుండవలయునని యెవ్వండు కోరును? నందకులకాననంబునకు ధూమకేతువై జాజ్వల్యమానం బగునాకోపంబు ప్రతాపంబున మిడుతవోలెఁ బడను న్నమతిహీనుం డెవ్వఁడు?

రాక్షసుఁడు నందకులవినాశంబున రోషించి నందరాజ్యంబు సకలంబు నీకుఁ జేర్తునని మలయకేతునితో సంధి సేసికొని వాఁడు గూర్చుకొనుమ్లేచ్ఛరాజబలంబులంగూడి మౌర్యపుత్త్రునిపై దాడివెడల నున్నాఁడని తెలిసెను. అయిన నేమి? నందవంశము గూల్తునని బహిరంగముగ బ్రతిన సేసి నిర్వహించికొనిన యేను నీయుపద్రవము దొలఁగింపఁ జాలకుందునే?

నన్ను నగ్రాసనమునుండి లాగుచుండ గాంచినమంత్రు లిప్పుడు పర్వతశిఖరంబునుండి గజేంద్రునింబలె సాన్వయం బుగఁ ద్రోయంబడినసందునిం జూచిరి. నాప్రతిన నెగ్గినను వృషలపుత్త్రునికై యింకను శస్త్రంబు ధరించుచుండితి.

భూదేవిహృదయరోగంబులంబలె నందులఁ ద్రొమ్మండ్రను నిర్మూలించితి. సరసునందుఁ బద్మలతంబలె చంద్రగుప్తునందు రాజ్యలక్ష్మి నిలిపితి. ఇట్లు నిగ్రహానుగ్రహప్రవణంబగుచిత్తంబునఁ గోపఫలంబు వైరియందును ప్రేమఫలంబు మిత్రునందును విభాగించితి. గాని రాక్షసుండు వశపడకుండు నేని జంద్రగుప్తునిరాజ్యలక్ష్మి కేమి స్థైర్యము సంపాదించిన ట్లగు?

ఔరా! రాక్షసునకు నందవంశమున నెంతభక్తి గలదు? ఆవంశమున నొక్కఁడు మిలిగియున్నను రాక్షసునిచేఁ జంద్రగుప్తమంత్రిపదవి నంగీకరింపఁజేయ శక్యముగా దనియుచంద్రగుప్తునెడ ద్రోహచింత మానిపింపరా దనియు నూహించి నందవంశీయుఁ డగుసర్వార్థసిద్ధి తపోవనమునకుఁ బోయినను వానిని వెదకి చంపించితి. అయినను నతఁడు మలయకేతునిఁ జేర్చుకొని మమ్ముఁ బరిభవింప గొప్పయత్నమె సేయుచున్నాఁ డనుచు నాకాశమువంకఁ జూచి "అమాత్యరాక్షసా! మంత్రిబృహస్పతీ! నిన్నేమని పొగడుదును? లోకమున జనులు ధనము గోరి యైశ్వర్యయుతుఁడగు రాజు నాశ్రయించుచుఁ దరిద్రహితుఁడగువానిం బరిత్యజించుచు నుందురు. కాని ప్రభువు మృతి నొందినను తొల్లిటిమేలు దలంచి ఫలాపేక్షలేక స్వామిహితంబు గోరి వర్తించు నినుబోలువాని నెందుంగానను.

దాననేకదా? నిన్ను వృషలునకు మంత్రినిగాఁ జేయఁ బూని యత్నించుచున్నాఁడ. ప్రజ్ఞలేనివాఁడు-భయశీలుఁడు భక్తిగలవాఁడైనను వానితో నేమికార్యము? ప్రజ్ఞయువిక్రమంబు నున్నను భక్తిలేనివానితో నేమిలాభము? అన్నియుం గలవాఁడె కార్యసాధకుం డగునుగదా? కావున నేనిప్పని కై యత్నించు చుంటిని, ఎట్లన

చంద్రగుప్తపర్వతకులలో నెవఁడు మడిసినను చాణక్యునకు నపకారము గలుగుననియెంచి రాక్షసుఁడు విషకన్యను బనుప నద్దానిచే మాకుఁ బరమమిత్రుఁడగు పర్వతకుఁడు నిహతుండయ్యెనని లోకమున జనాపవాదము పుట్టించితి. చాణక్యుడే మీజనకునిఁ జంపించెనని భయపఱచి మలయకేతుని బలాయితునిం గావించితి. అట్లుసేయనిచో రాక్షసుండు వేరొక ప్రబలశత్రు నాశ్రయించి వానిచేఁ జంద్రగుప్తు నంతమొందించునో యనియెంచి యట్లు సేయవలసె. నాకుఁ బరమాప్తుండగు భాగురాయణుని మలయకేతునొద్ద మిత్రభావంబు చూపుచు నాతని నాశ్రయించి యుండుమని తెల్పి మలయకేతునితోఁ బనిచితి. రాక్షసు నాశ్రయించియున్నను బర్వతకపుత్రునిఁబదంపడి ప్రజ్ఞచే నిగ్రహింపనగును. మలయకేతు నిప్పుడే నిగ్రహింతునేని నేన వానిజనకునిఁ బరిమార్చితినని లోకము నిశ్చయించుగాన దానిచే రాక్షసునకు నీయపయశంబు గలుగక పోవుటయేగాక మదీయేప్సితంబును నెగ్గకుండును. స్వపక్షమునను పరపక్షమునను మనయెడ ననురక్తు లెవరో విరుద్ధులెవరో తెలిసికొనఁ నెంచి బహువిధవేషభాషాభిజ్ఞులైనగూఢచారులఁ

పెక్కర ననిపితిని. కుసుమపురమున రాక్షసునకు మిత్రులెవరో యని వెదకఁబడుచున్నది. చంద్రగుప్తునకు బాల్యమిత్రులగు భద్రభటుఁడు మున్నగువారు ప్రధానపురుషులు గావింపఁబడిరి. మాకు సహాధ్యాయుఁడు పరమమిత్రుఁడు నగునిందుశర్మ క్షపణకవేషము దాల్చి రాక్షసునకు విశ్వాసపాత్రుఁడై యున్నవాఁడు. వానిచే గొప్పపని నడిపింపవలయు. కావున నాకేమియుం గొదువ లేదు. చంద్రగుప్తుఁడు మాయందె సకలరాజ్యభారము నునిచెగాన నేను జాగరూకతతో మెదలవలయు. నని తలపోయుచుండ నొకపురుషుఁడు యమపటంబు బట్టుకొని వాకిటఁజేరి యనుమతుండై లోనఁ బ్రవేశించెను.

చాణక్యుండు వానిఁజూచి పౌరులచిత్తంబు లెట్లున్నవో కనిపెట్టనెంచి యేననిపిన నిపుణకుఁడె వీఁడని గ్రహించి కూర్చుండ నియోగించి,

చాణక్యుఁడు—భద్రుఁడా! నీపని నేమిసాధించితివో తెలుపుము

చారుఁడు—ఆర్యా చంద్రగుప్తమహారాజు నెడఁ బ్రజలకుగలవైమనస్యకారణములను మీరు దొలఁగింప నెల్లరు ననురాగముతోనే యున్నారు. కాని యీనగరమున మువ్వురుపురుషులుమాత్రము మంత్రిరాక్షసునకుఁ బరమమిత్రు లగుటంజేసి దేవరవారి పరిపాలనము నొల్లకున్నారు.

చాణ—(క్రోధముతో) వారు తమజీవితము నొల్లకున్నారని చెప్పుము. వారిపేర్లు తెలియునా?

చారు—పేరు తెలియనివారి నెట్లు విన్నవింతును?

చాణ—తెలుపుము.

చారు—మొదట శత్రువులయెడ పక్షపాతము వహించియున్న వాఁడు జీవసిద్ధి యనుక్షపణకుఁ డొక్కఁడు.

చాణ—జీవసిద్ధి వైరులయెడ పక్షపాతముతో నున్నవాఁడా?

చారు—జీవసిద్ధియనగా రాక్షసుఁ డనిపినవిషకన్యను పర్వతేశ్వరునిమీఁదఁ బడవేసినవాఁడు.

చాణ—(తనలో)జీవసిద్ధి మనగూఢచారుఁడే, (ప్రకాశముగా) కడమవాఁ డెవ్వఁడు?

చారు—లేఖకుఁ డైనశకటదాసుఁడు రాక్షసునకుఁ బ్రియమిత్రుఁడు.

చాణ—(నవ్వుకొని తనలో) లేఖకుఁ డనెంత? స్వల్పుఁడైనను వైరి నుపేక్షింపఁగూడదని యెంచి వానియొద్ద సిద్ధార్థకుని గావలియునిచితి, (ప్రకాశముగా) మూఁడవ వానిని దెలుపుము.

చారు—మూఁడవవాఁడు రాక్షసునకు రెండవహృదయమే. వాఁ డెవఁ డనిన, రత్నవర్తకుఁ డగుచందనదాసుఁడు. రాక్షసుఁడు వీనియింటనె తనభార్యను రహస్యముగా నునిచి వెడలిపోయెను.

చాణ—రాక్షసుఁడు వానియింటఁ దనభార్య నునిచెనని యెట్లు తెలిసెను?

చారు—ఈముద్రాంగుళీయకముం జూడుడు, ఇదియె మీ కీయుదంతము నంతను దెలుపును.

అనియొసంగ చాణక్యుండు దానిందీసికొని యందున్న రాక్షసునిపేరు చదివి సంతసమొంది "యంగుళీయకము గాదు. దీనితో రాక్షసుండె మాచేతికి దొరకెనని యెంచి చారునిగాంచి యిది నీకెట్లు దొరకెనో సవిస్తరముగా వినుపింపు మని యడుగవాండిట్లని చెప్పెను.

మీరు నన్నుం బౌరులచరిత్రము లెట్లున్నవో వెదకుమని యనుప నేను పరులయిండ్లకు నిశ్శంకముగా నేగుటకై యీ యమపటముతో నాడుచు గ్రమంబుగ చందనదాసు భవనంబునకుం బోయి యీయమపటముం బఱచి గీతములు పాడుచుంటిని.

అంతలో నొకగదినుండి యైదేండ్లయీడు గలచక్కని బాలుండు బాల్యసహజ మగుచాపల్యమున బైలువెడలెను. అపుడు చిన్నవాండు వెడలిపోయెనని స్త్రీజనంబురొద యాగదిలోన వినంబడియెను. అంత సుకుమారాంగి యొక్కతె మోముమాత్రము వాకిటనునిచి చూచి బుడుతండు వచ్చుచుండగనే బెదరించి చాచినచేతితో వానిం బట్టుకొనిపోయెను. ఆతొందఱలో నామెచేతినుండి జారి యీయుంగరము గడప మీందంబడి యెగిరివచ్చి నాదగ్గఱం జేరెను. దీనిమీద రాక్షసునిపేరు గలదనిగ్రహించి మీపాదమూలమునకుం జేర్చితిని ఈవిధమున నిది నాకు దొరకెను. నావుడు విష్ణుగుప్తుండు, ఓయీ! అంతయు వింటిని. అచిరకాలముననె యీపరిశ్రమంబునకుం దగిన ఫలంబు గందువు. పొమ్మని వానినంపి శిష్యునిం బిలిచి వానిచేం బత్త్రికను మషీభాజనమును దెప్పించి, దీని

మీఁద నేమివ్రాయుదు? ఈలేఖతో రాక్షసునిజయింప వలయు' నని యాలోచించుచుండుసంతలో ప్రతీహారివచ్చి ఆర్యునకు జయమగుఁగాక యనిపలుక నామాటవిని జయశబ్దము విననయ్యె. జయింతునని సంతసించి. ప్రతీహారిం బిలిచి నీవు వచ్చినపని యేమి? యనియడుగ నది యిట్లని విన్నవించెను.

అయ్యా! మీయాజ్ఞయైనచో పర్వతేశ్వరునకు పారలౌకికవిధి సేయింతుననియు అతఁడుధరించినయాభరణములను బ్రాహ్మణులకు నర్పింతుననియు మహారాజుగారు విన్నవింపుమనిరి. నావిని కౌటిల్యుఁడు "శోణోత్తరా! నామాటగా వృషలునితో నిట్లు చెప్పుము. నీకన్నియుఁ దెలియుగాన యథేచ్ఛముగా నొనరింపుము. పర్వతేశ్వరుఁడు దాల్చినయాభరణములను యోగ్యులకే సమర్పింపవలయుగాన నేను పరీక్షించి తగువారి ననుపుదును.

అని నుడివి ప్రతీహారిం బనిచి శిష్యునింబిలిచి నీవు విశ్వావసుఁడు మొదలుగా నన్నదమ్ములమువ్వురం గాంచి "మీరు చంద్రగుప్తునివల్ల నాభరణంబులం బ్రతిగ్రహించి నాకు గనఁబడుడని యేఁజెప్పితినని వారికిఁ దెలుపుమని కబురంపి పత్రికమీఁద నొకకొంతవ్రాసి సిద్ధార్థకుఁ డనువానింబిలిపించి వానితో నిట్లనియె.

ఎంతటి యత్నంబున వ్రాసినను శ్రోత్రియులహస్తాక్షరంబు లస్పష్టంబుగనే యుండును. గాన "ఒకానొకఁడొకానికి వ్రాయునట్లు స్వాంతముగఁ జదువుకొనవలయునని పేర్లులేని యీలేఖను శకటదాసునిచే వ్రాయించికొని రమ్ము. నేనిట్లు

త్రాయుమని చెప్పితినని వానికిఁ జెప్పకుము. నావిని యతండు శకటదాసునిచే నట్లు వ్రాయించి యాలేఖ నియ్యగా దాని మీాద రాక్షసునిముద్రాంగుళీయముచే ముద్రవేయించి మలయకేతుని జయించితినని సంతసించెను.

తరువాత "కౌటిల్యుండు సిద్ధార్థకునిఁగాంచి యిట్లనియె నీవు ముందుగా వధ్యస్థానమునకుఁ బోయి నేను రోషముతో గుడికన్నుఁ జిట్టించినపుడు వధ్యుని విడిచిపెట్టి మీరు పారిపోవుఁడని ఘాతకులకు బోధింపవలయు. వార లీగుర్తు దెలిసికొని పరుగిడిపోవ నీవు శకటదాసు నటనుండి వెంటఁబెట్టుకొని రాక్షసునివద్దకుఁ జేర్పవలయు. మిత్రునిప్రాణములు గాచితివని మెచ్చి రాక్షసుం డొసఁగుపారితోషకము గ్రహింపవలయు రాక్షసుని సేవించుచుఁ గొంతకాల మందుండవలయు. శత్రుల యొద్దనుండి యిట్టిట్లు సేయవలయునని చెవిలోఁ గొంత గఱపెను.

అనంతర మావిష్ణుగుప్తుండు శిష్యునింబిలిచి కాలపాశికుఁడు దండపాశికుఁడు ననువారికి నిట్లు సెప్పుము. ఏమనిన "రాక్షసునిప్రేరణంబున విషకన్యచే పర్వతకుని జంపిన జీవసిద్ధి యనువాని నీనగరమునుండి వెడలగొట్టుమని రాజాజ్ఞయాయెగాన నప్పని నిర్వర్తించుడని చెప్పుమని వచించి సిద్ధార్థకునకు రాక్షసునిముద్రాంగుళీయముతోఁగూడ నద్దానిచే తొలుత ముద్రవైచియునిచినలేఖ నొసఁగి యనిపెను.

పదంపడి చాణక్యుండు రత్నవర్తకుఁ డగుచందనదాసుని బిలిపింప నతఁడు వచ్చినం గాంచి కూర్చుండఁబనిచి

చాణక్య— శ్రేష్ఠీ! మీవ్యవహారములు లాభకరములుగా నున్నవియే?

చంద—(తనలో) ఈ యనయత్యాదరము భయజనకముగా నున్నది. (ప్రకాశముగా) తమయనుగ్రహముచే వ్యాపారము సాగుచున్నది.

చాణ—చంద్రగుప్తునిదోషములు ప్రజలను నందరాజులగుణములను దలపింపఁ జేయుట లేదుగదా?

చందన—(చెవులు మూసికొని)పాపము శాంతించుగాక. శరత్కాలసంపూర్ణచంద్రునిచేతంబలె చంద్రగుప్తునిచేఁ ప్రజ లధికముగ నానందించుచున్నవారు.

చాణ—శ్రేష్ఠీ! అట్లేని నానందించుజనులవలన రాజులు ప్రత్యుపకారము గోరుదురు.

చంద—ఈజనునివలన నేమికార్యము కావలయునో ఆనతిండు.

చాణ—శెట్టీ! యిది యిపుడు చంద్రగుప్తరాజ్యముగాని నందరాజ్యముగాదు. గానజనులు రాజునకు విరుద్ధముగా బ్రవర్తింపఁగూడదు.

చంద—అయ్యా! ఏనిర్భాగ్యుఁ డట్లు ప్రవర్తించును?

చాణ—అందు మొదటవాఁడవు నీవ.

చంద—(చెవులు మూసికొని)పాపము శాంతించుగాక. ఎం చేని గడ్డిపఱక యగ్గితో విరోధము వెట్టుకొన్నునా?

చాణ—రాజునకు నహితుఁ డగురాక్షసుని గృహజనము ని
ప్పుడు గేహమున నునిచికొని కాపాడుచున్నాఁడవుగదా!
ఇది విరుద్ధముఁగాదా?

చంద—ఇది నిజముగాదు. ఏవఁడో తెలియక యిట్లు మీకు
దెలిపెను.

చాణ—శెట్టీ! రాక్షసునిగృహజనమును మాయధీనము సే
యుము.

మాఱాడకుము. రాక్షసుఁడు చంద్రగుప్తునిఁ దఱిమి వే
యునని తలంపకుము.

అని నుడువుచుండ వీధిలోఁ గలకలధ్వని వినంబడి
యెను. అంతశార్ఙ్గరవా! ఆధ్వని యేమి?

శిష్యుఁడు— రాజాజ్ఞచే జీవసిద్ధి యూరినుండి వెడలఁగొట్టబడు
చున్నాఁడు.

చాణ—ఆ! క్షపణక! రాజునకు నప్రియము సేసినదానిఫల
మనుభవింపుము. చందనదాసా! అనిష్టముగా వర్తించి
నవారియెడ రాజు కఠినదండము విధించెడిని. నామాట
విని రాక్షసునిగృహజనము నర్పింపుము. రాజు నను
గ్రహము వడయుము. అనుచు రాజవీధిలో తిరుగా
ధ్వనినాకర్ణించి
శిష్యా! అదియేమో తెలిసికొని రమ్ము.
నావిని వాఁడుపోయి తెలిసికొని వచ్చి-

శిష్య—గురువర్యా! రాజద్రోహి యగుశకటదాసుఁడు శూలా
రోపణమునకై గొనిపోఁబడుచున్నాఁడు

చాణ—స్వకర్మఫల మనుభవింపనీ? శెట్టీ! రాజద్రోహులకు
శిక్ష యెట్లు జరుగుచున్నదో కంటివా? పరునికళత్రము
నకై స్వకుటుంబమును జీవితమునుగూడ నేల పోఁగొట్టు
కొనియెదవు?

చందన—అయ్యా! నన్ను బెదరించెద రేల? రాక్షసునిగృహ
జనము మాయింటనున్నను మీ కప్పగించువాఁడను
గాను. లేకున్న నెట్లులర్పింతును?

చాణ—ఇది నీనిశ్చయమే యగునా?

చందన—ముమ్మాటికి నింతయె నానిశ్చయము.

చాణ—(తనలో) ఔరా! చందనదాసుఁడా? స్వార్థము విడిచి
పరార్థమునకై జీవితము నర్పించువాఁడు శిబికన్న నిం
కొకఁడు లేడని యెంచితి. తిరుగ నీవంతవాఁడ వగు
దువు. దాననే రాక్షసుఁడు నీయింట నిజకళత్రము
నునిచిపోయెను. (ప్రకాశముగా) ఇది నిశ్చయమే?

చంద—బాగుగా

చాణ—దుష్టవర్తకుఁడా! రాజక్రోధము ననుభవింపుము.

చంద—సిద్ధముగా నున్నాఁడను.

చాణ—శార్ఙ్గరవా! నేను చంద్రగుప్తునకు దెలుపుదనుక వీని
ధనము నెల్లగైకొని పుత్రకళత్రములతోఁగూడ వీనిం
గట్టివేసి యునుచుమని దుర్గపాలునకుఁ జెప్పుము. ప్రా
ణహారమైనశిక్షను వృషలుఁడె నిర్దేశింపఁగలఁడు.

శిష్యు—శెట్టీ! ఇటురమ్ము.

చంద—ఇదిగో వచ్చుచున్నాఁడను. నేను మిత్రకార్యమునకై నశించుచున్నాఁడగాని పురుషదోషమున గాదు. అనుచు నతఁడుపోయెను.

అనంతరము శిష్యుఁడు వచ్చి "సిద్ధార్థకుఁడు వధ్యస్థానమునుండి శకటదాసునితోఁ గూడ దీసికొనిపోయెనని వచింప విని చాణక్యుండు కార్యారంభము జరిగెనని లోనసంతసపడి శార్ఙ్గరవా! ఏను బుద్ధిబలంబున నడవియేనుఁగునుం బలె రాక్షసుని నిగ్రహించి గ్రహింతునని ప్రతినసేసెను.

తృతీయ ప్రకరణము.

రాక్షసనీతి ప్రతిఘాతము.

రాక్షసుని గూఢచారుఁడగు విరాధగుప్తుఁడనువాఁడు పాములవాని వేషముతో పాటలిపుత్రమునందలి వృత్తాంతముల నరసి మరలి వచ్చువఱకు నమాత్యరాక్షసుం డిట్లు తలపోయుచుండెను.

ఎంతకష్టము సంప్రాప్త మయ్యెను? దైవయోగమునయాదవకులంబు పగిది నందవంశమంతయు నశింపఁ జింతాకులంబైన చిత్తంబున రేలుంబవళ్ళు నిదుర నెఱుంగక నాపడుప్రయాసమంతయు గోడలేనిచిత్తరువుం బోలెడిని.

ఏను భోగంబుల వాంఛించియో ప్రాణభంగంబునకు వెఱచియో స్వప్రతిష్ఠ నాశించియో యిట్లు గడంగి యుంటినా?

ప్రభువు స్వర్గస్థుఁడైనను దదీయశత్రువులఁ జక్కాడి ప్రభువు
నారాధించు కుతుకంబుననె రాజనీతియందు మనంబు జొన్పితి
గదా ?

ఓసిరీ! పుడమిమీఁద నుత్తమక్షత్రకులజు లగురాజు
లందఱు గాలిపోయిరే? కులహీనుం డగు మౌర్యపుత్త్రు నాశ్ర
యించెదేల? చపలంబగులలనల చిత్తము పురుషునిగుణంబు
గ్రహింపనేర్చునే?

ఓ యవినీతురాలా! నీయాశ్రయముం భంజించి నిన్ను
నిరాశ్రయం గావింతు జూడుము.

ఏను చందనదాసునింట గృహజనంబు నునిచి మంచి
పని చేసితి. దీనిచే చంద్రగుప్తు నుచ్ఛేదించునెడ రాక్షసుఁడు
సప్రయత్నుండను నమ్మకము గలుగుట నట మనపక్షమున
నున్న వారి యుద్యమము శిథిలంబు గాకుండుఁగదా? అట
మనయత్నంబులు నెగింప బహుళధనంబొసఁగి శకటదాసు నుని
చితి. అచ్చటి వృత్తాంతములు దెలుప జీవసిద్ధి మున్నగువారల
నియోగించితి. వ్యాఘ్రశిశువుం బలె నెవ్వనిం బెనిచి ప్రభువు
నాశమొందెనో వానిని బుద్ధివిశిఖంబునం భేదింతును. గాని
వానికి దైవంబు గవచంబు గాకుండవలయుఁగదా? అని తల
పోయుచుండఁ గంచుకివచ్చి రాక్షసు నవలోకించి ఆర్యా!
మలయకేతుఁడు తమతో నిట్లు విన్నవింపు మనియెను. మీకు
శరీరసంస్కారము లేకుండుట నాకు విచారకరముగానున్నది.
గాన నావిన్నపము నిరాకరింపకుఁడని తనమేనినుండి యీయా
భరణములను దీసి యిచ్చెను. గాన ధరింపుడు. నావిని రాక్ష

సుడు కుసుమపురమున సుగాంగమను సౌధమునందు నిన్ను సింహాసనాసీనుం జేయుటనుక శరీరసంస్కారము గావింపవోల్లె. నని చెప్పుమని పలికి తత్ప్రార్థనంబున నాసామ్యులందాల్చెను అంతట విరాధగుప్తుడు రాగా చూచి.

రాక్షసుడు—సఖుడా! కుసుమపుర వృత్తాంతము దెలుపుము.

విరాధ—చంద్రగుప్తుడు శకయవనకిరాతాది బలములతో కుసుమపురము ప్రవేశించినపిదప మీరంపినవిషకన్యచేఁ బర్వతకుడు నశించెను.

రాక్షసుడు—ఎంతచిత్రమో చూడుము. అర్జునుని జంపనెంచి కర్ణుడు గంటబశక్తిని గాపాడినట్లు నేను చంద్రగుప్తుం బరిమార్పనెంచి విషకన్యం డాచితిని. శ్రీకృష్ణుడాశక్తిని ఘటోత్కచునిమీదఁ బఱపించినట్లు విష్ణుగుప్తుండా విష కన్యను పర్వతకునిపై వినియోగపఱచెగదా?

విరాధ—దైవము తన యిచ్చచొప్పున జేయుచున్నది. ఏమి సేయనగును.

అట్లు తండ్రి మృతినొంద మలయకేతుండు వెఱచి పరుగిడెను. అంతఁ బర్వతకునితమ్ముఁ డైన వైరోచకుని నమ్మించి యునిచి విష్ణుగుప్తుండు చంద్రగుప్తుఁడు నందభవనంబున బ్రవేశించునని చాటించి శిల్పులనందఱఁ బిలిచి యిట్లనియె.

అర్ధరాత్రసమయమునఁ జంద్రగుప్తుఁడు నందసౌధమునఁ బ్రవేశించునుగాన మీరందఱుఁ బూర్వద్వారముమొదలుగా నందభవనము నలంకరించుఁడని వచింప విని వార లతని కిట్లనిరి. ప్రథమద్వారమును దారువర్మ మొందుగనె సంస్కరిం

చెను. తక్కువాకిటులె మాచే సంస్కరింపఁబడవలయు నని తెలుపచాణక్యుండు 'ఔరా! మేము చెప్పకయె ముందుగ పూర్వద్వారము దారువర్మ యలంకరించెనే? అతఁ డద్దానికిఁదగిన ఫలము వొందఁగలఁ డనియె.

అనంతరము కౌటిల్యుండు నేటిరాత్రి నందభవనప్రవేశము జరుగునని చెప్పి వైరోచకుని చంద్రగుప్తునితో నేకాసనమునఁ గూర్చుండఁబెట్టి యతనికి నర్ధరాజ్యమును విభజించి యిచ్చెను. అంత నాతనికిఁ జంద్రగుప్తునితో సమాన మగునలంకారము గావించి యెఱిఁగినవారికైన నిరువురలో భేదము గానిపింపకుండునట్లు పచరించి చంద్రగుప్తుఁ డెక్కునట్టిచంద్రలేఖయను నేనుఁగుమీఁద వాని నధిరోహితునిఁ జేయించెను. చంద్రగుప్తునితో రాజలోకము వెంబడివచ్చుచుండ వైరోచకుండు గజారూఢుండై ముందట వచ్చుచుండెను.

అప్పుడు మీప్రణిధి యగుదారువర్మ వైరోచకునిఁ జూచి చంద్రగుప్తుఁ డనిభ్రమించి యంత్రతోరణము నాతని మీఁదఁ బడవేయ సిద్ధము సేసెను. అంతఁ జంద్రగుప్తునేనుఁగైనచంద్రలేఖకు మావటీఁడుగా నున్నమీగూఢచారుఁ డగువర్వరకుఁ డనువాఁడు గజముమీఁద బంగరుగొలుసునకు గట్టియున్నకనకదండములోనిగత్తిం లాగనెంచి యాకనకదండము బట్టుకొనియెను అది యేనుంగునకు దవులుటంజేసి యది బెదరి గతభేదము నవలంబించెను. దానంజేసి దారువర్మ విడిచినయంత్రతోరణము గుఱిదప్పి వర్వరకునిమీఁద బడిన నప్పుడ వాఁడు మడిసెను. అంతట దారువర్మ తనయంత్రతోరణము గుఱిద

ప్పనసియు ఆనేరమునఁ దన్నెట్లును వధింతురనియు నిశ్చయించి యున్నస్థలము సేరి యటనున్నయినుపకీలము నొకదానిని విస రి వైవ వైరోచకుఁడు సీల్గెను.

రాక్ష—దైవయోగమున రెండును సనర్థములై జరిగెను. చం ద్రగుప్తుఁ డట్లయుండె. పర్వతక వైరోచకులు హతు లైరిగదా? దారువర్మ వృత్తాంత మెట్లు?

విరాధ—వైరోచకునిముందున్నజనులు దారువర్మను గడ్డల తో గొట్టి గడపిరి.

రాక్ష—మిత్రుఁడైనదారువర్మ కూలెనా? వైద్యుం డగున భయదత్తుం డేమిసేసెను?

విరాధ—అభయదత్తుఁ డొకనాఁడు విషమిశ్ర మగునౌషధ మునుబంగరుగిన్నెలో సిద్ధపఱచెను. దానినిచాణక్యహత కుఁ డవలోకించి యిది మారురంగుతో నున్నది గాన విషమిశ్రము. దీనిం ద్రావవలదని మౌర్యపుత్రు నకుఁ దెలిపెను.

రాక్ష—వైద్యునిగతి యే మయ్యెను?

విరాధ—ఆమందు వైద్యునిం బానము సేయుమనిరి. వాఁడ దిగ్రోలి గంతుగొనియెను.

రాక్ష— ఆహా! ఎంతఘనవైద్యుఁ డంతమొందెను? చంద్రగు ప్తుఁడు శయనించినప్పు డతనిం బరిమార్పనెంచి శయనగృహంబుగోడలలో డాగియున్న బీభత్సకుఁడు మున్నగువారలవృత్తాంత మేమి?

విరాధ—వారలవృత్తాంతము మహాఘోరము.

రాక్ష—వారం దుండిరని చాణక్యుఁడు దెలిసికొనలేడుగదా?

విరాధ—దురాత్ముఁడగు కౌటిల్యుఁడు చంద్రగుప్తునికంటె ముందుగా శయనగృహంబునకు వచ్చి నిపుణమతిఁ బరిశీలింపఁదొడంగెను. అపుడొకగోడబొఱ్ఱనుండి చీమలబారు వచ్చుచుండ నందొకచీమముక్కున నొకమెతుకుచిద్రుపగ అచుకొనియుండెను. దానిం జూడగనె మర్మముగ్రహించి యీగేహము పురుషగర్భము. అని నిశ్చయించి దానిం గాల్పించెను. దానంజేసి బీభత్సకాదు లందుమ్రగ్గి బుగ్గియైరి.

రాక్ష—ఆహా! వాని కెంతదైవబలంబు గలిగియున్నది? నా చేయుజతనము లన్నియు బగతునక యుపకారంబు లగుచున్నవి గదా?

విరాధ—అమాత్యవర్యా! ఉత్తమను మొదలిడినపని నడుమ విడువంజనదు.

ఆదిశేషునకు బహువ్రమోయుట దుఃఖకరంబుగాదా? అతఁడు పుడమినేల పడవ్రేయఁగూడదు? సూర్యునకు బరిశ్రమంబులేదా? ఆతఁడేల నిశ్చలంబుగా నుండరాదు? మొదలిడిన పనినిర్వహించుట సుజనులకుఁ గులవ్రతంబు గాన నది విడుచుట వారికి లజ్జాకరము.

రాక్ష—తరువాతవృత్తాంత మేమి?

విరాధ—చాణక్యుఁ డదిమొదలుకొని వేయివిధముల గనిపట్టి మనయాప్తుల నెల్లర నిగ్రహించుచున్నాఁడు.

రాక్ష—ఎవ్వారల నిగ్రహించెనో చెప్పుము.

విరాధ—విషకన్యనుఁ బర్వతకునిమీఁదఁ బఱపెనని చెప్పి జీవ
సిద్ధియనుక్షపణకుని నగరమునుండి వెడలఁగొట్టించెను.
శకటదాసుని దారువర్మాదులను రాజద్రోహంబునకై
పురిగొల్పెనని వానిని శూలారోపణంబు సేయించెను.

రాక్ష—హా! శకటదాసుఁ డింతదుర్మరణంబు నొందెనే? ఇం
కను సుహృద్వ్యసనంబులు విన సిద్ధముగా నున్నాను.
వినుపింపుము.

విరాధ—మీగృహజనమును దమకు నప్పగింపలేదను కారణ
మున చాణక్యుఁడు సర్వస్వమును దోఁచికొని చందన
దాసునిఁ బుత్రకళత్రములతోఁగూడ బంధించి కారఁ
బెట్టించెను.

అని చెప్పుచుండునంతలో శకటదాసుంను వచ్చి రాక్ష
సుని దర్శింప నతఁడు ఓయీ! నీవు కౌటిల్యునిబారిఁబడియు
నెట్లు మాకన్నుల కగఁబడితివని యడిగెను. నావుడు వాఁడు
సిద్ధార్థకునింజూపి యీతఁడు ఘాతకులం బారద్రోలి నన్ను ని
టకుఁ జేర్చెనని తెలుప రాక్షసుండు "సిద్ధార్థకా! నీచేసినయు
పకృతికి నేమి యొసఁగినను జాలదు. అయినను నీయాభరణము
లం గ్రహింపుమని తనయొడలిమీఁదినగల నన్నిటిం బారితోషి
కముగా నొసఁగెను.

అంత సిద్ధార్థకుఁ డాభూషణంబులం గ్రహించి విష్ణు
గుప్తు నుపదేశముం దలంచికొని యిట్లు సేయుదునని నిశ్చ
యించి "నాకిందుఁ బరిచితులు లేరు. వలసినప్పుడు దీసికొని

మెద. దీని నిచటన యునుచుడని యానగలమాటమీఁద రాక్షసునిముద్రాంగుళీయముతో ముద్రవైచి యద్దానిని రాక్షసునిభాండాగారమునఁ నె యునిచి. ముద్రాంగుళీయకమును రాక్షసునకు గనఁబఱిచెను. దానింజూచి రాక్షసుండు నీ కిది యెట్లు లభించెనని యడిగి యిదికుసుమపురంబున చందనదాసు నింటివాకిట దొరకెనని వాఁడు తెలుప నిద్దానినిం బత్నికి నిచ్చి వచ్చియుంటినని లోనందలంచి దానింగ్రహించెను. అప్పుడు సిద్ధారకుఁడు రాక్షసు నవలోకించి తమయనుగ్రహంబు నొందినవానికి కౌటిల్యునాజ్ఞవలనఁ బాటలిపుత్రమున ప్రవేశము దుర్లభము. గాన నేను గొంతకాలము మీసాన్నిధ్యమున వసింపఁగోరెద నని విన్నవించి యమాత్యునిచే ననుమతుండై యట నుండెను.

పిమ్మట రాక్షసుఁడు శకటదాసునుద్దేశించి నాముద్రాంగుళీయము నీవద్దనునిచికొని నాపనులు నీవ నిర్వహించుచుండుమని యాయూర్మికనతని కిచ్చెను. అంతఁ గతపయదినంబులకు నొకపురుషుండు మూఁడుతొడవులం దీసికొని విక్రయింప నేతేర శకటదాసుండు వానిని రాక్షసునకు గనఁబఱచెను. రాక్షసుఁ డానగలం గాంచి యియ్యవి గొప్పవెలగలవి గాన వీనిం దెచ్చినవానిని సంతోషపెట్టి యీభూషణములం గ్రహింపుమని నుడువ నతండట్లు సేసెను.

దైవహతిం జేసి తనయత్నంబు లన్నియు విషమంబు లగుచున్నను నమాత్యరాక్షసుం డుద్యమంబు మాననేరక చాణక్యచంద్రగుప్తులకు భేదంబు గలుగఁ జేయ నెంచి సమయంబు

గనిపట్టి మానోద్రేకకరంబు లగుచువచనంబుల నుడువుచుని పై తాళికులకు గబురంపుటయు వారొకపరి యట్టియన్యాపదేశవచనంబు వలుకగనే యాలించి కౌటిల్యుండు రాక్షసుభావంబు గ్రహించి చంద్రగుప్తునితో నేకాంతంబున మన మిర్వురము గొన్నినాళ్లు కలహంబు నభినయింపవలయునని బోధించి యానితో కృత్రకకలహంబుగావించి విరుద్ధభావంబు నభినయించుచుండెను.

రాక్షసుండు చంద్రగుప్తచాణక్యులకువిరోధంబుగలిగెననువార్తవిని మలయకేతు నుద్దేశించి చంద్రగుప్తుం డమాత్యవ్యసనంబున నున్నవాడు. గాన నిప్పుడు మహాబలసహితంబుగ పార్వతనూజు నిరోధింపుమని బోధింప నతండు సన్నాహంబు సేయుచు నమాత్యరాక్షసుండు సత్యవచనుండై పెనకు దోట్పునో లేక చంద్రగుప్తునితో సంధి గావించికొనునోయని సంశయించుచుండెను.

చతుర్థప్రకరణము.

రాక్షసమలయకేతు భేదము.

సిద్ధార్థకుండు మున్ను చాణక్యుండు శకటదాసుచే వ్రాయించినలేఖను సొమ్ములమూటను దీసికొని బైలువెడలి పోవుచుండ జీవసిద్ధి యనుక్షపణకుం డగపడి యిట్లనియె.

క్షపణకు—నీ వెటకుఁ బోయెదవు?

సిద్ధార్థకు—పాటలిపుత్రమునకుఁ బోవుదును.

క్షప—ఇటనుండి పోవువాఁడు భాగురాయణునిముద్రాలాంఛనము దీసికొనిపోవలయును.

సిద్ధా—నేను రాక్షసునిసంబంధిని.

క్షప—నీవు రాక్షసునిసంబంధివిగాని లేక పిశాచముసంబంధివిగాని యెట్లైనను నిది తప్పనేరదు. ఏపనికై పోవుచున్నాఁడ.

అని యతఁడు భాగురాయణునొద్దకుఁ బోవ భాగురాయణుండు వీనిం జూడగనే యితఁడు రాక్షసునిమిత్రుఁడైనజీవసిద్ధియని గ్రహించి,

భాగు—ఓయీ! నీవు రాక్షసునిపనికై పోవుచుంటివా?

క్షప—నేను రాక్షసునిపేరుగాని పిశాచముపేరుగాని వినంబడనిచోటునకే పోవుదును.

భాగు—మిత్రునిమీఁద నీకింత ప్రణయకోప మేల కలిగెను? అతఁడు నీకేదేని నపరాధము సేసియుండెనా?

క్షప—రాక్షసుఁడు నాకేమియు ద్రోహము సేయలేదు. నా చేసిన పనులయెడ నాకే లజ్జ కలిగెడిని.

భాగు—ఆపనుల నాకు వినుపింపుము.

మలయకేతుఁడు—(లోపలనుండి) నేనును వినఁగోరెద.

భాగు—రహస్యముగానిచో చెప్పుము.

క్షప—ఇది యంతరహస్యము గాదుగాని అతిక్రూరకృత్యమగును.

భాగు—నీ విది వివరింపనిచో నేను ముద్రాలాంఛనము నీయను.

క్షప—చెప్పక యేమి సేయుదు? వినుము. ఈయభాగ్యుఁడను మొదటఁ బాటలిపుత్రమున నుండుచు రాక్షసునితో మైత్రి సంపాదించితిని. ఆసమయమున రాక్షసుని ప్రేరణమునం జేసి విషకన్యంబఱపి పర్వతేశ్వరుని మడి యించితి.

మలయకేతుఁడు—హా! నాతండ్రి రాక్షసునిచేతనె యంత మొందింపఁబడియె నా? చాణకునిచే గాదా?

భాగు—తరువాత వృత్తాంత మేమి?

క్షప—ఆసంగతి గ్రహించి చాణక్యుఁడు నన్ను నగరము నుండి వెడలగొట్టించెను. నేటికిని రాక్షసుఁడు నన్నుఁ బెక్కు రాజకార్యములలోఁ బనుపుచున్నాఁడు. వానిలో నొక్కటొకటియు నన్ను నీలోకమునుండి సాగనంపు నదియే.

భాగు—పర్వతేశ్వరుని మీఁద విషకన్యను చాణక్యుఁడుగదా ప్రయోగము సేయించెను?

క్షప—(చెవులుమూసికొని) పాపము శాంతించుగాక. చాణక్యుఁడు విషకన్య పేరే యెఱుఁగఁడు.

భాగు—ముద్ర యిత్తును. ఈవృత్తాంతము మలయకేతునకు వినిపింపుము.

అను నంతలో మలయకేతుఁడు వెలుపటకు వచ్చి.

మలయ—సఖుఁడా! వీనులు బ్రద్దలుసేయు నిమ్మాట వింటిని.

క్షప — (తనలో) నామాట మలయకేతువు విని యెగదా?
నాపని తీరెను. అని క్షపణకుఁడు వెడలిపోయెను.

మలయకేతుఁడు — (ఆకాశము వంక చూచి) రాక్షసుఁడా!
రాక్షసుఁడా! నీకుఁ దగును.

తనకు మిత్రుఁడవని యెంచి సకలకార్యములు నీయంద యునిచినమ్మియున్న నా తండ్రిని గడపితివి. గాన సార్థకముగా రాక్షసుఁడవే యగుదువు.

సఖుఁడా! రాక్షసుని శీలము దెలిసెను. ఇపుడేమి సేయుదము?

భాగు — ఇపుడు రాక్షసునిం దూఱగూడదు. నంద రాజ్యము లభించుదనుక నతనిని బట్టుకొనియె యుండవలయు. తరువాత నెట్లయినఁ జేయనగు.

మలయ — సఖుఁడా! నీచెప్పినది యుచితముగా నున్నది. ఇపుడు రాక్షసుని సముఝింతుమేని ప్రకృతిక్షోభంబు గలుగుం గాన మనకు జయము సందిగ్ధమగును.

అనునంతలో నొక పురుషుఁడువచ్చి మలయకేతునితో నిట్లని విన్నవించెను. దేవా! ఒకానొకఁడు ముద్రాలాంఛనము లేకయే యిక్కటకమునుండి వెడలిపోవుచుండగా పురరక్షకుఁడు లేఖతోఁగూడ వానిఁబట్టుకొని మీ సన్నిధి కనిచెను. వీనిం జూడుఁడు.

అని చెప్పిబాధించికొనిరాఁబడినసిద్ధార్థకునిగనఁబఱిచెను వానింజూచి భాగురాయణుఁడు.

భాగు — నీ వాగంతుకుఁడవా? లేక యిందుండువాఁడవా?

సిద్ధా—ఏను రాక్షసుని సేవకుఁడను.

భాగు—ముద్రచీటి గైకొనకయె యేల పోవుచుంటివి"

సిద్ధా—కార్యావసరముచే నట్లు వోయితిని.

భాగు—రాజశాసనముంగూడ నుల్లంఘించి పోవలసినంతకా
ర్యమేమి?

మలయ— భాగురాయణ!ఆలేఖ లాగికొనుము.

భాగు—(సిద్ధార్థకునిచేతినుండి లేఖను దీసికొని) కుమారా! దీ
నిమీఁద రాక్షసునిముద్ర యున్నది.

మలయ—ఆముద్ర చెడకుండునట్లు లేఖను విచ్చి చూడుము.
నావిని భాగురాయణుఁ డట్లు లేఖనువిప్పి చూపగా మ
లయకేతుఁ డిట్లని చదివెను.

స్వస్తి, ఉన్నచోటునుంచి యొకానొకఁ డొక్క పురుషునకు బోధించునది. యేమనిన, సత్యవాది వగునీవు మావిరోధిని నిరాకరింతునని యాడినమాట నిజము గావింపవలయు. ఇపుడు ముందుగ సంధిసేసికొనినమనమిత్రులకు వారికిఁ బ్రతిః సేసినది యిత్తుమని ప్రోత్సహించి ప్రీతి గలిగింపవలయు. ఇట్లు వారల ననుగ్రహించునెడ వారు తా మాశ్రయించినవానిం దెగటార్చి యుపకారముసేసినమిమ్ము నాశ్రయింతురు. నీవు సత్యసంధుఁడవుగాన నాడినమాట మఱువవు. అయినను జ్ఞాపనము సేయుచున్నాఁడను. ఈమిత్రులలో గొందఱు శత్రునికోశదండముల గోరువారును మఱికొందఱు దేశముగోరువారును నగుదురు. సత్యవచనుండ వగునీయంపినమూఁ డాభరణములు నాకుఁ జేరెను. రిక్తహస్తముతోఁ బ్రభునకు లేఖ యనుప

గూఢతను నాచారముఁబట్టి యేదేనిఁ గొంచె మంపితిని. దీని గ్రహింపుము విశేషములను పరమాప్తుఁ డగుసీఁజనునివలన వినునది.

మలయ—లేఖ యెట్లున్నది?

భాగు—(సిద్ధార్థకుని జూచి) ఈలేఖ నెవ్వనియొద్దకు గొని పోవుచున్నాఁడవు?

సిద్ధా—నాకుఁ దెలియదు

భాగు—ఓరె! ధూర్తుఁడా! ఎవ్వనికైనది తెలియకయే లేఖంగొనిపోవుచుంటివా! భాసురకా! వీని నవ్వలికిఁ గొనిపోయి నిజము సెప్పుదనుకఁ దన్నుము.

నావిని భాసురకుఁడు సిద్ధార్థకునిఁ దాడనము సేయుచుండ నాతనికక్షమునుండి యొకమూట గ్రిందఁబడియెను. దానిందీసి కొనివచ్చి భాగురాయణునకు నియ్యగా నతఁడు చూచి.

భాగు—దీనిమీఁదగూడ రాక్షసునిముద్ర గలదు

మలయ—రిక్తహస్తము గాకుండ ననిపినది యిదియె యైయుండనగు? దీనినిగూడఁ బైముద్ర చెడకుండ విప్పిచూపుము. నావిని యతం డట్లుసేయం జూచి,

మలయ—ఆహా! ఈనగలు నేను మేనినుండి తీసి రాక్షసునకు నంపినవే. స్పష్టముగ నీలేఖ చంద్రగుప్తున కంపినదే!

భాగు—ఇది నిజమో? సంశయమో? భాసురకుఁడా! వీనిని బాగుగా మర్దింపుము

సిద్ధార్థకు—(పాదములమీఁదఁబడి) అభయమొసఁగుదురేని నిజము విన్నవింతును

మలయ—చెప్పినంత సేయువాఁడవు. ఇందు నీనేర మేమి? నీ
కేమియు భయము లేదు. నిజము దెలుపుము.

సిద్ధార్థ—అమాత్యరాక్షసుఁ డీలేఖను చంద్రగుప్తున కిమ్మని
నన్నుఁ బనిచెను

మలయ—నిన్నుచటఁ జెప్పుమనిన మాట లేమి?

సిద్ధార్థ—రాక్షసుఁడు చెప్పుమనిన దేమనిన?

కులూతాధిపతి యగుచిత్రవర్మయు మలయనగరాధిపతి యగుసింహనాదుఁడును కాశ్మీరదేశాధిపతి యగుపుష్కరాక్షుఁడును సింధుదేశపతియగు సింధుసేనుఁడును పారసీకుఁడగు మేఘనాదుఁడును నీయేఁగురు మనకు మిత్రులు. వీరిలో మొదటిముప్వురు మలయకేతుని రాజ్యము గోరుచున్నారు. కడమయిద్దఱిలో నొకడు హస్తిబలమును ఇంకొకఁడు కోశబలమును గాంక్షించుచున్నారు. చాణక్యుని నిరాకరించి నాకు సంతసము గలిగించినట్లు వీరికిని వాగ్దానము సేసినది చెల్లింపుమని చెప్పుమనియెను.

మలయ—(తనలో) ఎట్లూ! చిత్రవర్మాదులు నాయెడ ద్రోహము సేయఁ గాచికొని యున్నవారె? (ప్రకాశముగా) విజయా! రాక్షసుని బిలువుము.

నావిని ప్రతీహారి పోవునటకు నటరాక్షసుండు పాటలిపుత్రమునకై దండయాత్రకుఁ బోవ రాజులను బ్రోత్సహించుచును బ్రతీహారిం జూచి యది చెప్పినమాటవిని వారిననిపి శకటదాసుంగాంచి యిప్పుడు మలయకేతునిఁ జూడబోవలయు. అలంకారరహితముగా బోఁగూడదు. గాన మనము

గొన్నవానిలో నొక్కటి యిమ్మని వానివలన గ్రహించి యుది ధరించి మలయ కేతునొద్దకు వచ్చి?

రాక్ష—కుమార! జయ మగుగాక.

మలయ—నమస్కరించుచున్నాఁడ కూర్చుండుడు. మీదర్శనము సేసి పెక్కునా ళ్ళగుటచే నాచిత్తము వ్యాకులముగా నున్నది.

రాక్ష—దండయాత్రవిషయమున దగువిధానము నాలోచించుచుంటం జేసి కుమారునిచే నిట్లు మాట వడితిని.

మలయ—దండయాత్రవిషయమున నేమి యాలోచించితిరి?

రాక్ష—ఖశ మగధాధిపతులు ననుంగూడి సేనలతో వ్యూహము వన్నుకొని ముందును, గాంధారులు యవనులు నడుమను, శకులు, చీనాదేశీయులు, హూణులు వెనుకను, కులూతాధిపతి మొదలగు రాజు లందఱు నిన్నుజుట్టుకొని యావెనుకను నివ్విధమున చంద్రగుప్తుని పీటికి దాడి వెడలవలయునని నియోగించితిని.

మలయ—(తనలో) నన్నుఁ జెగటార్చి నా రాజ్యము నపహరింపఁ జూచు కులూతాధిపతి మొదలగు వారినె నాకుఁ జుట్టునుండునట్లు విధించెను. (ప్రకాశముగా) ఆర్య? ఎవఁడైనఁ గుసుమపురమునకు బోవుటగాని యటనుండి వచ్చుటగాని కలదా?

రాక్ష—రాకపోకలవలని ప్రయోజనములు సమాప్తమయ్యెను. కొలఁదిదినములలో మనమె పోదుము.

మలయ—(తనలో) చంద్రగుప్తునకు మంత్రిత్వము సేయఁ
బోనుపని తెలియుచునేయున్నది. (ప్రకాశముగా) అట్లైని
లేఖతో నీమనుజు నెట్టు లటకు ననిపితివి?

రాక్ష—(చూచి) సిద్ధార్థకా! ఏమిరాయిది?

సిద్ధా—(కన్నీరు విడిచి లజ్జపడుచు) అనుగ్రహింపవలయు
నన్ను గొట్టగా రహస్యము దాపఁ జాలనైతి.

రాక్ష—రహస్య మేమిరా? నా కేమియుఁ దెలియుట లేదు.

సిద్ధా—చావమోదిరి. ఏమి సేయుదును?

మలయ—భాగురాయణ! రాక్షసునెదుట వీఁడు భయపడి
నిజము సెప్పఁజాలకున్నాఁడు. నీవు చెప్పుము.

భాగు—అమాత్య! మీరు లేఖనిచ్చి రహస్యముగాఁ గొన్ని
మాటలు చెప్పుమని తన్ను ననిపినట్లు వీఁడు చెప్పుచు
న్నాఁడు.

రాక్ష—సిద్ధార్థకా! ఇది నిజమే?

సిద్ధా—నన్ను మిక్కుటముగాఁ గొట్టగా నట్లు సెప్పితిని.

రాక్ష—ఇది నిజముగాదు. దెబ్బలు పడఁజాలక యేదేని
జెప్పుట కలదు.

మలయ—భాగురాయణ! లేఖం జూపుము. సందేశము
వాఁడె చెప్పును.

భాగు—అమాత్యా! లేఖ యిది.

రాక్ష—(చదువుకొని) కుమార! ఇది శత్రుని ప్రయోగము.

మలయ—రిక్తహస్తముగా లేఖ ననుపఁగూడదని యాభరణములఁగూడ ననిపియుంటిరి ఇది శత్రుని ప్రయోగమెట్లగును?

రాక్షస—(ఆభరణములను జూచి) కుమారుఁడు వీనిని నాకై యనిపెను. వీనిని నేనొకప్పుడు సిద్ధార్థకునకు బహుమానము నిచ్చియుంటిని.

భాగు—ఇంత యనర్ఘాభరణములు, అందును రాజకుమారుఁడు తనయొడలినుండి తీసి యనుగ్రహించినవి ఎవ్వానికేని నీఁదగినవే?

మలయ—వీనివలనఁ గొంతసందేశము వినవలయుననియు నాలేఖయందు గలదు.

రాక్ష—సందేశ మెవ్వఁడు సెప్పెను? ఎవనికిఁ జెప్పెను? ఈలేఖయె నాదికాదు.

మలయ—అటులేని నీముద్ర యెవ్వనిది?

రాక్ష—ధూర్తులు కపటముద్రను బుట్టింపగలరు?

భాగు—రాజా! రాక్షసుఁడు చెప్పునదిసరిగానెతోఁచుచున్నది. సిద్ధార్థకా! ఈలేఖ వ్రాసిన వాఁడెవ్వఁడు? నావుడు సిద్ధార్థకుఁడు రాక్షసునిమొగము చూచి తలవంచుకొని యూరకుండెను.

భాగు—అరే! తిరుగ దెబ్బలు దిన నేల? చెప్పుము.

సిద్ధా—శకటదాసుఁడు వ్రాసెను.

రాక్ష—దీనిని శకటదాసుఁడె వ్రాసియున్నచో నే నంపినట్లే

మలయ— విజయా! శకటదాసుని బిలువుము.

భాగు—కుమార! రాక్షసు నెదుట శకటదాసుఁడుదీనిని తాను వ్రాసితినని యొప్పుకొనఁడు. కావున వానిచే నేదేని వ్రాయించి తెప్పించు నెడ నక్షరములపోలిక యే నిజము తేల్పఁగలదు.

మలయ—విజయా! శకటదాసుని స్వహస్తలిఖితమును రాక్షసుని ముద్రను రెంటిని దెమ్ము.
అంత నదిపోయి యారెంటిని గొనిరాఁ జూచి

మలయ—అక్షరములపోలిక యేమియు భేదింపలేదు.

రాక్ష—(తనలో) పోలికసరిపోయెనా? ధనాశచేనతఁడిట్లు చేసెనో? ఇందుసందియ మేమి? నాముద్ర వానియొద్దనేయున్నది. లేఖలోనియక్కరములు వానివే. పగలతో సంధిచేసికొని శకటదాసుఁ డిట్టిపని చేసియుండనోపు?

మలయ—ఆర్యా! ఈలేఖయందు మీరంపిన మూఁడునగలు మాకుఁ జేరెనని యున్నది. మీరు ధరించినది వానిలో నొకటియెగదా? (ఈయాభరణము నాతండ్రి ధరించినదియే యని గుర్తు పట్టి (ప్రకాశముగా) ఇది యిాకెట్లు వచ్చెను.

రాక్ష—వర్తకులు విక్రయింపఁ గొంటిని.

మలయ—విజయా! ఈభూషణము నీవు గుర్తు పట్టితివా?

ప్రతీహారి—ఇది మీతండ్రిగారు ధరించినదే.

రాక్ష—(తనలో) ఇది పర్వతేశ్వరుఁడు ధరించెనని చెప్పఁ
చున్నది. (ప్రకాశముగా) వీనిని చాణక్యుఁడే వర్తకుల
కిచ్చియనుప నేను వారి యొద్దఁ గొనియుంటి.

మలయ—మాతండ్రి ధరించినవి. చంద్రగుప్తునకుఁ జిక్కినవి,
వీనిని వర్తకులు విక్రయించి రనుట యెట్లు సంగతి
మగును? ఒక్కవిధమున నిది నిజమే. ఎట్లన,

చంద్రగుప్తుఁడధికలాభము గోరి యీ భూషణములను
నీకు విక్రయింపఁ గ్రూరుఁడ వగునీవు మమ్ముం గ్రయధన
ముగా నతని కర్పింప నెంచితివి.

రాక్ష—(తనలో) శత్రుప్రయోగము సంకటముగా నేర్పడి
యెను.

లేఖమీఁద నాముద్ర కనఁబడుచుండ నిది నే నంపినది
కా దనుట యెట్లు? శకటదాసుఁడు మోసము సేసె ననినఁ
నెవ్వరు నమ్ముదురు? చంద్రగుప్తుఁ డీతొడవుల విక్రయము
సేయించెననిన నేవారు విశ్వసింతురు? గాన దీని నేనొప్పుకొను
టయె యుచితము.

మలయ—ఆర్యుని నేనిది యడుగుచున్నాఁడను.

రాక్ష—ఆర్యుఁ డెవఁడో వాని నడుగుము. ఇపుడు నే ననా
ర్యుఁడ నైతిని.

మలయ—మౌర్యుఁడు నీకు స్వామిపుత్రుఁడు. ఏను నీకు మిత్ర
పుత్రుఁడను. అతఁడు నీకు ధనము నిచ్చును. ఇచట
నాకు నీ విచ్చువాఁడవు. అచట మంత్రిగా నుందువు.

ఇచట ప్రభువుగా నుందువు. ఏమి యాధిక్యముగోరి యిట్టిపని చేసి యనార్యుఁడ వైతివి? లేఖతో సనిపిన సొమ్ములం జూడుము. ఇది యేమి?

రాక్ష—ఇది విధివిలాసము.

మలయ—ఇంకను గప్పిపెట్టుచుంటివా? ఇది విధివిలాసమా? లోభవిలాసము గాదా?

అనార్య! కృతఘ్నుఁడా! విషకన్యను బ్రయోగించి నిన్ను నమ్మినతండ్రిని జంపించితివి. ఇపుడు మంత్రిపదవి నార్జింపనెంచి నీయందు సర్వకార్యభారం ముంచినమమ్ము మాంసముంబలె విక్రయించికొనఁ దలపెట్టితివి,

రాక్ష—(తనలో) మర్మస్థాన వ్రణముమీద నింకొకవ్రణము. (ప్రకాశముగా) చెవులుమూసికొని, పాపము శాంతించుగాక, పర్వతేశ్వరునిమీద విషకన్యను బంపినది నేను కాదు.

మలయ—అట్లైని మాజనకునిఁ జంపించినవాఁ డెవఁడు?

రాక్ష—దైవము నడుగవలయు.

మలయ—దైవము నడుగవలయునా? క్షపణకుఁ డైన జీవసిద్ధి నడుగ నక్కఱలేదా?

రాక్ష—(తనలో) జీవసిద్ధియుఁ జాణక్యునిగూఢచారుఁ డే? ఆహా! శత్రువులు నాహృదయముగూడ స్వాధీనము సేసికొనిరి.

మలయ—(క్రోధముతో) భాసురక! రాక్షసునకు మిత్రులై నాకు ద్రోహము సేయఁబూనిన కులూతాధిపతిమొద

లఁగువారిలో మొదటిమువ్వురు నాభూమి నేలఁగోరు చున్నారు గాన వారిని లోతైనగుంటలలో నునిచి పూడిపింపుమనియు, మదీయహస్తిబలము నాశించిన వారిని హస్తితోనె త్రొక్కించి రూపుమాపు మనియు శేఖరసేనునితోఁ జెప్పుము.

రాక్షసుఁడా! రాక్షసుఁడా! నేను విశ్వాసఘాతి నగు రాక్షసుఁడగాను. మలయకేతుఁడను. పొమ్ము. అన్నివిధముల చంద్రగుప్తునే యాశ్రయింపుము. చూతుము.

విష్ణుగుప్తుఁడు, చంద్రగుప్తుఁడు వీరిద్దఱు నీతోఁగూడి వచ్చినను, దుర్ణయము ధర్మకామార్థములంబలె మీమువ్వురను నిర్మూలము సేయఁజాలుదును.

భాగు—కుమార! కాలహరణమేల? కుసుమపురము నిరోధింప సేనలకు ననుజ్ఞ యిమ్ము.

నా విని మలయకేతుండు ప్రస్థానోద్యమమున నుండెను. అంతట రాక్షసుండు తనలో ఎంతకష్టము ప్రాపించెను? రాక్షసుఁడు సేయునుద్యమము శత్రునాశనమునకు గాదు. మిత్రవినాశమునకే వినియోగించుచున్నది. అభాగ్యుఁడ నేనిప్పు డేమి సేయుదు?

ఏను తపోవనంబున కేఁగుదునా? సవైరంబగు నాడెందము తపముచే శాంతినొందనేరదు. శత్రువు జీవించియుండ స్వామి ననుగమింతునా? ఇది స్త్రీజనకృత్యంబగును. ఖడ్గమాత్రసహాయుండనై శత్రుబలంబునం బడుదునా? అది నిష్ఫలంబయగు. చందదాసును బంధముక్తునిఁ జేయఁబూననిచోఁ

గృతఘ్నుండ నగుదునని యెంచి పాటలిపుత్రమునకు బైలు దేరెను.

పంచమప్రకరణము.

రాక్షస వశీకరణము.

సిద్ధార్థకుడు చాణక్యుఁ డుపదేశించిన కార్యము నంగీకృతార్థుండై పాటలిపుత్రమునకు వచ్చి మలయకేతుఁడు మిత్రప్రయోగంబునం జేసి రాక్షసుని వదలిపెట్టె ననియు, చిత్రవర్మాది మిత్రుల వధించెననియుఁ జాణక్యునకుఁ దెలుప నతఁడు ప్రహర్షంబునొంది యీయుదంతమును మహారాజునకు, దెలుపుమని చెప్పెను. చంద్రగుప్తుండు సిద్ధార్థకునివలన నీవృత్తాంతము విని చాణక్యుని మాహాత్మ్యంబునకు నచ్చెరు వందెను.

మలయకేతుఁడు చిత్రవర్మాదులను వధింపఁ దక్కువారిలో ముఖ్యులును మలయకేతుని వదలిపెట్టి పోయిరి. అయినను బర్వతకపుత్రుఁడు భాగురాయణునితోఁగూడి నిజబలసహితుఁడై పాటలిపుత్రంబు నిరోధించెను. అంత చాణక్యుండు సారవంత మగుసేనా నివహము ననిపి వానింజయించి భాగురాయణునితో బంధించి కారం బెట్టించెను.

రాక్షసుండు మలయకేతుని కటకంబు విడిచి ఖడ్గహస్తుండై యుదుంబరకుఁ డనుచారునితోఁ బాటలిపుత్రమునకు వచ్చుచు నిట్లు తలపోయఁదొడంగెను.

రాజలక్ష్మి తనయాశ్రయము నశింపగనే కులట వోలె నితరకులజు వరించెను. గతానుగతికు లగు జనులును దానినె వెంబడించిరి. ఆ ప్రజనులును పురుషకారము ఫలింప మింజేసి కార్యభారము విడిచిరి. అట్లుగాక తలలేని యొడలి యంగములవోలె నున్నవా రేమిసేయఁగలరు? ప్రభుపు మృతి నొందినను పర్వతేశ్వరు నాశ్రయించి యత్నము సేసితి. అతఁడు నశించినను వాని పుత్రునిజేరి సోద్యముఁడ నైతి. అయి నను జతనము నెఱవేర దయ్యె. నందకులంబునకు శత్రువు దైవమెగాక యీవిప్రుఁడు గాఁడు.

రాక్షసుఁడు శత్రుహస్తగతుఁడై నాశము నైన నొందు గాని చంద్రగుప్తునితో సంధి చేసికొనునె? జనులు నన్ను సత్య సంధుఁడు కాఁ డన్నను మేలకాక శత్రువంచనకు లోఁబడియె ననుట సహింపనేర్తునే? అని చింతించుచుఁ బాటలిపుత్రప్రాంత వనంబునకుఁజేరి మందభాగ్యుఁడ నెటకుఁ బోవుదును? ఇం దొక చోట నుండి యెవ్వానిచే నైన చందదాసుని వృత్తాంత మరయుదునుగాక యని యెంచి యొకరాతిమీఁద గూర్చుండి యిట్లు చింతించెను.

పూర్వము బాలచంద్రునివోలె జనులవేళులచేఁ జూపం బడుచు రాజసహస్రంబులతోఁగూడి రాజువోలె పురంబు వెడ లునేన యిప్పుడు విఫలయత్నుండనై దొంగవోలె వెఱచి యీజీర్ణోద్యానమునం డాగవలసెగదా? అని చింతించుచుండ గొప్పశంఖధ్వానంబు వినంబడియె. రాక్షసుండాధ్వని యా లించియిది నులయ కేతునిబంధించినయుత్సవకార్యముగానుండు

సని యూహించి 'ఏఁ తత్కష్టము? దైవము శత్రుని సిరిని విని పించెను. అభినయించియుఁ గనఁబఱిచెను. మఱియు నాకు దానినిఁ బ్రత్యక్షముసేయ నెంచినట్లు దలంచెదనని చింతించు చుండెను.

విష్ణుగుప్తుండు చారులవలన రాక్షసుఁడు జీర్ణోద్యానము ప్రవేశించెనని యూకర్ణించి కర్తవ్యము బోధించి యటకు నొక పురుషు ననుప వాఁడు త్రాడొక్కటి చేఁబూని యువ్వనంబు సొచ్చి కొంచెము దూరమున నుండియె రాక్షసు నవలోకించి యతనిం జూడనియట్లు నటించుచు నొకచెట్టు గొమ్మకుఁద్రాడు గట్టి దానిం దనమెడకు నురివోసికొనుచుండెను.

రాక్షసుండు వానింజూచి 'అయ్యో! వీఁడెవఁడో ననం బలె దుఃఖగ్రస్తుఁడు గాఁబోలు? కానిమ్ము అడుగుదును గాక యని దగ్గఱకువచ్చి

రాక్ష—నీవు చేయున దేమి?

పురుషుఁడు—(కన్నీరువిడుచుచు) అయ్యా! ప్రియమిత్రవినాశ మున శోకగ్రస్తుఁడనై యిట్లు సేయుచుంటిని.

రాక్ష—(తనలో) వీఁడు ననుఁబోనివాఁడని ముందుగనె గ్రహించితిని. (ప్రకాశముగా) రహస్యముగానిచో శోకకారణము నాకు దెలుపుము.

పురు—అయ్యా! ఇది రహస్యముగాదు. గాని చెప్పదనుక మరణింప గాలహరణము సేయఁజాలను.

రాక్ష—(నిట్టూర్పు విడిచి తనలో) మిత్రవ్యసనమున నుదా
సీనుఁడనై యున్న నాకు నితఁడు గర్తవ్యమును బోధింప
వచ్చెనుగాఁబోలు? (ప్రకాశముగా) త్వరగాఁ జెప్పుము.

పురు— నిర్బంధించుచున్నారు. ఏమిసేయుదు? వినుడు. ఈనగ
రమున రత్నవర్తకుఁడు విష్ణుదాసుఁ డనియొకఁడు
కలఁడు.

రాక్ష—(తనలో) విష్ణుదాసు చందనదాసునకు మిత్రుఁడే.
(ప్రకాశముగా) వాని కేమి?

పురు—అతఁడు నాకుఁ బ్రియమిత్రుఁడు.

రాక్ష—(సంతోసమునఁదనలో)అయ్యో! ప్రియమిత్రు డనుచు
న్నాఁడు. మఱియు దగ్గఱసంబంధమే. అబ్బ! ఇఁకచం
దనదాసునివృత్తాంతము దెలియును. (ప్రకాశముగా)
వాని కేమి?

పురు—అతఁ డగ్నిలో నుఱుకనెంచి యూరు వెడలివచ్చెను.
మిత్రునిమరణవార్త వినకమున్న యుసురుల విడువఁ
బూని యీపాడడవిఁ జేరితి.

రాక్ష—అతఁ డట్లు సాహసింప నేమి కారణము?

పురు—ఆతనికిని మిత్రవ్యసనమే హేతువు.

రాక్ష—అదియెట్టిదో వివరముగా దెలుపుము.

పురుషు—ఈనగరమున మణికారశ్రేష్ఠి చందనదాసుఁ డని
వేఱొక్కఁడు గలఁడు.

రాక్ష—(దుఃఖమునఁ దనలో) దైవ మింకొక శోకద్వారము
దెఱచెను. డెందమా! నిలుకడ నొందుము. అతికష్ట

వార్త వినవలయు సుమీ? (ప్రకాశముగా) చందనదా
సుఁడు మిత్రవత్సలుఁడు వాని కేమి?

పురు—అతఁడు విష్ణుదాసునకుఁ బ్రియమిత్రుఁడు.

రాక్ష—(తనలో) మానసమునకు దుఃఖవజ్రపాతము సమీ
పించెను.

పురు—కావున చందనదాసునినిమిత్తమై విష్ణుదాసుఁడు మిత్ర
స్నేహమునకుఁ దగునట్లు జంద్రగుప్తునితో నిట్లు విన్న
వించెను.

రాక్ష—ఏమని?

పురు—దేవ! నాసర్వస్వమును దీసికొని చందనదాసును విడి
పింపు మని,

రాక్ష—(తనలో) విష్ణుదాస! మిత్రస్నేహము కనఁబఱచితివి.
ఏలన, కొడుకులు దండ్రులను తండ్రులు కొమరులను
శత్రువులంబలె నెద్దానికై హింసించుచుందురో అట్టిధ
నమును వర్తకుఁడ వయ్యునుమిత్రునికై దుర్వ్యసనముం
బలె విడువ నెంచితివి. గాన నీధనమె సార్థక మైనది.
(ప్రకాశముగా) దానికి మౌర్యుఁ డేమిబదులు సెప్పెను.

పురు—అయ్యా! ఏమి సెప్పెననిన

నేను ధనమునకై చందనదాసుని బంధించినవాఁడ
గాను. ఇతఁడు రాక్షసునిగృహజనమును దనయింట దాచియు
నిచికొని యెంత బ్రతిమాలినను మాయధీనము సేయఁడ
య్యెను. ఇప్పటికైనను నతఁడు రాక్షసునిగృహజనము నర్పించు
నేని విడిపింతును. లేనిచో బ్రాణములు దీయింతునని పలికి

చందనదాసుని వధ్యస్థానమునకు ననిపెను. చందనదాసుని మరణవార్త వినకమున్న జ్వలనంబునఁ బ్రవేశింప నెంచి విష్ణుదాసుఁడు పురంబు వెడలిపోయెను. నేనును నాప్రియమిత్రుఁడగు విష్ణుదాసుని మరణవార్త వినకమున్న యురివైచికొని యసువుల విడువనెంచి యిటకు వచ్చితిని.

రాక్ష—చందనదాసు నిప్పటికి వధింప లేదుగదా?

పురు—ఆతఁ డిప్పుడె వధింపఁబడును. ఇప్పటికిని రాక్షసునిగృహజనము నర్పింపుమని కోరుచున్నను నతఁడుమిత్రవత్సలుఁ డగుటంజేసి యప్పని నంగీకరింప డయ్యెను. ఈకారణమున నే నిఁకఁగాలహరణము సేయఁజాలను.

రాక్ష—(తనలో) మిత్రమా! చందనదాసా! ఎంతపని సేసితివి?

శరణాగతరక్షణమున నీవు శిబి దగుకీర్తి నార్జించితివి. అతఁడు శరణాగతునెదుట దనశరీరము నర్పించెను. నీవైననో పరోక్షముననె యర్పించుచున్నాఁడవుకాన నతనికంటెను నధికుఁడవు.

(ప్రకాశముగా) భద్రుఁడా! నీవు వేగిరమున బోయి విష్ణుదాసుఁడు జ్వలనమునఁ బడకుండ వారింపుము. ఏను పోయి చందనదాసుని విడిపింతును.

పురు—నీ వేవిధమునఁ జందనదాసును మృత్యుముఖమునుండి విడిపింతువు?

రాక్ష—(వఱనుండికత్తి వెలికి) ఈఖడ్గముతో విడిపింతును.

పురు—అయ్యా! మీ రమాత్యరాక్షసులవారు కావలయు? మిత్రవ్యసనముచే మిమ్ము గుర్తింపఁ జాలనైతి. అని పాదములఁ మీఁద బడియెను.

రాక్ష—లెమ్ము. లెమ్ము. ఇపుడు కాలహరణము సేయరాదు.

పురు—అటులేని ననుగ్రహించి నామాట యొకటి యాలింపుడు.

రాక్ష—ప్రభునాశము ననుభవించుచుఁగాక యుండక మిత్రుల విపత్తికిఁ గారణుఁడనై యనార్యుఁడ నగునేను యథార్థముగ రాక్షసుఁడనే.

పురు—దైవవశమునఁ గనంబడితిరి. ఈమాట యవధానముతో వినుఁడు. ఇచట మొదట శకటదాసుఁడు వధ్యస్థానమునకుఁ గొనిపోఁబడినపుడు వాని నెవ్వఁడో ఘాతకుల బాఱినుండి తొలఁగించెను. అంత చంద్రగుప్తహతకుఁడు "ఎవఁడు చేసెను? ఎట్లు సేసెనని మండిపడి ఘాతకులఁ జంపించి తనక్రోధాగ్ని శాంతిపఱచుకొనియెను. అదిమొదలుకొని ముందుగాని వెనుకగాని యాయుధహస్తుఁడు కనఁబడునెడ తమచావు దప్పించుకొనఁ నెంచి ఘాతకులు వధ్యులను ముందుగనె వధించుచున్నారు. గాన మీరు కృపాణపాణులై యటకుఁ బోవుదురేనిఁ జందనదాసుని ముందుగనే చంపించినవా రగుదురు.

అని చెప్పి వాఁడు వెడలిపోయెను.

అంత రాక్షసుఁడు తనలో నిట్లు వితర్కించెను. "ఛీ! మిత్రాంశంబున ఘాతకులఁ జంపఁబూనుదునా? నన్నుఁ జూచినంతనే వారు ముందుగఁ జందనదాసుని ఖండింతురుగాన నిది యుక్తము కాదు. నీతి నుపయోగింపఁ జూతునా? ఎదుట క్రూరసర్పము నిద్దురవేళ దేశంబున దండము, సన నట్టు లిప్పు డుపయోగింపఁదగదు. ఉపేక్షింతునా? కృతఘ్నుండ నగుదునుగాన చందనదాసునకు బదులు నాశరీరము నర్పించి మిత్రుని గాతునని నిశ్చయించి వధ్యస్థానమునకు నరిగెను.

అట చండాలురు "జనులారా! త్రోవవిడువుఁడు. ప్రాణములను విభవమును కులమును గళత్రమును గాపాడికొనఁ దలంతురేని ఱేనికి నహితము నాచరింపకుఁడు. జనులు పథ్యమును సేవించునెడ వ్యాధియో మరణమో కలిగెడిని. రాజాపథ్యము సేసెనా! వానికుల మంతయు నంతమొందును. మామాట నమ్మరేని పుత్రకళత్రంబులతోడ వధ్యస్థానమునకుఁ జేర్పంబడు చందనదాసుం జూడుఁడు." అనిపలుకుచుండఁ జందనదాసుండు వధ్యవేషంబు దాల్చి శూలము భుజమున నిడుకొని పత్నియుం బుత్రుండును వెంబడింపఁ బోవుచు "హా! ఏంతకష్టము? నడతలో నేమిలోపము వాటిలునో యని వెఱచుచు మముబోంట్లకును చోరజనోచితం బగుమరణంబు నొసఁగు శమనునకు నమస్కృతి సేసెద. అటుగాక, క్రూరులకు నుదాసీనులయందును నితరులయందును భేదంబు గనంబడదు. మాంసాహారంబు విడిచి యడవులలో దృణంబులచే జీవించు లేళ్ళను గూడ వారు వధించుచుందురుగదా? ప్రియమిత్రమా! విష్ణు

దాసుఁడా! బహులుమాటలైనఁ జెప్పవేల? నామిత్రులు గన్నీరు విడిచి తర్పణంబు సేసినట్లు యెట్లో వెనుకకు మరలుచు శోకంబున దీనవదనులై గన్నీరు నిండినగన్నులతో నన్ను గాంచుచున్నారు.

చండాలు—అయ్యో! చందనదాసుఁడా! వధ్యస్థానము సేరితివి. పరిజనము నంపివేయుము.

చందన—సతీతిలకమా! ఇఁక నుండఁగూడదు. నీవిపుడు కొడుకుతో నింటికిఁజనుము.

కుటుంబిని—నాథా! మీరు పరలోకమునకుఁ బయనమైతిరి. గాని దేశాంతరమునకు గాదుగదా?

చందన—గుణవతీ! నేను మిత్రకార్యమున వినాశ మొందుచున్నాఁడగాని పురుషదోషమునగాదు. ఇఁక దుఃఖపడనేల?

కుటుంబిని—అట్లైన నిది కులాంగనకు మిమ్ము విడిచిపోవఁదగు సమయము గాదు.

చందన—నీనిశ్చయ మేమి?

కుటుంబి—మీపాదముల ననుసరించివచ్చినచే నాజన్మము కడ తేఱునని

చందన—నీయుద్యమము మంచిదిగాదు. ఏలందువేని? నీచిన్నవాఁడు లోకవ్యవహారము నెఱుంగఁడు.వీని ననుగ్రహింపుము.

కుటుంబిని—వీనిని దేవతలనుగ్రహింతురుగాక. కొడుకా! తండ్రిగారిపాదములు నీకిఁక దొరకనేరవు. వానికిఁ బ్రణామముగావింపుము.

పుత్త్రుఁడు—(పాదములమీఁదఁ బడి) నాన్నగారూ! మిమ్ము వదలిపెట్టి యేనేమి సేయుదు?

చందన—పుత్రా! నీవు చాణక్యుఁడులేని దేశమున నుండుము.

చండాలు—చందనదాస! శూలము పాతితిమి సిద్ధముగా నుండుము.

కుటుంబిని—అయ్యలారా! రక్షింపుఁడు. రక్షింపుఁడు

చందన—కుటుంబినీ! ఏడువకుము. ఈనీచులను బ్రార్థింపనేల? దేవతలను శరణువేడుము

చండాలు—అరే! బిల్వపత్త్రుఁడా! చందనదాసుని బట్టుకొనుము వీనిపరిజనులు తమయంతనే పోవుదురు

ద్వితీయచండాలు—అరే! వజ్రలోముఁడా! ఇదిగో పట్టుకొంటిని

కుటుంబిని—అయ్యా! రక్షింపుము రక్షింపుము.

అపుడంతలో రాక్షసుఁడు వచ్చి

రాక్ష—భవతీ! భయపడకుముచండాలులారా! చందనదాసును విడువుఁడు.

ఏనేను నశించుచున్న స్వామికులమును శత్రుకులమును బలెజూచి యూరకుంటినో, మిత్రవ్యసనములయందు మహోత్సవములయందువోలె స్వస్థచిత్తుఁడనై యుంటినో, అవమానపాత్రమైనయేనాతనువు పెక్కురవధకుగారణ మయ్యెనో, అట్టి నామెడయందు మృత్యులోకమార్గ మగువధ్యమాలిక నునుచుడు

చందన—(కన్నీరు గార్చుచు జూచి) అమాత్య! ఏమిది?

రాక్ష—ఇది నీసుచరిత్రమున నేకాంశము నేని బోలునా?

చందన—నాపడినప్రయాస యంతయు విఫలము సేసితివి.

రాక్ష—సఖుఁడా! నాపనియె నేను చేసితిని. భద్రముఖుఁడా! చాణక్యునకు జెప్పుము.

వజ్రలోముఁడు— ఏమని?

రాక్ష—తొల్లిపుణ్యమగుకృతయుగమున శిబిచక్రవర్తి చేసినది చిత్రముగాదు. ఇపుడు పాపబహుళమగుకలియుగమున నిట్టిపనిచేసిన చందనదాసుఁడు నీకుఁ బూజనీయుండైనను నీయనఘుని నాకై యిట్టిదశ నొందించితివిగాన నేను నీకు విధేయుడనైతి నని చెప్పుము.

నావుడు వాఁడు వోయి చాణక్యునకు జెప్పగా విని

చాణక్యుఁడు—జాజ్వల్యమానుఁడగు వీతిహోత్రుని వస్త్రాంతమున నెవఁడు గట్టెను? గాలిని త్రాళ్లతో నెవఁడు బంధించెను? సింహమును బంజరమున నెవఁ డుంచెను? భయంకర మగు సాగరమును చేతితో నీది యెవఁడు దాటెను?

అనుచు వచ్చి రాక్షసుం గాంచెను.

రాక్షసుఁడు చాణక్యు నుద్దేశించి (తనలో) ఇతఁడు మహాత్ముఁడా! లేక మహాత్ముఁడా! రత్నములకు సాగరునిమాడ్కి సకలశాస్త్రములకు గనియైనవాఁడు. అయినను నీతనియందు మచ్చర ముంటచే గుణములకు మెచ్చము. అనియెంచుచుండ చాణక్యుండు వచ్చి రాక్షసునిం గాంచి

చాణక్య—(తనలో) ఈమహాత్మునికై దీర్ఘజాగరముంగలి
గించుగొప్పకల్పనలచే నాబుద్ధియు వృషలునిసేనయు
నెంతో పరిశ్రాంతి వహించెగదా? (ప్రకాశముగా)
అమాత్యరాక్షసా! ఏను విష్ణుగుప్తుఁడను. అభివాదనము
సేయుచున్నాఁడ

రాక్ష — (తనలో) నన్నిపు డమాత్యుఁ డనుట లజ్జాకరము.
(ప్రకాశముగా) విష్ణుగుప్త! నేనుచండాలుర నంటితి.
గాన నీవు నన్నంటకుము.

చాణ—అమాత్యరాక్షస! వీరు చండాలురు గారు. వీఁడుసిద్ధా
ర్థకుఁడు. వాఁడుసమిద్ధార్థకుఁడు. ఈయిద్దఱు రాజపురు
షులే. శకటదాసేమియు నెఱుంగఁడు. నేన వానిచేఁ
గపటలేఖ వ్రాయించితిని. అదిగాక యేన యలంకారత్ర
మంపితిని. ఏన జీవసిద్ధిచే నట్లు పలికించితిని. ఏనజీర్ణో
ద్యానమునకుఁ బురుషునంపితిని. ఏనచందనదాసు నింత
శ్రమ పెట్టితిని. ఇదియంతయునీతో జంద్రగుప్తునకు సం
ధానము సేయఁబూని యేన యాచరించితి.

నావిని రాక్షసుఁ డేమిసేయుదునని యోజించునం
తలో చంద్రగుప్తుఁడు పరివారముతో వచ్చి చాణక్యునకుఁ
బ్రణమిల్లెను

అంత విష్ణుగుప్తుండు మౌర్యునవలోకించి పూజ్యుం
డగునమాత్యరాక్షసునకు నభివందనము సేయుమనియె

రాక్ష—(తనలో) ఇతఁడు మా కిద్దఱకు ముడిపెట్టుచున్నాడు

చంద్రగుప్తుఁడు—ఆర్యా? నేను చంద్రగుప్తుఁడను. వందనము సేయుచున్నాఁడను,

రాక్ష—రాజా! విజయ మొందుము

చంద్ర—ఆర్యా! మీయిర్వురు గాపాడుచుండ జగమున నేను జయింపని దేమి గలదు?

రాక్ష—(తనలో) చంద్రగుప్తుఁడు నన్ను వశము సేసికొనుచు న్నాఁడు. ఈతని కీవినయము సహజమే. అయినను మచ్చరము విపరీతభావమును దోపించెడిని. చాణ క్యుఁడన్నివిధములఁ గీర్తి నందుఁడు. ఏలన, రాజుగు

ణవంతుఁ డైనచో నమాత్యుఁడు మందమతియైనను గీర్తి నొందును. రాజు గుణహీనుఁడైనచో మంత్రినీతవిదుఁ డైననునేటిదరి నున్నవృక్షంబువోలె నిరాశ్రయుండై పడిపో వును.

చాణక్యుఁడు—అమాత్యరాక్షసా! చందనదాసుఁడు జీవించుట నీకిష్టమే యగునా?

రాక్ష—విష్ణుగుప్త! సంశయ మేమి?

చాణ—అట్లేని చంద్రగుప్తునిసచివపదవి నంగీకరించి శస్త్రము గ్రహింపుము

రాక్ష—విష్ణుగుప్త! ఇట్లు వచింపకుము, మొదల మేము తగము నీవు పరిగ్రహించిన వానియొద్ద బొత్తుగ నుపయోగిం పము

చాణ — యోగ్యాయోగ్యవిచారము విడువుము. నీభయం
బున నెల్లపుడు సమరసన్నాహమున నుండవలసివచ్చు
టంజేసి నిద్రాహారంబు లెఱుంగక కృశించినచతురంగ
బలంబుం జూడుము. పలుమాట లేల? నీవు మంత్రిప
దవి నంగీకరింపనిచో చందనదాసుఁడు జీవించుట కల్ల.

రాక్ష — (తనలో)

గర్భపతనంబు మొదలు తైలద్రోణులలో నునిచి యేను వెనుపఁ బెఱిఁగిననందకుమారు లందఱు నంతమొందిరి. వారి యెడ స్నేహంబుగలిగియు మిత్రరక్షణంబునకై వారివైరికి భృత్యత్వము గావింపవలసె. కార్యగతి విధికిని దాస్యత నొడ గూర్చుగదా? (ప్రకాశముగా)

విష్ణుగుప్త! సర్వకార్యనిశ్చయములకు గారణమైనమిత్ర స్నేహమునకు నమస్కారము నమ్రుఁడనైతిని

చాణ — (హర్షముతో) వృషలుఁడా! నీ వమాత్యరాక్షసు
నిచే ననుగ్రహింపఁబడితివి,

రాజు — మీయనుగ్రహము ననుభవించుచున్నాఁడను. అను
చుండ నొకపురుషుఁడు వచ్చి జయము జయము. మల
యకేతుఁడు బంధింపఁబడి రాజద్వారమునకు గొని
రాఁబడియెను. నావుడు,

చాణ — భద్ర! రాక్షసునకు దెలుపుము. కర్తవ్య మాతం
డెఱుఁగును.

రాక్ష — (తనలో) చాణక్యుఁడు నన్ను దాసునిగాఁజేసి వాగిం
పఁబూనెను. ఏమి సేయుదును? (ప్రకాశముగా) రాజా!

నీకంతయు దెలియును. మలయకేతు నొద్ద నేను గొంత కాలము వసించితి. కాన వీని ప్రాణములు రక్షింపుము. నావిని చంద్రగుప్తుడు చాణక్యునివంక జూచెను.

చాణ—రాక్షసుని కోర్కె దృపదగును. అరే! రాక్షసుండు విన్నవింప చంద్రగుప్తు డనుగ్రహించి మలయకేతునకు దన తండ్రిదగు రాజ్యము నొసంగెను. గాన వారల విడిచి పుచ్చుమని యేంజెప్పితినని చెప్పుము. ఇం కొక మాట దుర్గపాలునకుం జెప్పుము. అమాత్యరాక్షసుండు లభించుటచే చంద్రగుప్తుడు సంతసించి చందనదాసుని సర్వనగరములలోని శ్రేష్ఠులలో పెద్దశ్రేష్ఠిని గావించెను. అతని ద్రవిణము నంతను దిరుగ నిచ్చివేయుమని యానతిచ్చెను. అమాత్యరాక్షసుండు చెప్పినట్లు సేయుడు. ఇంక నాకు గావలసిన దేమి? నాప్రతిజ్ఞ నెగ్గెను గాన సిగముడి వేయుచున్నాడను. రాజా! నీ కేమిగావలయును.

రాజు—ఇంతకన్నం బ్రియమేమి కలదు? రాక్షసునితో మైత్రి కలిగించితిరిగాన రాజ్యము సుస్థిరముగ నిల్పితిరి. నందుల నందఱ నిర్మూలించితిరి.

రాక్ష—ఈభూమి తొల్లి ప్రళయోపద్రవము నొంది యాది వరాహమూర్తి దగు దంష్ట్రినాశ్రయించెను. ఇప్పుడు మ్లేచ్ఛులవలన భీతినొంది రాజరూపుదాల్చిన యద్దేవు భుజయుగమున నిల్చెను. చంద్రగుప్తుడు చిరకాలము

పుడమిఁ బాలించుగాక, యని రాక్షసుఁడు చంద్రగుప్తునకు నమాత్యుఁడై రాజ్యతంత్రము నిర్వహించుచుండెను.

చాణక్యుఁడు బుద్ధిబలంబున నవనందుల నంతమొందించుటయకాక యిట్లు నందరాజమంత్రియగు రాక్షసుని నిగ్రహించి వశపఱచుకొని చంద్రగుప్త మంత్రిపదవి నంగీకరింపఁజేసి చంద్రగుప్తరాజ్యమును సుప్రతిష్ఠితము సేసెను. నాటంగోలె చాణక్యుఁడు జగద్విఖ్యాతి గాంచెను.

శి వ ము.

శ్రీ

శివాభ్యాంనమః

యుగంధరుఁడు.

ప్రథమప్రకరణము.

ప్రతాపరుద్రగ్రహణము.

శ్రీసన్నివేశ మగునాంధ్రదేశమునకుఁ దొల్లి యేకశిలా (వరంగల్)నగరము రాజధానిగా నుండెను ఆపత్తనము సకల కలావిదు లగుబుధజనులకు నిలయమై త్రిదశాలయమును దలపించుచుండెను. ఆపురవరము సకలవర్ణపరిపూర్ణమగుట నెల్ల జనులచిత్తంబులకుఁ జిత్రవిభ్రాంతి నొసఁగుచుండెను. ఆపట్టణంబుగోటలు నేటికినిఁ జూపరులకు నచ్చెరువు గలిగించుచుండ నాటిసౌభాగ్యంబు నేమని వర్ణింపనగును? కాకతిరాజవంశమౌక్తికాయమానుం డగుశ్రీవీరప్రతాపరుద్రనరపతి యానగరంబు రాజధానిగా నాంధ్రరాష్ట్రమును బాలించుచుండెను. ఆ జనపాలు నన్వర్థనామము వినఁబడగనె వైరినృపాలురకు సంతాపంబు దుర్భరం బగుచుండెను.

వరంగల్నగరపరిసరంబున నిప్పుడును గడునొప్పిదము గలిగి యలరారుచున్న వేలకొలఁది సహస్రస్తంభమండితంబు లగుమండపరాజంబులును దేవాయతనంబులును నానరనాథుని దేవభక్తిని వేనోళ్ల వెల్లడించుచున్నవి. ఆరాజమార్తాండుని తేజంబునకు వెఱచి కాటకంబు తిమిరంబు విదేశంబులకును నధర్మ

ఘూర్ణంబులు యవనభూములకును బఱచెను. ఆకృష్ణమాధవుండు నరరూపుదాల్చినప్రత్యక్షమాధవుండె యనియెంచి శ్రీదేవి యాతనియెడఁబాటున కోపదయ్యెను.

ఆభూజానిసన్నిధి శివదేవుఁడు యుగంధరుఁడు మున్నగువారు మంత్రులుగా నుండిరి. వీరిలో శివదేవుఁ డనారతశివభావనాపరుఁడు అందఱురాజనీతివిశారదు లైనను యుగంధరుఁడప్రతిమప్రతిభాశాలియగుటంజేసి ప్రధానామాత్యుఁడుగా నుండెను. ఈమంత్రిపుంగవునిమంత్రశక్తి యనుఝంఝూమారుతంబు సాహాయ్యంబున శ్రీప్రతాపరుద్రదేవునిప్రతాపానలంబు శత్రుపక్షకాననంబుల భస్మీకరించుచుండెను. ఆభూనాథుండు యుగంధరోపదిష్టనీతిమార్గంబున నిష్కంటకంబుగ రాజ్యంబు పాలించుచుండ నాంధ్రభూజనులు సకలసుఖంబులకు భాజనులై యీతిబాధలన నెట్టివో యెఱుంగరైరి

ఆకాలమున ఢిల్లీపురమును పాలించుచున్న గయాజుద్దీన్ టొఘ్లక్ సుల్తాను ప్రతాపరుద్రుని జయించి యాతనివలన గప్పంబుగొనదలంచి పెక్కుమారు లపరిమితతురుష్కబలంబుల నేకశిలానగరంబు ముట్టడింప నంపియు నాబలంబంతయు వీరరుద్రునిప్రతాపాగ్నియందు శలభపటలంబుపోల్కి నశించిన వార్త లాలించి తనచిత్తంబు శోకాయత్తంబు గావించుకొని యుండెను.

వైరిభయంబులేమింజేసి యేకశిలాధీశుండు రాజ్యభారంబు మంత్రులయందునిచి యొకప్పుడు ధర్మవ్రతపరుం డగుచును వేరొకప్పుడు గామోపభోగరసికుం డగుచును ఇంకొక

ప్పుడు పండితకవిగోష్ఠీపరినిష్ఠుఁ డగుచును మఱియొకప్పుడు మృగయావినోది యగుచును వర్తించుచుండెను. అట్లుండ నొకయదనున యుగంధరుండు దక్షిణపుణ్యక్షేత్రదిదృక్షాయత్తచిత్తుండై వెడలిపోయెను

ఢిల్లీపురాధీశుండు పలుమాఱు కాకతీయనరపాలునివలన నపజయంబు నొందియుండుటంజేసి సమయంబువేచుచుండి వేగులవారివలన యుగంధరుండు రామేశ్వరయాత్ర కరిగెనని విని ప్రతాపరుద్రుని జయింప నిది మంచియదనని యూహించి యపరిమితసేనానివహంబు నొసఁగి కొందఱు దండనాథుల నేకశిలాపురి కనిచెను.

యవనసేనాపతులు వరంగల్‌నగరసమీపప్రదేశంబు సేరి ప్రతాపరుద్రనరపతి తఱచుగ మృగయావినోదంబున నుండునని వినియున్నవా రగుటంజేసి యడవులయం దెటనేని నీ భూమీశుండు దొరకునో యనునాశచేఁ జారుల నచ్చటచ్చట వెదుక నంపిరి.

అప్పు డేకశిలాధీశుండు పాకాలచెఱువు జుట్టుకొని యున్నమహారణ్యంబు క్రూరమృగశరణ్యం బగుట నాటవికసేనలంగూడి యాటకు వేటకుఁ జనియుండెను. రాజన్యుం డందుండెనని చారులవలన విని యవనసేనాపతు లచ్చేరువఁ జేరి సమయము సూచుచుండిరి. ఆంధ్రమహీశుండు మృగయావ్యాపారవశ్యంబున శార్దూలంబుల మర్దించియు వనకుంజరంబుల భంజించియు నెమళులం బట్టియుఁ జమరులం గొట్టియు నభిమతక్రీడల విహారించి పరిశ్రాంతుండై యచ్చేరువం గలచెఱువుదరి సేరి

యందలిజలయంత్రగోలి గట్టునఁ బరిచరులు పఱచినతలిరుసెజ్జ పైవిశ్రమించి యధికంబుగఁ బరిశ్రాంతి నొందుటనో దైవయోగంబుననో నిద్రానిమీలితలోచనుం డయ్యెను. రాజునొద్ద నిరుముగ్గురు నిజభటులుంటచే నాటవికులు దమతమనెలవులకుం జనిరి. అయ్యది దగుసమయమని గ్రహించి తురుష్కదండనాథు లానరనాథుని బంధించి వశపఱచుకొని పయనంబు సాగించిరి. అట్లు వారు దన్ను బంధింపగనే మేల్కని యాంధ్రభూమీశుండిట్లని చింతించెను.

ఆహా! ఏ నెంతతుచ్ఛంపుపని సేసితి. వేట దుర్వ్యసనం బనియెఱింగియు నిందుదవిలి మోసపోయితి. ఇపుడు నాకు దిక్కెవ్వఁడు? మహామంత్రియుగంధరుండును నగరంబుననైన లేడు. ఏను దీర్థంబుల సేవించి నగరంబు సేరుదనుకనైనవేట మాని యుండుమని యామహాభాగుఁడు చెప్పినయుపదేశంబు బెడచెవినిఁ బెట్టినయీవెడగునకు నిడుమ లెట్లు రాకుండును? స్వయంకృతంబు లగునపరాధంబులకు వానిఫలం బనుభవించుటకన్న వేఱొండుప్రతీకారంబు లేదుగాన నాకీయాపద శోకదంబు గాదు. కాని దుర్వ్యసనాసక్తుండ నగునాకతన దేశమెల్ల మలకలపాలై యిక్కట్టులకు గుఱియౌనో యని నాడెందంబు తల్లడిల్లుచున్నది. అకారణవత్సలుం డగుపరమేశ్వరుండు దుష్కర్మరతుండ నగునన్ను దురుష్కులవశంబు సేసినను మదీయదేశంబు దద్వశంబు గాకుండ రక్షించుగాత అని పరితపించుచుండెను.

ద్వితీయప్రకరణము.

యౌగంధరప్రతిజ్ఞ

విద్యానాథుం డనునొకకవినాథుండు ప్రతాపరుద్రీయ మనునొకయలంకారగ్రంథము రచించి ప్రతాపరుద్రుని దర్శించుకుతుకంబున నేకశిలానగరంబునకు వచ్చి భూకాంతుండు మృగయావినోదియై యడవులలో నున్నాఁడని జనులవలన విని విపినంబునకేగి యందందు నెమకి తేఁడు యవనచమూపతులచేఁ బట్టుకొనిపోఁబడియెనని యాటవికులు దెలుప మలకదండు వెంబడి బడి యేగుచు సేనాపతులు నౌకారోహణంబుసేసి గోదావరి దాటుచుండ నిందు భూనాథుం డుండునని యోజించి యానది నీదుచు నయ్యోడదాపునకుఁ బోయి మొసళ్లులు బట్టవచ్చె ననుంగావుడని నావికులం బ్రార్థించెను. అప్పు డందున్నసర్దారు లీ జనుని నావలోనికి నందుకొనుఁడని యనుమతింప నావికు లాభూసురునకు నొకవేణుదండము నందిచ్చిరి. కవీంద్రుం డద్దానిం బట్టికొని యందుఁ జేర నందున్నవారు నీవెవ్వండవు? ఏటిలో నేలపడితివి? అని యడుగ నాయనఘుం డిట్లనియె.

అయ్యా! ఏనొక బీదపాఱుఁడను. నాభార్యకు సన్నిపాతవ్యాధి సంభవించుటచే వైద్యునికై యేటిగట్టున నున్న నొకగ్రామంబు వోయి యట మందు గైకొని వచ్చునంతకు నిందు పడవ యేదియు లభింపదయ్యెను. ఆలసించినచో నేమి యాపద మూడునో యని యీది పోనెంచి యేటఁబడితిని.

మొసళులు వెనుదవ్వులుటంజేసి వానిబారినుండి తప్పించుకొనఁ నేరక యాక్రోశించి మీయనుగ్రహంబున నిందు జేరితి. శీఘ్ర జ్వరబాధచే వడకుచున్నాఁడ నని తెలుప నందున్న సేనాపతులు నావలోపలి కేగి యందుఁ బండుకొమ్మని పలికిరి.

ఆవిద్వత్కంఠీరవుండు లోని కేగునంత మహారాజ చ్చటనే యుండెను. ఆయనమహాపురుషలక్షణంబుల దిలకించి యీయనఘుఁడే కాకతిప్రభువుగా నుండునని యోజించి తడసియున్న తాళపత్రగ్రంథమును దుడువ నారంభింప నప్పుడు వారిద్దఱకు సంభాషణ మిట్లు జరిగెను.

ప్రతాప—అయ్యా! ఈగ్రంథము పేరేమి?

విద్యానాథుఁడు—ప్రతాపరుద్రీయ మనునలంకారశాస్త్రము.

ప్రతా—దీని కీపే రేల వచ్చెను.

విద్యా—దీని నారాజునకు నంకిత మొనర్చితిని.

ప్రతా—సమ్మానము జరిగెనా?

విద్యా—దర్శనమే లభింపదయ్యెను.

ప్రతా—ఏమికారణము?

విద్యా—రాజుగారు నగరములో లేరట!

ప్రతా—అట్లైన నీగ్రంథమును వేరొకని కేల యంకితము సేయఁగూడదు?

విద్యా—అట్టియవకాశము లేదు.

ప్రతా—కారణమేమి?

విద్యా—గ్రంథమునం దంతటను నాతనిపేరె తగులఁబెట్టితి
గదా?

అని వచింప నాగ్రంథమునఁ బ్రతిశ్లోకమునను దనపేరు
నేర్చెననియు నద్దానవే వేరొకని కంకితముసేయ నవకాశము
లేదనియు గ్రహించి యట్టిమహాకవికిఁ దగుసమ్మానము గావిం
చు భాగ్యము లేమికి జింతించి యాయునవలన గొన్నిపద్యముల
వినియానందమొంది యాకవీంద్రునకుఁదనముద్రాంగుళీయకము
నొసఁగెను. కవివరుం డాయంగుళీయము గ్రహించి యందున్న
నామాంకము గాంచి సంతసించి యచిరకాలమున బంధవి
ముక్త నొందుదువని దీవించి తేనిచే ననుమతుండై యోడ
మీఁది కరుదెంచి మందు నీటిలోఁ బడిపోయెనని మిషపన్ని యేట
మమికి యొడ్డుసేరి యేకశిలాపురి కరుదెంచెను. యవనసేనా
నులు ఢిల్లీ నగరముసేరి ప్రతాపరుద్రునిఁ జెఱలో నునిచిరి.

అట యుగంధరుండు ఢిల్లీశ్వరునిదురుద్యమంబు తెలియ
గనే మరలి యేకశిలాపురము బ్రవేశించి యేకాంతంబున మం
త్రులతో నాలోచించుచుండ విద్యానాథుండు తనరాక దెలిపి
ముద్రాంగుళీయము నిచ్చెను. అప్పు డామంత్రివరుండు కవినా
థుని సాహసంబున కెంతయు సంతసించి, యవనులు తేనిం
గొనిపోయిరనువార్త వెల్లడింపకుడని చెప్పి భూనాథుండు సిరి
పురమున నొకగేస్తునింట వ్యాధిగ్రస్తుఁడై యున్నట్లు లేఖం
బెప్పించి యొకరజకునకు రాజవేషము దాల్పించి యవ్వాని
నటనుండి రప్పించి భూకాంతుండు ఘోరమృగఘాతంబుల
నస్వస్థగాత్రుండుగాన గొన్నాళ్ళదనుక తేనిదర్శన మన్యులకు

లభింపదనియు, మ్లేచ్ఛసేనాపతులు రాజవేషధారి యగు రజకుని జూచి రాజనిభ్రమించి ఢిల్లీకి గొంపోయి రనియు, బ్రకటించి యేకాంతంబున నిట్లు ప్రతిన సేసెను.

ఆఱునెలలలోపలఁ బ్రతాపరుద్రునిఁ జెఱ విడిపించుటయెగాక ఢిల్లీ సుల్తానును జెఱగొని రాజాలనేని నేను యుగంధరుఁడనుగాను. అని ప్రతిజ్ఞసేసి తగువారి నన్యకృత్యముల యందు నియోగించి తగువారితోఁగూడి తాను ఢిల్లీనగరము నకు నరిగెను.

తృతీయ ప్రకరణము.

ప్రతాపరుద్ర మోక్షము.

అంత యుగంధరుం డున్మత్తవేషమున ఢిల్లీపుర వీధుల యందు దిరుగ నారంభించెను. మొలను గోచియు, బుజమున గొంగడి చింపియుఁదాల్చి యొకతాటియాకులాగుచు

'ఢిల్లీసుల్తాన్ పట్టుకపోతాఁ
మూడేనెల్లాకు పట్టుకపోతాఁ'

అని కేకలువేయుచు నతఁడు వీధులలోన దిరుగుచుండ నీవృత్తాంతము సుల్తాను విని యుద్ధభటులను బిల్చి వీఁడు నిజముగా వెఱ్ఱివాఁడో, లేక కపటవేషధారియో, బాగుగా నరయుడని యానతిచ్చియనిచెను. దానంజేసి వార లాయన వెంబడి దిరుగుచుండిరి.

మంత్రియుగంధరుని మిత్రులు కొందఱు ఢిల్లీనగరము ప్రవేశించి కొన్నిజనాపవాదములు గలిగించిరి. యవనసైనికు లడవులలోఁ బ్రతాపరుద్రుని వెదకుచున్నారని తెలిసికొని యాంధ్రమంత్రులొక రజకునకు రాజవేషమునిచ్చి యడవికిఁ బనుపగా నామర్మము దెలిసికొనఁజాలక వీరు రజకుని గొని వచ్చిరని వెల్లడించిరి. మఱియును సుల్తానునకు సేనానులకును, సేనాపతులలో నొకళ్లొకళ్లకును బరస్పరద్వేషకరము లగు నైతిహ్యములు గల్పించిరి. దానంజేసి తురుష్కరాజ్యాంగము మేడిపండు దగు మేలిమిం బోలియుండెను.

అంత కొన్నిదినంబులకు ఢిల్లీనగరపరిసరంబున నున్న యమునరేవునకు నొకయోడవచ్చెను. దానినుండి కొందఱు రత్నవర్తకులు వచ్చి నజరుల నర్పించి సుల్తానుం దర్శింప నపుడు వారికిట్లు సంభాషణము జరిగెను.

సుల్తాను— మీది యేదేశము?

వర్తకులు—మాది గోవాదేశము.

సుల్తాను—మీవ్యాపార మేమి?

వర్త—మాది రత్నములవ్యాపారము.

సుల్తాను—మీరు మావద్ద కెన్నడును వచ్చినవారు కారు. ఇప్పు డేలవచ్చితిరి.

వర్త—మే మిదివరకు వరంగల్ ప్రతాపరుద్రమహారాజువారి యొద్ద కేగి రత్నములను వారికి విక్రయించుచుంటిమి. ఇప్పుడు వారు చనిపోయినందున నిటకు వచ్చితిమి.

సుల్తా—(సేనాపతినిజూచి) వలీఖాఁ! పి రిట్లు పలుకుచున్నా రేమి?

వలీఖాఁ—రాజును మనము బట్టుకొనివచ్చినకతన వారికస బడమిచే నాదేశమున నట్లు వాడుక గలిగియుండనగు

సుల్తా—(వర్తకులనుజూచి) రాజు లేకున్న యుగంధరుఁడులేడా?

వర్త—ఆయన రామేశ్వరముననె మృతినొందెనట!

సుల్తా—మీరత్నము లేవి?

వర్త—ఇవిగో మహారత్నములు,

సుల్తా—(వానినిఁ జూచి మెచ్చుకొని) వీనిలో నొక్కదానివెల చెప్పుము.

వర్త—వీనివెలలను మేము చెప్పునాచారము లేదు,

సుల్తా—ఇఁక నెట్లు?

వర్త—రాజసన్నిధిలో దెలిసినవార లేర్పరచినధరలనే మే మంగీకరింతుము.

సుల్తా—మీరు వరంగల్ పోయినప్పు డచ్చట వీనివెలల నెవ్వరు నిర్ణయించుచుండిరి?

వర్త—ప్రతాపరుద్రమహారాజుగారు స్వయముగా నిర్ణయింతురు.

సుల్తా—వీనివెలలు వారికిఁ దెలియునా?

వర్త—వారికన్న దెలిసినవార లీలోకముననె లేరు.

అని పలుకగా విని రహస్యముగా

సుల్తా—వలీఖాన్? ప్రతాపరుద్రుని నిటకు గొనిరమ్ము.

వలీఖా—మహాప్రభూ! మనయందు క్రోధముచే నతఁడు వెల లధికముగా నిర్ణయించునేమో?

సుల్తా—రత్నములకుఁ దక్కువవెలలు వేయుదువేని వరంగల్ కోటకు నిన్ను శీఘ్రముగా ననుపుదు మని యాశ నెట్టి షరాబువేషము వేయించి యిటకు గొనిరమ్ము.

నావుడు వాఁడు వోయి ప్రతాపరుద్రుని సుల్తానుసన్నిధికిఁ జేర్చెను.

సుల్తా—రాజా! ఇట కూర్చుండుము. ఈవర్తకులు రత్నములను గొనివచ్చిరి. వీనివెలలు తీర్మానింపుము.

ప్రతాపరుద్రుఁడు—(ఆరత్నములను గాంచి యయ్యవి తన భాండాగారములోనివే యని గ్రహించి) ఈరత్న మేఁబదిలక్షలవరాలును, ఆరత్నమెనుఁబదిలక్షలవరాలును నేయును.

సుల్తా—ఈవెలలు మీకు సరిపడినవా?

వర్త—మీషరాబుగారు వీనివెలలు చాల తగ్గించి చెప్పిరి అయినను నేమి సేయుదుము? మీకన్న గ్రహింపఁగలవార లింకొక్కరీదేరమున నేలేరు. ఇంత కెక్కువైనమహారత్నము లెన్నియో యోడయందు గలవు. గాన మీరచ్చటికి విచ్చేసి వానిం దిలకించి మీ యిచ్చవచ్చిన వానిం గ్రహింపుఁడు.

సుల్తా—రేపటిదినమున నట్లే రాగలము.

నావిని వారు నావకుఁ జేరిరి.

ఆమరునాఁడు ఢిల్లీసుల్తాను రత్నములఁ జూచుకుతుకంబున గొందఱు సర్దారులతోను ప్రతాపరుద్రునితోను నోడకుఁ జని యందు బ్రవేశించి దాని వైశాల్యమును, వైచిత్ర్యమును సూచుచుండఁ గొంతకాలంబును, అపరిమితంబగు రత్నజాతంబు గాంచుచుండఁ గొంతవేళయు గడచెను. అపుడు వర్తకు లల్పాహారము విందుసేయుఁడని సుల్తానుం బ్రార్థింప నాతఁడు జిహ్వాచాపలంబు ప్రభావంబున నియ్యకొనెను. అంత వారు సిద్ధపఱచినమత్తు వస్తువులను సుల్తానునకు సర్దారులకు నొసఁగిరి. నావికులోడ నడుపసాగిరి. ఢిల్లీశుఁడు సేనాపతులతో గూడ నల్పాహారము గ్రహింపగనే యొడలుమఱచి పడిపోయెను. అత్తఱి నందు డాగియున్న యాంధ్రభటులు సర్దారులతో గూడ సుల్తానుం గట్టివైచిరి. నావికు లాయోడను యమునమీఁదుగా గంగానదినిఁ గంగనుండి సాగరంబును జేర్చి బృందావన పురతీరంబున నిలిపి యట సిద్ధపఱచిన శకటంబులవలనఁ గ్రమంబుగ ఢిల్లీశునితో గూడ ప్రతాపరుద్రుని నేకశిలానగరము చేర్చిరి. ఈ విధంబున మహామంత్రి యుగంధరుండు నీతికౌశలంబున యవనులను బరిభవించి ప్రతాపరుద్రుని నోరుగల్లునకుఁ జేర్చెను. అప్పుడు ప్రతాపరుద్రమహారాజు యుగంధరుని పాదంబులకుఁ బ్రణమిల్లి యిట్లు విన్నవించెను.

మంత్రిసత్తమా! ఏను నీమాట వినక వేటందవిలి రాజ్యభ్రష్టుండ నగుటయగాక శత్రుహస్తగతుండ నైతి. అట్టి నన్ను నీవు నాపాలిటి దేవుండవై గాచితివి. నీమంత్ర

శక్తిచే సంరక్షితంబగు నీసామ్రాజ్యంబెగాక యట్టిదెయగు నాశరీరంబును నీయదియ. ఇట్టినీకు నేనేమి సేయఁగలను? జీవితకాలమెల్ల పరమేశ్వరుంబలె నిన్ను ద్రిశుద్ధిగా నర్చించుచుండుదు. ఏను ప్రమత్తుండనై నీమాట నుజ్జగించి నిమ్మిట్లు పరిశ్రాంతు గావించిన నేరము క్షమియింపుము. అని మంత్రి వరు పాదములమీఁదఁ బడియెను.

అంత నామంత్రివరుండు రాజును లేవనెత్తి మహారాజా! నీచేసిన నేరమేమి? దైవవశంబున సుఖదుఃఖంబులు గలుగుచుండును. అదిగాక, నీవింటనే యున్నచో నామంత్రశక్తి యెట్లు లోకవిదిత మగును! నీచేఁ బోషింపఁబడు మేము నీకు నిక్కట్టు వచ్చినప్పుడు శ్రమింపకున్న మావలన నేమి ప్రయోజనము? మనసంకల్పసిద్ధికి శివదేవు ననుగ్రహము మూలము. పరమేశ్వరు ననుగ్రహమున నాపద నిస్తరించితివి. శత్రుల జయించితివి. తొల్లింటివోలె రాజ్యభారంబు వహించి దుర్వ్యసనంబులం దవులక ధర్మంబునఁ బ్రజలం బాలింపుము. విద్యానాథమహాకవిని బహూకరింపుము. భగవానుని దయచే నెల్లరు సకలసుఖములఁ బడయుదురుగాత యని బోధించెను.

అది మొదలుకొని శ్రీవీరప్రతాపరుద్రనరపతి యుగంధరునకు సమ్మతముగాఁ బుడమిం బెక్కుకాలము శాసించి దిగంత విస్ఫూర్తి గల మహాకీర్తి నార్జించెను

శ్రీ

శివాభ్యాం నమః

తిమ్మరుసుమంత్రి.

ప్రథమప్రకరణము.

మంత్రిపదప్రవేశము.

చ॥ కరచరణాదులందఱకు గల్గినయంతటనే సమర్థతన్
మెరుపడిగాంచ నేర్తురొ మనీషివరుల్ ధరలోన నెవ్వరి
స్ఫురణ ఘటింపుచుం గృతయుగంబున త్రేతను ద్వాపరంబునం
దరయగ సాళ్వతిమ్మసచివాగ్రణికి న్సరిమంత్రి గల్గునే॥
(కుమారధూర్జటి)

ఈమంత్రివంశము.

ఈమంత్రివరుఁ డార్వేలనియోగిబ్రాహ్మణశాఖలోని వాఁడు. ఈయనపూర్వులు సాళ్వవంశ్యులైనరాజులయొక్క మంత్రిపదవులలో నుండువారగుటం జేసి వీరివంశమునకును సాళ్వసంజ్ఞ గలిగియుండెను. ఇతఁడు వేమరాజునకుఁ బౌత్రుండును రాచిరాజునకుఁ బుత్రుండును నగును. ఈయనకు తిమ్మరాజనిపేరు. కన్నడభాషలో అరుసుశబ్దము రాజశబ్దమునకు బర్యాయపదముగాన తిమ్మరుసనుపేరు వాడుకలో నుండెను. ఈయమాత్యునకు గోవిందరాజనుతమ్ముఁడు గలఁడు. ఈయన జన్మస్థానము చంద్రగిరి. తిమ్మరుసు క్రీ. శ. ౧౪౬౦ సంవత్సర

ప్రాంతమున జన్మించియుండెను. ఈయన బాల్యమునందె తలిదండ్రులు స్వర్గస్థులైరి.

విద్యాభ్యాసము

ఈసోదరులు పరస్పరానురాగభరితులై గురుశుశ్రూషాపరత్వమున వింశతివత్సరము లతిక్రమించునంతకు సంస్కృతాంధ్రములయందుఁ బాండిత్యమును, గణితవిద్యయందు నైపుణ్యమును నార్జించి ప్రఖ్యాతిగాంచిరి. అయినను వీరికి రాజనీతి గఱచు నెడఁ గరము కుతూహలము గలిగియుండెను.

ఆసమయమున వృద్ధుఁడైన నాదెండ్లచిట్టి గంగనామాత్యుఁడు రాజనీతివిశారదుఁడై చంద్రగిరిరాజ్యమును బాలించుచున్న సాళ్వనరసింహరాజునకుఁ బ్రధానామాత్యుఁడుగానుండెను. ఆసోదరులీమంత్రివరు నాశ్రయించిరి. చంద్రగిరిరాజ్యమునకు నారాయణవనము రాజధానియగుటంజేసి గంగనామాత్యునకు నదియె నివాస మయ్యెను. ఆమంత్రివరుఁ డీసోదరులను తన దివాణమున లేఖకులనుగా నునిచికొని వీరిప్రజ్ఞావిశేషముం బరికించి వీరురాజనీతివిద్య నభ్యసించు నెడ నభ్యుదయము నందఁగలరని గ్రహించి యొక్కనాఁడు తిమ్మరాజుం దనయింటికి రప్పించి యేకాంతంబున నిట్లనియెను.

ధీమంతుఁడా! నీప్రతిభ స్పృహణీయముగా నున్నది. నీపూర్వులు మహామంత్రులై ప్రఖ్యాతిం గనియున్నవారు. ఏను వృద్ధుఁడ నైతిని. నాకు విదితంబగు రాజనీతివిద్య సర్వంబు నీకు గఱపెద. కాని సనాతనధర్మరక్షణార్థమై ప్రతిష్ఠాపిత మైన

యీసామ్రాజ్యము పరాధీనము గాకుండ గావవలయు నను మాట మఱువకుండవలయు.

నేటి రాజ్యాంగపరిస్థితు లెట్లున్నవో గమనింపుము. సంగమరాజవంశంబున బుద్ధిహీనులు వొడమి సామ్రాజ్యంబు బాలింపఁజాలకున్నారు. బెడందకోటసుల్తాను గర్నాటరాజ్యంబు గబళింపఁ జూచుచున్నాఁడు ఒడ్డెరాజగు పురుషోత్తమ గజపతి విజయనగరసామ్రాజ్యంబుమీఁదికి దండయాత్ర లొనరించుచున్నాఁడు. ఈప్రభుత్వమును దక్షిణహిందూస్థానమున బలపఱుప నెంచి యీసాళువనరసింహనరపతిని విజయనగర సామ్రాజ్యమున నభిషిక్తునిఁ జేయ దృఢసంకల్పముతోఁ బలు నాళ్లనుండియు బ్రయత్నించుచుంటినిగాని నాకోర్కె నెఱవేర దయ్యెను. దక్షిణభారతభూమియవనాక్రాంతము గాకుండునట్లు గాచుట ముఖ్యకర్తవ్యము. ఈమహాకార్యమునకు గడంగుదు నని నీవు వాగ్దానము సేసినచో నీకు రాజనీతిమర్మంబుల బోధింతునన విని యమ్మహానీయునకుఁ దిమ్మరా జిట్లని విన్నవించెను. మంత్రిశేఖరా! ఇంతకన్న నవశ్యకర్తవ్య మేమి కలదు? ధర్మరక్షణార్థ మగు హైందవసామ్రాజ్యస్థాపనము నెడ నాజీవితము వినియోగింతును. రాజనీతిని సమర్మకముగా దెలిపి యనుగ్రహింపుము. అన విని యామంత్రివర్యుఁడు రాజనీతివిద్య సరహస్యంబుగా నేర్పెను.

ఆకాలమున తుళువయీశ్వరరాజుకొమరుఁడైన నరసరాజు సాళువగుండయనారసింహనరనాథునకు సేనాధ్యక్షుఁడై తదనుమతంబున గుత్తినగరము నేలుచుండెను. ఆనరసరాజు

తిమ్మరుసుమంత్రి దగుప్రతిభావిశేషము నాలించి యీాయనను దనకు ముఖ్యమంత్రినిగాఁ జేసికొనియెను. తరువాత గంగనా మాత్యుఁడు పరలోకమున కేగెను.

ద్వితీయప్రకరణము.

విద్యానగర సామ్రాజ్య సంపాదనము.

తరువాత నొకరాజకీయవిప్లవము సంప్రాప్త మయ్యెను కర్ణాటరాజ్యమును బాలించుచున్నయిమ్మడి విరూపాక్షరా యలు దుర్మార్గగామి యగుటం జేసి జనకంటకుఁడై రాజ్యతం త్రము నడుపఁ జాలకుండెను. అది గ్రహించి సామంతులు స్వతం త్రులైరి. దీనింబట్టి వీని జ్యేష్ఠపుత్రుఁడు జనకుని సమయించెను. వానియనుజుం డన్నను దునిమి తాను ప్రభుఁడయ్యెను. కాని వీఁడును దండ్రియె మేలనిపించువాఁడే యగును.

అప్పుడు తిమ్మరుసు విద్యానగర సామ్రాజ్యవిప్లవముం దెలిసికొని గురుండగు గంగనామాత్యుని యుపదేశముం దలంచి యిట్లు యోజించెను. ఇప్పు డుపేక్షించునెడ విజయన గరసామ్రాజ్యము యవనులవశమగును. దానం జేసి హైందవ సామ్రాజ్యంబుతో సనాతనధర్మంబును నశించును. అని యోజించి నరసారాయనింగాంచి నరేంద్రా! విద్యానగరపరి స్థితి నాలించితివిగదా? ఈరాజ్యంబు యవనాక్రాంత మగునేని మనరాజ్యంబెగాక మనమతంబును నంత మొందును. గాన నాలసింపక యీాకర్ణాటరాజును దొలగించి మనసాళ్వనరసిం

హాభూపాలుని విద్యానగరసింహాసనమున నిలుపుదము. ఇట్లు గావించి హైందవసామ్రాజ్యము నుద్ధరింతమని బోధించెను.

అద్దానికి నరసరాజు సమ్మతించి యవ్వార్త సాళ్వనరసింహరాజునకుఁ దెలిపితదనుమతి సేనల నాయత్తంబుసేసికొని తిమ్మరుసుంగూడి వెడలి విద్యానగరంబు సేరెను.

నరసింహరాయనికీర్తి యంతటను విదితమైయుండుటచే తత్సేనాపతి యైన తుళువనరసరాజు నెదుర్కొనవచ్చుటిదండనాథులలో నెవ్వారును సాహసింపరైరి. దానం జేసి నగరమునకు నష్టముగలుగకుండునట్లు నరసరాయఁడా పురము ప్రవేశించి రాజభవనము సమీపింప విద్యానగరాధ్యక్షుఁ డైనప్రౌఢదేవరాయలు దిడ్డివాకిట వెడలి పురంబు విడిచి పఱచెను. అంతట నరసారాయఁడు రాజభవనంబు ప్రవేశించి యాయుధాగారములు లోనగునవి వశపఱచుకొనెను.

తరువాత తిమ్మరుసుమంత్రి సాళ్వనరసింహక్షితీశుని రప్పించి పట్టాభిషేకము గావించెను. నరసింహరాయఁడు పరలోకగతుఁ డైనపదంపడి యాయన పెద్దకుమారుఁ డైనతిమ్మరాయడు బాలుఁడైనను నాతనినే పట్టాభిషిక్తునిఁజేసి నరసరాయనిసాహాయ్యంబున రాజ్యభారము నిర్వహించుచుండెను. అది సహింపక యొకసేనాపతి రహస్యముగ బాలరాజును జంపించి నరసరాజె రాజ్యలోభమున నట్లుసేసెనని యపనింద గలిగించెను. దీనికిఁ బ్రతివిధాన మేమని నరసరాయఁడడుగ తిమ్మరు సిట్లనియె. శత్రుని నణఁచు తెఱఁగు పిమ్మట నాలోచిఁ

తము, తొలుత నరసింహరాయనిద్వితీయపుత్రుఁ డగునిమ్మడి నరసింహరాయనిఁ బట్టాభిషిక్తునిఁ జేసి యపయశంబు వాపి కొనుమని చెప్పి యట్లు సేయించెను.

పిమ్మట నాసేనాపతి యీయిద్దరపై మచ్చరంబున నిమ్మడినరసింహరాయనితో మైత్రి నార్జించికొని వీరల వెడల గొట్ట యత్నించెను. అది గనిపట్టి తిమ్మరుసుమంత్రి కపట మిత్రునితో మైత్రి విడువుమని యెంతజెప్పినను నాతఁడు వినకున్న నరసరాయనితోఁగూడ పెనుగొండ కేగి బహుళసైన్యంబులతో విద్యానగరము ముట్టడించి నీభ్రాతృహంతకుఁ డగు దుర్మిత్రుని శిక్షించెదో లేక రాజ్యంబు విడిచెదో తెలుపుమని వార్తనంపి నిర్బంధింప నతఁడు సేయునదిలేక దుష్టసేనాపతిని జంపించి యాతనిశిరము నరసారాయనియొద్ద కంపెను. అంత నిమ్మడి నరసింహరాయని నటనుండి తొలగించి వేరొకదుర్గంబున నునిచి నరసారాయఁడె కర్ణాటకరాజ్యంబు బాలించు చుండెను.

అప్పుడు కొందఱకుఁ బ్రథమకర్ణాటకరాజవంశమునను మఱికొందఱకు సాళువనరసింహరాజువంశ్యులయందును బక్షపాతము గలిగియుండెను. తిమ్మరుసుమంత్రికి వారియెడ ద్వేషము లేదుగాని భారతదేశము హైందవులవశమున నుంటయే ముఖ్యమని యుద్దేశము కలదు. పూర్వరాజవంశ్యుఁడే కావలయునని వానికే పట్టముగట్టితమేని వాఁడసమర్థుఁ డగునెడ సామ్రాజ్య మంతరించును. రాజు తనమాట వినని చో మంత్రి యెంతటినేర్పరియైన నేమిసేయఁగలఁడు? అనియెంచి

యీమంత్రివర్యుఁడు నరసరాయనినే సార్వభౌముని గావించి సాళువ యిమ్మడి నరసింహరాయనిని పెనుగొండదుర్గమున నునిచెను.

తుళువనరసారాయనికి తిప్పాంబ, నాగాంబ, ఓబాంబ లనిముగ్గురు పత్నులుండిరి. ఈయనకు తిప్పాంబయందు వీరనరసింహరాయఁడును, నాగాంబయందు కృష్ణదేవరాయఁడును ఓబాంబయందు నచ్యుతదేవరాయఁడు రంగరాయఁడును నిట్లు నల్వురు కుమారులు గలిగిరి.

నరసారాయనికి ద్వితీయభార్యయందు నధికానురాగము గలదు. ఆమెకుమారుఁ డైన కృష్ణదేవరాయనికి తిమ్మరుసుమంత్రి విద్యాగురుఁ డయ్యెను. కృష్ణదేవరాయఁడు సోదరులలో బుద్ధికుశలుఁడుగా నుండెను. ఈకారణములనుబట్టి తిమ్మరుసుమంత్రి కృష్ణదేవరాయనికే పట్టముగట్టించు నవి యెంచి తిప్పాంబ కృష్ణదేవరాయనికి విషము వెట్టింపయత్నించెను. రాజ్యాంగముతోఁబాటు అంతఃపురజనంబును దనవశమున నున్నకారణమున నది గనిపట్టి తిమ్మరుసుమంత్రి కృష్ణదేవరాయనిం గాపాడెను. అట్లు తిప్పాంబ ముమ్మాఱు యత్నించినను గాపాడి యదిమొదలుకొని యాతనిం దనయింటనే యునిచికొనియెను. కృష్ణదేవరాయండును నది గ్రహించి తిమ్మరుసుమంత్రిని అప్పాజీ (నాయనగారూ) అని పిలుచుచుండెను.

తృతీయప్రకరణము.

కృష్ణరాయవిద్యాశిక్షణము.

కృష్ణదేవరాయఁడు పదునెనిమిదివత్సరముల యీడునకు నాంధ్రగీర్వాణభాషావైశద్యమును, కర్ణాటహిందీభాషలయం దభిజ్ఞానమును, సాముగరిడీలయందు బాటవమును, విలువిద్యయందు నైపుణ్యమును, అశ్వగజారోహణాదులయందు నిరుపమానతను నేర్చి యశ్వరేవంతుఁడని పేరొందెను. ఈతనిబుద్ధికౌశలమునకు నలరి తిమ్మరుసుమంత్రి రాజనీతిని స్వయముగా నేర్పెను.

ఇంతలో క్రీ. శ. ౧౫౦౩ సంవత్సరమున నరసరాయఁడు మృతినొందెను. అప్పు డాతని పెద్దకుమారుఁడైన వీరనరసింహదేవరాయఁడు సింహాసన మాక్రమించుకొని తానే సార్వభౌముఁడనని ప్రకటించెను. దానికిఁ దిమ్మరుసుమంత్రియు సమ్మతించి పట్టాభిషేకము గావించెను. కర్ణాటదేశములోనిసామంతులు పెక్కురు దిరస్కరించి కప్పములు చెల్లింపకుండిరి. తిమ్మరుసుమంత్రి యాలోచించి తురుష్కులనుండి యుపాయము కలుగకుండ తుంగభద్రాతీరమున గొంతసైన్యమును, గజపతు లాక్రమింపకుండ నుదయగిరిప్రాంతమున గొంతసైన్యమును గాపుపెట్టి వీరనరసింహరాయని దక్షిణదిగ్విజయమునకును కృష్ణదేవరాయనిం గర్ణాటదేశవిజయమునకును ననిపి రాజ్యభారము నిర్వహించుచుండెను.

కృష్ణరాయనివిజయము.

కృష్ణదేవరాయఁడు బహుసేనాసమన్వితుఁడై కర్ణాటమునకు దాడివెడలి యుమ్మత్తూరు ముట్టడించి మూడునెలలు ఘోరసంగ్రామ మొనర్చి దుర్గము వశపఱుచుకొనియెను. కావేరీకనుమలలో నున్నశత్రువుల జయించి యొకయేడెల్ల పోరాడి శివసముద్రము నాక్రమించి కర్ణాటకమునకు నంతకు శ్రీరంగపట్టణము ముఖ్యస్థానము గావించి శంఖచక్రములు గలధ్వజము నెత్తించి కర్ణాటదేశములోని సామంతులందఱు నేఁటేట నొకకోటిధనము గప్పము గట్టునట్లు విధించి మరల విద్యానగరము ప్రవేశించెను. ఈవిజయమువలన కృష్ణరాయనికీర్తి దేశమంతటను వ్యాపించెను. తిమ్మరుసుమంత్రి తన శిష్యుఁడైనరాయనివిజయమునకు నానందించెను.

వీరనరసింహరాయని విజయము.

అట వీరనరసింహరాయఁడు దక్షిణదేశంబునకు దాడివెడలి యచ్చటివైరులను సంహరించుచు దక్షిణసముద్రము వనుకఁ బోయెను. పాండ్యచోళచేరదేశపురాజులు సుంకములు చెల్లించిరి. అతఁడు సామ్రాజ్య మంతయు సంచరించి తనప్రభుత్వమును నిలిపి భుజబల వీరనరసింహరాయఁడని ప్రసిద్ధి నార్జించి రెండుసంవత్సరములకు రాజధాని ప్రవేశించెను.

ఇట్లు వీరనరసింహరాయఁడు దిగ్విజయము గావించి మహారాజాధిరాజ రాజపరమేశ్వరుఁడు మొదలగు బిరుదముల వహించి యాఱేండ్లు పరిపాలనము సేసెను. క్రీస్తుశకము ౧౫౦౯ వసంవత్సరమున జాడ్యగ్రస్తుఁడై యవసానకాలమున- తిమ్మరు

సును బిలువనంపి మంత్రివర్యా! నాయనంతర మెనిమిదేండ్ల యీడు గలనాకుమారుఁడైన తిరుమలదేవరాయనికిఁ బట్ట ముగట్టి నీవ రాజ్యము నిర్వహింపుము. తరువాత కృష్ణరా యనికిఁ బట్టము గట్టుదువో యని నీయెడ ననుమానము గలదు.గాన నీవిపుడు కృష్ణరాయని గన్నుల బెఱికించి నాకుఁ జూపుము.అట్లు సేసినంగాని నాప్రాణములు వోనేరవుగాన తడయక యిప్పని గావింపు మనియెను. ఆమాట విరుద్ధము గానున్నను తిమ్మరుసుమంత్రి 'రాజా! ఇదెంతపని? నీకోరిక తీర్చెదనని సెలవుగొని నెలవునకుం బోయి యిట్లు చింతించెను.

ఆహా! విద్యాబుద్ధులు గఱపి కృష్ణరాయనిం బెనిచితిని. ఏను బెనిచినవానిం ద్రుంచివేయ తేడాజ్ఞయిచ్చెను. ఇతఁ డెం తదుష్టచిత్తుఁడు? కృష్ణరాయఁడే సామ్రాజ్యము నిర్వహింపఁ జాలుగాని యెనిమిదేండ్లవానితో నేమి కార్యమగును? అశ్వప తులను గజపతులను జయించి సామ్రాజ్యము వృద్ధిపఱుపవల సియున్నది. గాన నెట్లేని రాయనిం గాపాడుట ముఖ్యకర్తవ్య మని యెంచి కృష్ణరాయనిం బిలిపించి యాయనకు రాజాజ్ఞ దెలిపెను. ఆమాట వినఁగనే కృష్ణరాయఁడు తనకన్నులు వెఱి కింపనె మంత్రి తన్ను బిలిపించెనని యూహించి తిమ్మరుసుపాద ములమీద వ్రాలి 'అప్పాజీ!నన్ను నెన్నిమార్లో మృత్యుముఖ మునుండిరక్షించితివి. కుమారునింబలె పెనిచితివి. మాయన్నకు గాని సామ్రాజ్యమునకుగాని నేనేమిద్రోహము సేసితి? ఏను సామ్రాజ్యకాంక్షతో దనకొమరునకు పదంపడిద్రోహము సేతునేమొకోయని యతఁడు శంకించి యుండనోపు. ఈసామ్రా

జ్యంబువలదు. జోగినై చరింతుగాన నన్ను రక్షింపుము. రక్షింప వీలులేనిచో కన్నులు వెలికితీయనేల? శిరశ్ఛేదమే గావింపుము. అనివందురెను. అప్పుడు తిమ్మరుసుమంత్రి రాయనిం గాంచి భయ మొందకుము. నిన్ను సామ్రాజ్యమున నభిషిక్తునిఁ జేయుదు, మీయన్న యూపిరివిడుచునందాక నిటడాగియుండుమని బోధించి మేకకన్నులు దెప్పించి వానింగొనిపోయి నరసింహరాయనికిఁ జూపెను. అతఁ డాకన్నులుజూచి సంతసించి యుసురులు బాసెను. ఆతనియౌర్ధ్వదైహికకృత్యములు జరుగగనే కృష్ణరాయనిం జక్రవర్తిగా బ్రకటించెను. అయినను తిమ్మరుసుప్రతిభావిశేషము కర్ణాటరాజ్యమునకు సర్వాంగరక్షగా నున్నకతన రాయనిపట్టాభిషేకము నడ్డగించువారు లేరైరి.

చతుర్థప్రకరణము

కృష్ణదేవరాయ పట్టాభిషేక నిర్వహణము.

తిమ్మరుసుమంత్రి 1509–వ సంవత్సరము ఫిబ్రవరి 4–వ తేదీకి సరియైన శుక్లసం॥ మాఘ శు॥ చతుర్దశినాడు విద్యానగరమున మహామండలేశ్వరులైన మహారాజుల సమక్షమున శ్రీకృష్ణదేవరాయని వజ్రసింహాసనమునఁ బట్టాభిషిక్తుని జేసెను రాయఁడు రాజ్యభారమునంతను తిమ్మరుసుమంత్రిమీదనే యునిచి విద్యావినోదమున నుండుచుండెను.

తిమ్మరుసు హితబోధ.

ఒకనాఁడు కృష్ణదేవరాయఁడు మంత్రి నవలోకించి అశ్వపతులను గజపతులను జయింప వెల్వడవలయునని వేగిరింప నతం డిట్లనియె. శత్రుజయమునెడ వేగిరపాటు కార్యసాధకము గాదు. సోదరపుత్రుని దిరస్కరించి రాజ్యమాక్రమించితివి. నీకుఁ బ్రబలశత్రులు గలరు. దండయాత్ర కేగుటకు దగు సాధనసంపద గూర్చుకొన రెండుసంవత్సరముల కాలము వ్యవధి కావలయును. అనివచించి పదిలక్షలపదాతులను ముప్పదియాఱువేలయాశ్వికులను ఎనమన్నూఱునేనుఁగులను నపరిమితధనంబును గూర్చి దక్షిణదిశను నిష్కంటకము గావించి విద్యానగరమునకుఁ దనతమ్ముఁ డయినగోవిందరాజును సంరక్షకునిగా నియమించి రాయనిం బ్రోత్సహింపఁ నప్పుడు తిమ్మరుసుమంత్రికి సర్వసేనాధిపత్యమున నభిషేకము గావించెను.

అనంతరము కృష్ణదేవరాయఁడు బహుళసేనాబలసహితుఁడై క్రీ. శ. ౧౫౧౩ వసంవత్సరమున పూర్వదిగ్విజయమునకై వెల్వడి యుదయగిరి ముట్టడించి రెండేండ్లు గజపతిసేనలతోఁ బోరి యది వశపఱచుకొనియెను. తరువాత వినుకొండదుర్గము నాక్రమించి కొండపటిదుర్గము గజపతులకు ముఖ్యస్థాన మగుటంజేసి దానిని ముట్టడించెను. అట ఘోరసంగ్రామము గావించి కొండవీడు వశపఱచుకొని కృష్ణవేణికి దక్షిణదిశను గజపతులప్రభుత్వము లేకుండ జేసెను.

కృష్ణదేవరాయనిసాహసము.

రాయఁడు కొండవీటిరాజ్యమును తిమ్మరుసునకు నధీనముసేయ నామంత్రి రాయని విడువనొల్లక తనమేనల్లుఁడైన నాదెండ్లఅప్పామాత్యుని దాని కధిపతినిగా నియమించెను. రాయఁడావిజయంబునం గర్వించి ప్రతాపరుద్రగజపతికి నివాసమైన కటకము నాక్రమింపఁ దలపెట్టెను. అప్పుడు తిమ్మరుసుమంత్రి 'రాజా! స్వదేశము వదలి మనము చాలదూర మరుదెంచితిమి. సేనలు బడలిపోయెను. గజపతికి స్వదేశమున బల మధికముగా నుండునుగాన నుడుగుమని బోధించినను వినక రాయఁడు కటకమునకై దాడివెడలెను. అమాత్యుండు సేయునదిలేక విద్యానగరమునుండి యింకను సేనలం దెప్పించి తోడ్పడి రాజమహేంద్రవరము వశము సేసికొనియెను. ఈనగరము నిర్మించిన సేనాని ఆరువీటియిమ్మరాజు. ఈవిధమున కృష్ణాగౌతమీ మధ్యరాష్ట్రము నెగాక గోదావరి కవ్వలనున్న యొడ్డాదిమున్నగుసంస్థానముల నాక్రమించి సింహాచలము చేరెను. రాయఁ డప్పటికిని తనివి నొందక మంత్రి వారించినను వినక తన సేనలను కటకపురి నికటమునకుఁ జేర్చెను.

కృష్ణరాయఁడు వచ్చెననివిని యచ్చటివారు బలభద్రపాత్రుఁడు భీకరపాత్రుఁడు మొదలగుశూరవరు లగుపదునార్వురు సామంతరాజులు గజపతిమహారాజు నవలోకించి కృష్ణరాయనిం బట్టియిత్తుమని శపథములు పన్ని తదనుమతులై మహాసేనలంగూడి రాయని నెదుర్కొనిరి. అప్పు డిరుసేనలకుఁ బలునాళ్ళు ఘోరాహవము జరిగెను. రాయని సేనలు మార్గా

యాలము నొందియుంటను విదేశమున రోగగ్రస్తులగుటను నానాటికిఁ క్షీణింపఁదొడఁగెను. గజపతిసేనలు నానాటికిఁ బెంపొందుచుండెను. అప్పుడు తనకు నపజయము ధ్రువమని రాయనికిఁ దోఁచెను. అంతనతఁడు తిమ్మరుసు నవలోకించి మంత్రివర్యా! ఏను నీమాటవినక సంకటమునం బడితిని. ఇపుడు కర్తవ్య మేమి? అనివేడిన నామహాధిపుఁడుం డిట్లనియె.

పంచమప్రకరణము

తిమ్మరుసునీతికౌశలము.

ఇపుడు సంగరము దుష్కరము. మరలిపో నెంచినను నీమహాగహన మతిక్రమించులోపల మనము వైరులకుఁ జిట్టువడుదుము. దైవయోగమునకుఁ జింతించిన లాభము లేదు. అయినను గొంత నీతిబలము నుపయోగించి చూతునని పలికి యాపత్సమయమున శత్రువంచన మకీర్తికరము గాదనియెంచి పదునాఱుపెద్దపేటికలలో ద్రవిణము నింపి వానిలోపల సామంతరాజులకు దురాశగలదను నర్థముసూచించు లేఖలను వ్రాసి యునిచి వీనిని సామంతరాజులకు నర్పించి ప్రతిలేఖలు వ్రాయించికొని రండని వచించి తమభటులను శత్రుసైన్యములోని కనిపెను. వారాపెట్టెలంగొని మంత్రి చెప్పినచొప్పున గజపతిమహారాజుసన్నిధిమీదుగా బోవుచుండిరి. ఆయన వారలం గాంచి వారిం బట్టి తెప్పించి యాపెట్టెలు పరిశీలింప వానియందు లేఖలు దొరకెను. వానియందిట్లు గలదు. శ్రీకృష్ణదేవరాయలవారు మీపద్ధతుల నంగీకరించెను. మామహారా

జువారికి శత్రుజయమునెడనే సంకల్పముగాని రాజ్యలోభ మే మియు లేదు. మీరు తెలిపినవిధమున గజపతిని బట్టియిత్తురేని మీరు కోరినట్లు గజపతిసామ్రాజ్యమునుమీకే పంచి యీయఁగ లరు అని యుండెను,

ఈలేఖలు చూడఁగనె తనసామంతరాజులు రాజద్రోహమునకు గడంగినట్లు గజపతి నిశ్చయించుకొని వారు రాజ లోభమునఁదనను రాయనికి నప్పగింతురనియెంచి యాతఁ డచ్చోటు విడిచి పారిపోయెను. గజపతి గనంబడమిచే నతఁడు శత్రువులకుఁ జిక్కెనోయని సామంతరాజులు చింతించుచుండిరి. అప్పుడు తిమ్మరుసుమంత్రి రాయనిచే ననుజ్ఞాతుండయి గజపతిసాన్నిధ్యమున కరిగి గజపతికి రాయనితో సంధి కుదిర్చి రాయనికి గజపతి కూఁతు నన్నపూర్ణాదేవి యనునామాంతరముగల తుక్కాంబనిచ్చి వివాహము సేయునట్లు లొడంబఱచి యప్పని జేయించి యిట్లు కృష్ణరాయని సంకటసముద్రమునుండి యుద్ధరించి స్వదేశము ప్రవేశపెట్టెను.

కృష్ణదేవరాయఁడు తిమ్మరుసుమంత్రి దగుమంత్రిప్రభావంబున రాజ్యము నిష్కంటకముగా నేలుచు విద్యావినోదంబునఁ బ్రొద్దుపుచ్చుచుఁ బెక్కురుకవులచేఁ గృతులందుటయు గాక తాను ననేకకృతులొనర్చి జగమున సుస్థిరకీర్తి నిలుపుకొనియెను. కాని చరమకాలమున రాయనికి నపయశంబును తిమ్మరుసుమంత్రివరునకు మహావిపత్తును ననుభవింపకతక్కవయ్యెను.

అంత్యదశ.

అంత్యదశయందు రాయఁడు తనలో దానిట్లు వితర్కించుకొనెను. నాతమ్ముఁడు నాయన్నకొడుకు మున్నగువారు ప్రబలశత్రులుగలరు. ఇట్లుండ నాయనంతరమునా కుమారునకు రాజ్యమెట్లు లభించునని చింతించి తానుండగనే తనకొడుకున కాఱేండ్లవానికిఁ బట్టాభిషేకము సేసి తాను మంత్రియై దుర్బోధలవలన తిమ్మరుసునందును నమ్మకములేక పైకి మంత్రియందు నమ్మకముంచినట్లు నటించుచుండెను. ఇట్లుండ నెనిమిదినెలలకు రాయనిపుత్రుండు జాడ్యగ్రస్తుండయి చనిపోయెను

అంత గొండఱు తిమ్మరుసుకొడుకు గోవిందరాజు రాకుమారునకు విషము పెట్టించెనని దుర్బోధము గావింప నామాట నమ్మి రాయఁడు తిమ్మరుసు మంత్రి ననుజతనుజసహితముగాఁ గారాగారమున బద్ధుం జేయించెను. అయినను తిమ్మరుసుకొడుకు గోవిందరాజు తప్పించుకొనిపోయి కొంత సేనం గూర్చుకొని విద్యానగరము ముట్టడించెను. కాని యప్పుడు రాయఁడతనిపైకి నధికసేనలం బఱుప గోవిందరాజు గొన్నాళ్ళు పోరి వారికిఁ జిక్కెను. అప్పుడు రాయఁడు తిమ్మరుసునెడ నించుకయైన కృతజ్ఞతలేక వారిమువ్వురకన్నులుఁ బెఱికించెను.

తిమ్మరుసుమంత్రి తనకు సంభవించినయనర్థ మంతయు రాజాశ్రయంబునకును రాజ్యతంత్రనిర్వహణమునఁగొన్నియెడ లఁదాను గావించినకుటిలనీతివిధానంబునకును బ్రతిఫలంబని గ్రహించి పశ్చాత్తాప మొంది భగవంతుని ధ్యానించుచు గొంత కాలమునకు నస్థిరతనువు బాసెను.

శివము.

13805